గురువారం
07 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 319

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA & A.P STATES | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



వేధింపులు లేకపోలేదు 10

అభివృద్ధి వేదికలు గ్రామాలు



- గ్రామ స్థాయిలోనే ప్రగతి ప్రణాళికలు అమలు
- సర్పంచులు, కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి
- పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- నిధుల దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు
- ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు
- ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాలు వేదికగానే ప్రగతి ప్రణాళిలు అమలు కావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే మాస్టర్ రిసోర్స్‌పర్సన్స్‌తో బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కే చంద్రశేఖరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రిసోర్సు పర్సన్లను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామాల వికాసానికి సర్పంచులు అంకితభావంతో పనిచేయడానికి కావాల్సిన అవగాహనను, చైతన్యాన్ని కలిగించాలని కోరారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాల ప్రజలను కలుపుకుని సామూహికంగా గ్రామ వికాసానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు, విధులు కేటాయిస్తామని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారుల నిర్మాణం లాంటి ముఖ్యమైన పనులన్నీ ప్రభుత్వమే నేరుగా చేస్తున్నందున గ్రామాల్లో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత పాటించడం, వైకుంఠధామాల(స్మశాన వాటికలు) నిర్మాణంపై పంచాయతీలు ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. గ్రామాల సర్పంచులను, గ్రామ కార్యదర్శులను ఛేంజ్ ఏజెంట్సుగా మార్చే బాధ్యతను రిసోర్సు పర్సన్లు చేపట్టాలని చెప్పారు.

నిధులు, అధికారాల బదిలీల్లో అత్యంత ఉదారంగా ఉంటాం..

గ్రామ పంచాయతీలకు అధికారాలను బదిలీ చేసే విషయంలో, నిధులు కేటాయించే విషయంలో అత్యంత ఉదారంగా ఉంటామని, అదే సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సర్పంచులు, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేసే విధంగా కఠిన చట్టాన్ని రూపొందించినట్లు సీఎం వెల్లడించారు.

ప్రతీ గ్రామ పంచాయతీ తన పరిధిలోని వనరులు, అవసరాలను బేరీజు వేసుకుంటూ ఐదేళ్ల గ్రామ ప్రణాళిక తయారు చేసుకోవాలని, దానికి అనుగుణంగా పనులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామం ఇప్పుడు ఎక్కడుంది? ఐదేళ్ల తర్వాత ఎక్కడికి పోవాలి? ఐదేళ్లలో ఎన్ని నిధులు వస్తాయి? వాటితో ఎలాంటి పనులు చేయాలి? అనే విషయాలను నిర్ధారించుకుని రంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి సూచించారు. చీకట్లో బాణం విసిరినట్లు కాకుండా, లక్ష్యసిద్ధితో గురి చూసి కొట్టాలి. 'గ్రీన్ విలేజ్ క్లీన్ విలేజ్' నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంచడానికి, పారిశుద్ధ్య పరిపరిరక్షణకు, స్మశాన వాటికల నిర్మాణానికి, పన్నుల వసూలుకు మొదటి దఫాలో ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళిక తయారు కావాలని చెప్పారు. ఈ ప్రణాళిక తయారీలో సర్పంచులు, కార్యదర్శులకు రిసోర్సు పర్సన్లు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, గ్రామ వికాసానికి పాటుపడేలా వారిలో స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలించాన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందనే విషయం చెప్పి, అప్రమత్తం చేయాలని చెప్పారు. కొత్త గ్రామీణ తెలంగాణను తయారు చేసే చేంజ్ ఏజెంట్లుగా, మెంటార్లుగా రిసోర్సు పర్సన్లు వ్యవహరించాలని చెప్పారు. ప్రతీ ఆరు నెలలకోసారి రిసోర్స్ పర్సన్స్ తో తాను స్వయంగా సమావేశం అవుతానని సిఎం వెల్లడించారు.

ప్రతీ గ్రామంలో ఒక నర్సరీ తప్పనిసరి.. ఇంటికి కనీసం ఆరు మొక్కలు

'గ్రామంలో' పచ్చదనం పెంచడం గ్రామ పంచాయతీల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలి. ఖచ్చితంగా ప్రతీ గ్రామంలో ఒక నర్సరీ ఉండాలి. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలకు తక్కువ కాకుండా వారు అడిగిన మొక్కల రకాలను సరఫరా చేయాలి. గ్రామంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి. మొక్కల పెంపకం కోసం నరేగా నిధులు వాడుకోవాలి. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి ఇండెంట్ సేకరించాలి. ఎవరికి ఏ మొక్కలు కావాలో అడిగి వాటిని అందించాలి. వీధుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో నీడను, ఆక్సిజన్ ను ఇచ్చే వేప, రావి లాంటి చెట్లు నాటాలి. పొలాల గట్ల మీద కావాల్సిన మొక్కలను రైతులకు అందించాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

'గ్రామంలో పారిశుద్ధ్య' నిర్వహణ కట్టుదిట్టంగా జరగాలి. వీధులు అద్దంలా మెరవాలి. ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారం రోడ్లపై కనిపించకూడదు. ప్రజలు తమ ఇండ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో ఊరిని కూడా అలాగే ఉంచుకోవాలి. రోడ్డుపై చెత్త వేసే వారికి రూ.500 జరిమానా విధించాలి. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించడానికి ట్రై సైకిళ్లను ఏర్పాటు చేయాలి. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి. పాడుపడిన, వాడని బావులను, బోర్లను వెంటనే పూడ్చివేయాలి. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలి. పిచ్చిచెట్లను తొలగించాలి. ప్రతీ ఇంటిలో ఖచ్చితంగా మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. దోమలమందు క్రమం తప్పకుండా పిచికారి చేయాలి" అని ముఖ్యమంత్రి వివరించారు.

ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు

"సొంత స్థలం లేని వారు తమ కుటుంబ సభ్యులు చనిపోతే ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియదు. ఆ బాధ వర్ణణాతీతం. కాబట్టి ప్రతీ గ్రామంలో ఖచ్చితంగా వైకుంఠధామం నిర్మించాలి. దీనికోసం గ్రామ పంచాయతీ స్థలం ఇవ్వాలి. గ్రామ పంచాయతీకి స్థలం లేకుంటే ప్రభుత్వ భూమి వాడుకోవాలి. రెండూ లేకుంటే గ్రామ పంచాయతీ నిధులతో కొనాలి. దాతలు ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే వైకుంఠధామం నిర్మించాలి. అన్ని గ్రామాల్లో ఆరు నెలల్లో వైకుంఠ ధామాల నిర్మాణం జరగాలి" అని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ఎస్‌కే జోషి, ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, ఎండీసీ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, (తరువాయి 4లో)

వరుడు లేని పెళ్లి ఊరేగింపు

- 'మహాఘట్బంధన్'పై శివరాజ్ సింగ్ చౌహాన్
- హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతించని మమత సర్కార్

ఖరగ్‌పూర్: ప్రతిపక్షాల మహా ఘట్బంధన్‌ను మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అపహాస్యం చేశారు. 'మహాఘట్బంధన్ పెళ్లి కొడుకు లేకుండా తీస్తున్న ఊరేగింపు లాంటిది.' అని ఎద్దేవా చేశారు. శివరాజ్ హెలీక్యాప్టర్ దిగడానికి మమత ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో.. రోడ్డు మార్గం ద్వారా ఖరగ్‌పూర్‌కు చేరుకొని మాట్లాడారు.



ఈ సందర్భంగా మమత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మమత ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, అన్ని నిబంధనలు ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అప్రజాస్వామికంగా మమత ప్రభుత్వం వ్యవహరిస్తున్నపటికీ.. ఆమె పాలనకు అడ్డుపడబోమని స్పష్టం చేశారు. మోదీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న మహా ఘట్బంధన్‌కు ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరని ఆయన సూటిగా ప్రశ్నించారు. హెలీక్యాప్టర్ దిగడానికి అనుమతి లభించక పోవడంతో ఆయన పాల్గొనాల్సిన బహిరంగసభలు రద్దయ్యాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాణించే హెలీక్యాప్టర్లు దిగడానికి కూడా మమత ప్రభుత్వం అనుమతించని విషయం తెలిసిందే.

అయోధ్యపై వీహెచ్‌పీ యూటర్న్



- ఎన్నికలయ్యే వరకు 'రామ మందిరం' ఊసెత్తకూడదని నిర్ణయం
- ఊపందుకున్న ఉద్యమానికి తాత్కాలిక విరామం
- కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక భవిష్యత్ కార్యక్రమం
- వీహెచ్‌పీ అంతర్జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ స్పష్టం

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) యూటర్న్ తీసుకుంది. ఎన్నికలయ్యే వరకు రామ మందిర నిర్మాణం ఊసెత్తకూడదని నిర్ణయించింది. అలాగే ఇప్పటి వరకు చేపట్టిన ఉద్యమానికి నాలుగు నెలల పాటు తాత్కాలిక విరామం ఇచ్చింది. వీహెచ్‌పీ అంతర్జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ ఈ విషయాన్ని బుధవారం స్పష్టం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రామమందిర నిర్మాణ అంశం కేంద్రబిందువుగా మారకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. వచ్చే నాలుగు నెలలు ఎలాంటి నిరసనలు చేపట్టబోమన్నారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక మా భవిష్యత్ కార్యచరణను వెల్లడిస్తామని సురేంద్ర జైన్ తెలిపారు. 'ఈ సమయంలో ఒకవేళ మేము ఆందోళనలను కొనసాగిస్తే ఎన్నికల ముందు ప్రజలను ప్రలోభ పెట్టేందుకు ఇవి చేస్తున్నామని వారు అనుకునే ప్రమాదం ఉంది. అంతే కాకుండా ఓ పార్టీకి వంత పాడుతున్నామనే భావన ప్రజల్లో కలుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని నిరసనలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నాం. సార్వత్రిక ఎన్నికలు ముగియగానే రామమందిర నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ కొనసాగిస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. కాగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారుకు ఇబ్బందులు రాకూడన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ తెలిపారు. తమకు బీజేపీ మినహా ప్రత్యామ్నాయం లేదని ఆయన వెల్లడించారు.

రామ మందిర ఉద్యమంపై నీళ్లు?

అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామ మందిరం నిర్మించేందుకు వీలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ దేశవ్యాప్తంగా రామజన్మభూమి ఉద్యమాన్ని ఉధృతం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ర్యాలీలు , ధర్మ సమ్మేళనాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలకు అన్ని పార్టీల ముఖ్యనాయకులను వీహెచ్ ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా గత ఏడాది చివర్లో అయోధ్యలో నిర్వహించిన ధర్మ సమ్మేళనంలో శివసేన అధినేత ఉద్దవ్ ఠాక్రే కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్నారు. ఇక ఇటీవల కుంభమేళాలో నిర్వహించిన ధర్మ సంసద్‌లో దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన, సాధువులు, హిందు సంస్థలతో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఆయన మూడు నెలల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ నాలుగు నెలల్లో మందిర నిర్మాణం పనులు మొదలవుతాయని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టకపోతే తామే రామాలయ నిర్మాణం పనులు చేపడతామన్నారు. అయితే మరోవైపు ఫిబ్రవరి 21నే రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని గత బుధవారం ఇదే వేదిక నుంచి శంకరాచార్య స్వరూపానంద సరస్వతి సంచలన ప్రకటన (తరువాయి 4లో)

అవినీతికి 'చౌకీదార్' మోదీ



- 15 మంది బడాబాబుల కోసం 15లక్షల కోట్ల రుణాల మాఫీ
- ప్రధానిపై రాహుల్ ఫైర్

ఒడిస్సా: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఏఐసీసీ చీఫ్ రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. దేశానికి చౌకీదారుగా ఉంటానని చెప్పిన మోదీ.. అవినీతికి 'చౌకీదారు'గా మారారని ఆయన ఆరోపించారు. ఒడిస్సాలోని భవానిపట్నంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీతో పాటు ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. గిరిజనుల హక్కులను సీఎం పట్నాయక్ కాలరాస్తున్నారని ఆరోపించారు. రైతులు, దళితులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి భూములను మోడీ, పట్నాయక్ ద్వయం స్వాధీనం చేసుకుంటోందని ఆరోపించారు. ఒడిస్సాతో పాటు దేశంలోని దళిత, గిరిజనులను అండగా నిలిచేదీ.. నిలిచింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని స్పష్టం చేశారు. వారి భూములను కాపాడడం కాంగ్రెస్‌తో సాధ్యమని తెలిపారు. మోదీ, పట్నాయక్ పేదల కోసం ఏ మాత్రం పని చేయడం లేదన్నారు. పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం మాత్రమే పని చేస్తున్నారని చెప్పారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు సంబంధించి రూ. 15 లక్షల కోట్ల రుణాల మాఫీ చేసిన ఈ ద్వయం.. రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదన్నారు. వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర అందించడంలో కూడా విఫలమైందని తెలిపారు. ప్రాజెక్టుల కోసం సేకరించి, ఐదేళ్లలో వినియోగించుకోని భూమిని తిరిగి రైతులకు అందిస్తున్నామని ఆయన ప్రకటించారు. ఈ విధంగా ఛత్తీస్‌గఢ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిస్సాలో శాసనసభ ఎన్నికలు (తరువాయి 4లో)

తీవ్ర పరిణామాలు తప్పవు

- బెంగాల్‌లో బీజేపీ నేతలను అడ్డుకుంటే అవస్థలే..
- మమతకు షా హెచ్చరిక



ఆలీఘఢ్(యూపీ): పశ్చిమబెంగాల్‌లో పర్యటించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘఢ్‌లో బుధవారం జరిగిన పార్టీ బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మమతపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక ఆమె బీజేపీ నేతల పర్యటనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. బెంగాల్‌లోని 42 లోక్సభ స్థానాల్లో 23 స్థానాలను గెలుచుకుంటామని, అప్పటివరకూ తాము విశ్రమించమని ప్రకటించారు. 'బెంగాల్‌లో యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్‌ను అనుమతించకుండా అడ్డంకులు సృష్టించారు. నా హెలికాప్టర్ ల్యాండయ్యేందుకు అనుమతించలేదు. ఈ రోజు శివరాజ్ సింగ్ చౌహాన్‌ను అడ్డుకున్నారు. ఈ పరిణామాలతో మమత తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.' అని హెచ్చరించారు. చివరకు ప్రధానమంత్రి మోదీ సభకు కూడా చివరి నిమిషంలో అర్ధరాత్రి (తరువాయి 4లో)

వాద్రాను ప్రశ్నించిన ఈడీ

- భార్య ప్రియాంకతో కలిసి కార్యాలయానికి రాక



ఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగం పర్యవేక్షకురాలు ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మనీ లాండరింగ్ కేసులో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. భార్య ప్రియాంకాతో కలిసి వాద్రా ఈడీ కార్యాలయానికి వచ్చారు. వాద్రా లోపలకు వెళ్లిన తర్వాత ప్రియాంక అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేసుకు సంబంధించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు.

లండన్లో పలు స్థిరాస్తుల కొనుగోలు, స్వాధీనానికి సంబంధించి మనీల్యాండరింగ్ కేసులో వాద్రా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గతంలో, ఢిల్లీ కోర్టు వాద్రాకు ఈనెల 16 వరకూ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. కాగా లండన్లో స్థిరాస్తుల కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలు, ఆస్తుల వివరాలపై వాద్రాను ప్రశ్నించనున్న ఈడీ మనీల్యాండరింగ్ చట్టం కింద ఆయన స్టేట్మెంట్‌ను రికార్డు చేయనుంది. మరోవైపు వాద్రాను ఈడీ ప్రశ్నిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై బీజేపీ విమర్శలతో (తరువాయి 4లో)

బాధ్యతలు చేపట్టిన ప్రియాంక

- రాహుల్ చాంబర్ పక్కనే ప్రియాంక కార్యాలయం
- నేడు అధికారిక కార్యక్రమంలో పాల్గొననున్న యువనేత

4






శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః



శ్రీ వికంబి నామ సంవత్సరం	సూర్యోదయం : ఉ. 06:46	కరణం	: కౌలవ 07:52 తైతుల 21:06
ఉత్తరాయణం	సూర్యాస్తమయం : సా. 06:14	రాహుకాలం	: సా. 1:55, 3:20
శిశిర ఋతువు	పక్షము : శుక్లపక్షం	యమగండం	: ఉ. 6:50, 8:15
మాఘ మాసం	తిథి : విదియ 07:52	వర్జ్యం	: సా. 7:18, 9:06pm
	నక్షత్రం : శతభిష 12:09	అమృతకాలం	: ఉ. 6:02, 7:50am
	యోగం : పరిఘ 10:48		

సూక్తి సుధ



కర్మలను ఆచరించుటయందే నీకు అధికారం కలదు, కాని దాని ఫలితంపై లేదు. నీవు కర్మఫలానికి కారణం కారాదు. అట్లని కర్మలను చేయుట మానరాదు.

– భగవద్గీత



"బంధం.. జగమంతా ఋణానుబంధం"

ఒక తండ్రి 70 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత చనిపోయినప్పుడు పెద్దకొడుకు వయస్సు 40, రెండవకొడుకు వయస్సు 37, మూడవ కొడుకు వయస్సు 33, నాలుగవ కొడుకు వయస్సు 30. సంవత్సరాలు అయితే.. అంటే పెద్ద కొడుకుతో 40 ఏళ్ళు ఉంటే, చివరి నాలుగవ కొడుకుతో 30 ఏళ్ళు మాత్రమే వున్నాడు. ఎందుకు?

మీ అనుభవంలో.. ఒక సంతానం ఏదైనా కోరితే డబ్బులు లేకున్నా అప్పు చేసి వారి కోరిక నెరవేరుస్తాము, కానీ మరో సంతానం ఏదైనా కోరితే చేతిలో డబ్బులున్నా వాడి కోరిక తీర్చాలనిపించదు ఎందుకని? అలాగే కొంతమంది విషయంలో ఎక్కువ ప్రేమ చూపిస్తాం ఎందుకనో? చూద్ధామా!



మనకు పూర్వ జన్మ కర్మల వలననే ఈ జన్మలో..

తల్లి, తండ్రి, అన్న, అక్క, భార్య, భర్త, ప్రేమికుడు, ప్రియురాలు, మిత్రులు, శత్రువులు మిగతా సంబంధాలు.. ఈ ప్రపంచంలో మనకు లభిస్తాయి. ఎందు కంటే మనం వీళ్లకు.. ఈ జన్మ లో..

ఏదో ఒకటి ఇవ్వవలసి లేదా తీసుకొనవలసి రావచ్చును. మనకు సంతాన రూపంలో ఎవరెవరు వస్తారు.

మరి మనకు..

పూర్వ జన్మలో సంబంధం ఉన్న వాళ్ళే ఈ జన్మలో సంతాన రూపంలో జన్మిస్తారు. వాటినే మన శాస్త్రాల ప్రకారం నాలుగు రకాలుగా ఉన్నట్లు చెబుతారు.

ఋణాను బంధం:

గతజన్మలో మనం ఎవరి వద్దనైనా రుణం తీసుకుని ఉండచ్చు లేదా ఎవరో ఒకరి ధనాన్ని నష్టపరచి ఉండ వచ్చు. అటువంటి వాళ్ళు మీకు సంతాన రూపంలో జన్మించి లేదా ఏదైనా వ్యాధి రూపంలో వచ్చి మీ వద్ద ఉన్న పూర్తి ధనం ఖర్చు అయ్యే వరకూ ఉండి ఆ పాత ఖర్చులు సరిసమానం అయ్యే వరకు మనతోనే వుంటారు.

శత్రువులు, పుత్రులు:

మన పూర్వజన్మలో శత్రువులు మనపై వారు తమ తమ కక్షను తీర్చుకోవటానికి మన ఇంట్లో సంతాన రూపంలో తిరిగి పుడతారు. అలా పుట్టి తల్లిదండ్రులతో పెద్దయ్యాక కొట్లాటలు, నానా గొడవలూ చేస్తారు. జీవితమంతా ఏదో ఒక విషయంలో ఏడి పిస్తూనే ఉంటారు. ఎల్లప్పుడు తల్లితండ్రులను నానా యాతన పెడుతూ వాళ్ళ పరువు తీసి వాళ్ళను దుఃఖితులను చేస్తూ.. ఆనంద పడుతుంటారు.

తటస్థ పుత్రులు:

వీళ్ళు ఒక వైపు తల్లి తండ్రులకు సేవ చెయ్యరు.. మరో వైపు సుఃఖంగా కూడా ఉంచరు, వాళ్ళను వాళ్ళ మానానికి వాళ్ళను వది లేసి వెళ్తారు. వాళ్ళ వివాహానంతరం తల్లి దండ్రులకు దూరంగా జరిగిపోతారు.



సేవా తత్పరత ఉన్న పుత్రులు:

గతజన్మలో మీరు ఎవరికైనా బాగా సేవచేసి ఉండవచ్చును, ఆ రుణాన్ని తీర్చుకోవటానికి మీకు కొడుకు లేదా కుతూరు రూపంలో ఈ జన్మలో వస్తారు. అలా వచ్చి బాగా సేవ చేస్తారు.

మీరు గతంలో ఏది చేసుకున్నారో ఇప్పుడు అదే సంప్రాప్తిస్తుంది. మీరు గత జన్మలో ఎవరికైనా సేవ చేస్తే, ఈ జన్మలో మన ముదుసలి తనంలో మనకు సేవ చేస్తారు. లేకపోతే మనకు వృద్ధాప్యంలో గుక్కెడు నీళ్లు పోసే వారు కూడా మన వద్ద ఉండరు. ఇది పూర్తిగా మనుష్యులకు మాత్రమే అమలు అవుతుంది. అని అనుకోవద్దు. ఈ కింద చెప్పిన ప్రకారం ఎలాంటి విధంగానైనా పుట్ట వచ్చును.

ఒక వేళ మీరు ఒక ఆవుకి నిస్వార్థమైన సేవ చేసి ఉండవచ్చును. వాళ్ళే మీ కొడుకు లేదా, కూతురుగా మీ ఇంట పుట్ట వచ్చును. ఒక ఆవుకి తన దూడకు సమంగా పాలు తాగనియ్యకుండా దూరంగా ఉంచిన పాపానికి వాళ్ళే కొడుకు లేదా కూతురుగా మీ ఇంట పుడతారు. లేదా మీరు ఏదైనా నిరపరాధి జీవిని సతాయించారనుకో, వాళ్ళు మీకు శత్రువు రూపంలో పుట్టి మీతో తన గత శత్రుత్వ కక్ష తీర్చుకుంటారు. అందుకనే జీవితంలో ఎవరికీ కూడా కీడు, చెడు చెయ్యవద్దు.

ఎందుకనగా ప్రకృతి నియమం ప్రకారం మీరు ఏది చేస్తే.. దానికి ఈ జన్మలో లేదా వచ్చే జన్మలో నూటికి నూరు శాతం అనుభవంలోకి తెస్తుంది. మీరు ఒకవేళ ఎవరికైనా ఒక్క రూపాయి దానం చేస్తే అది మీ ఖాతాలో నూరు రూపాయలుగా జమ చెయ్యబడతాయి.

ఒక వేళ మీరు ఎవరి వద్దయినా ఒక్క రూపాయి లాక్కుంటే మీ ఖాతా నుంచి నూరు రూపాయలు తీసివేయబడతాయి(అనగా పాప పుణ్యాలు). కొద్దిగా ఆలోచించండి . మీరు మీతో కూడా ఎంత ధనాన్ని తెచ్చుకున్నారు. మళ్లీ ఎంత ధనాన్ని మీ వెంట తీసు కెళ్తారు..? ఇప్పటి వరకు పోయిన వాళ్లు ఎంత బంగారం, వెండి పట్టుకుపోయారు..? చివరగా ఒకమాట! తాత గారు సంపాదించిన ఆస్తినంతా తగిలేసి మాకు ఏమి మిగల్చలేదని ఒక కొడుకు బాధపడతాడు. దానికి కారణం అతనికి తాత తండ్రుల ఆస్తిపాస్తులు అనుభవించే యోగం లేదన్నమాట! అతి బీద కుటుంబంలో పుట్టిన మరో తండ్రి కోట్లాది రూపాయలు సంపాదించి సంతానానికి మిగిల్చి చనిపోతాడు. దీనికి కారణం ఆ తండ్రి , తన కొడుకుకు చెల్లించాల్సిన అప్పన్నమాట! మీ జీవితంలోని సంఘటనలను ఒకసారి బేరీజు వేసుకొని ఆలోచించండి.

నేను, నాది, నీది అన్నది. అంతా ఇక్కడి కిక్కడే పనికి రాకుండా పోతుంది. ఏది కూడా వెంటరాదు. ఒకవేళ మీ వెంట వస్తే గిస్తే మీ పుణ్యపాప ఫలం వెంట వస్తుంది. జీవితమన్నా, సంసారమన్న ఏదైనా అనండి అంతా ఋణానుబంధం. కావున మీరు వాస్తవాలను గ్రహించి, వాస్తవాలను తెలుసుకొని, ఎంత వీలయితే అంత మంచికర్మలు చెయ్యండి.

శుభం భూయాత్ !!

– శ్రీరామ్, హైదరాబాద్

దక్షిణ లేకుండా ఏ యజ్ఞకర్మలు ఫలాన్నివ్వవు

శ్లో॥ నాగ్నిహోత్రం వినా వేదా న చ దానం వినా క్రియా।
న భావేన వినా సిద్ధి స్తస్మాద్భావో హి కారణమ్॥

అగ్నిహోత్రం (యజ్ఞం) చేయకుండ వేదాధ్యయనం వ్యర్థం దానం దక్షిణను ఇవ్వకుండా చేసిన యజ్ఞాదికర్మ నిష్ఫలం. ప్రేమే, భక్తి, శ్రద్ధ లేకుండా పొందిన సిద్ధి సాఫల్యం పొందదు. అందువల్ల శ్రద్ధా భక్తులే అన్నియు సిద్ధించుటకు మూలాలై ఉన్నాయని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. ఇంకా వివరించిన యెడల అగ్నిహోత్రం చేయకుండా కేవలం వేదాధ్యయనం వ్యర్థమని నారదుడు యుధిష్ఠిరుని అడిగాడు. ధర్మరాజు నారదుడిని 'దేవర్షి! వేదం ఎట్లు సఫలమగునని అడుగగా నారదుడు ఈ విధంగా తెలియచేస్తున్నాడు. రాజా! అగ్నిహోత్రంచే వేదాలు సఫలమవుతాయంటున్నారు. అగ్నిహోత్రం పరోపకారానికి, శుభశ్రేష్ఠకర్మలకు ప్రతీకలై (చిహ్నాలు)ఉన్నాయి. వేదాలు చదివి శ్రేష్టాలు, శుభాలు అగు కర్మలు చేయకుండా, పరోపకారం చేయకుండా, పరమేశ్వరుని సాక్షాత్కారం పొందలేడు. అట్టివాని వేదపఠనం వ్యర్థం. దానం, దక్షిణ ఇవ్వని యజ్ఞకర్మ నిష్ఫలం. యక్షుడు ధర్మరాజుని ఈ కింది విధంగా అడుగుతున్నాడు. 'కథం యజ్ఞో మృతం భవేత్' అంటే యజ్ఞం ఏ విధంగా పనికిరానిదగును అని ధర్మరాజుని అడిగాడు. అప్పుడు ధర్మరాజు 'మృతో యజ్ఞస్త్వదక్షిణః।' అంటే దక్షిణ ఇవ్వని యజ్ఞం చేసినా అది



చాణక్యం

నష్టమైనదిగాను, నిష్ఫలం గాను వ్యర్థమగుతుందని చెబుతున్నారు. యాగాలు, యజ్ఞ కర్మలు నిర్వర్తించినప్పుడు వాటి ఫలాలు మనకు చెందాలంటే అవి పూర్తయిన తదనంతరం వాటిని చేయించిన బ్రహ్మలు, ఋత్విక్కులకు తప్పనిసరిగా దక్షిణ ఇవ్వాల్సి ఉంటుందని, అలా ఈయని పక్షంలో వాటి ఫలాలు యజమానికి(అంటే వాటిని నిర్వర్తించినవారికి) ఫలాలు దక్కవని చాణుక్యుల వారు తమ నీతి శాస్త్రంలో తెలియపరుస్తున్నారు. దానికి పైన నారదుడు, ధర్మరాజు ఉదంతాలు పేర్కొన్నారు. ఇంకా వేదాధ్యాయనలు చేయించుకున్నప్పుడు, అగ్నిహోత్ర కర్మలు నిర్వహించుకున్నప్పుడు తప్పనిసరిగా దక్షిణ ఈయవలసిన అవసరం ఉంటుందని తెలుపుతున్నారు. లేని యెడల చేయించుకున్నవన్నీ వ్యర్థాలంటున్నారు. వాటి ఫలితాలు కూడా యజమానులకు వర్తించదంటున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

ధర్మ సందేహాలకు సమాధానాలు

అష్టకష్టాలంటారు కదా.. ఏమిటో వివరించండి?

1. **దేశాంతర గమనమ్:** తాను పుట్టిన ఊరు వదలి బలమైన కారణంవల్ల దేశాంతరం బ్రతకడానికి వెళ్ళి నివసించే దుస్థితి.
2. **భార్యవియోగం:** తన ఆలోచనలో మంత్రిగా, సేవించేటపుడు దాసిగా, భోజనం పెట్టడంలో తల్లిగా, రూపంగా లక్ష్మిగా తన ముందు కదలాడుతూ భూమికున్నంత ఓర్పు కలిగి, అనేక గొప్ప గుణాలతో విరాజిల్లే మహాతల్లి స్త్రీ మూర్తి. అంత గొప్ప స్త్రీ మూర్తి తన సహధర్మచారిగా పొందడం అదృష్టం. అలాంటి సహ ధర్మ చారిణి దూరం కావడం.
3. **ఆపద్బంధు దర్శనం:** బీదరికంతోనో, ఏ ఇతర కారణాల వల్లనో ఆపదల్లో ఉన్న సమయంలో బంధువుల దర్శనం కలగడం.
4. **ఉచ్ఛిష్ట భక్షణం(ఎంగిలి తినడం):** వివిధ కారణాల వల్ల ఎంగిలి తినే పరిస్థితి రావడం.
5. **శత్రు స్నేహం:** శత్రువు దుర్మార్గుడని తెలిసినా ఏదో అవసరం కొరకు వానితో స్నేహం చేసే పరిస్థితి రావడం.
6. **పరాన్న ప్రతీక్షణం:** అసమర్థత వంచనకు గురికావడం, ఏ ఇతర కారణం వల్లనో తనకున్నది కోల్పోయి ఇతరుల పంచన చేరడం.



7. **భంగం:** పదిమందిలో తల ఎత్తుకోని తిరగలేని పరిస్థితి కలగడం
8. **దారిద్ర్యం:** ఆర్థిక పరిస్థితులు బాగాలేక కష్టాలతో జీవితాన్ని నెట్టడం ఈ ఎనిమిదింటిని అష్టకష్టాలుగా చెప్పారు.

– డా॥ పి. భాస్కరయోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. అగ్ని పురాణంలో ఉన్న శ్లోకాలు ఎన్ని?
2. అగ్ని పురాణం చెబుతున్నది ఏమిటి?
3. కుంతి యముని ద్వారా పొందిన కుమారుడు?
4. భీష్మ అంటే అర్థం?
5. పంచజనుని శరీరం నుండి శ్రీకృష్ణునికి లభించిన శంఖం?
6. హయగ్రీవునికి గల మరో పేరు?
7. ఏ మహర్షి యాగ సంరక్షణకు రామలక్ష్మణులు వెళ్లిరి?
8. దాతకు దేనిమీద మమకారం ఉండకూడదు?
9. పరశురాముడు ఏ మన్వంతరంలో సప్తర్షులలో ఒకడగును?
10. జమదగ్ని మహర్షిని చంపినవారు?

జవాబులు (తలకిందులుగా ముద్రించబడినవి)

1. 15, 400

భూమి నుండి గ్రహాల దూర పరిశీలన

వేద విజ్ఞానం

భాగం-92

వాటి వాటి కక్షలలో గ్రహాల గమనాలు ఒకే విధంగా ఉంటాయని అనుకోవడం జరిగింది. ఖగోళ పరిధిని ఒక కల్పంలో సంభవించగల గ్రహాల పరిభ్రమణాల సంఖ్యతో భాగిస్తే, గ్రహాల కక్షల పొడవులు (పరిధులు) తెలుస్తాయి. దీని ప్రకారం గ్రహాల ప్రదక్షిణ కాలం వాటి కక్ష పరిధులకు అంటే, భూమి నుండి వాటికి గల దూరాలకు అనుపాతంలో ఉంటుందని భావిస్తున్నారు. ఆధునిక జ్యోతిశ్శాస్త్రానుసారం ఇది తప్పని తెలుస్తోంది. కేప్లర్ ద్వారా ఆవిష్కృతమై న్యూటన్ ఇతర శాస్త్రజ్ఞులు ద్వారా నిరూపించబడిన ప్రకారం గ్రహం ప్రదక్షిణ కాలం వర్గం, సూర్యుని నుండి ఆ గ్రహం దూరాల ఘనానికి అనుపాతంలో ఉంటుంది.

భూమి నుండి గ్రహాలకు దూరం

సూర్య సిద్ధాంతాన్ని అనుసరించి, భూమికి సూర్యునికి మధ్యగల దూరం 689430 యోజనాలు, అంటే భూవ్యాసార్ధానికి 862రెట్లు. కాని ఆధునిక అభిప్రాయాలను అనుసరించి ఈ దూరం భూవ్యాసార్ధానికి 23300 రెట్లు. ఈ ప్రకారం మన సిద్ధాంతాల్లో తెలియచేసిన సూర్యునికంటే దూరంగా ఉన్న గ్రహాల దూరాల్లో దోషాలు మరీ ఎక్కువుగా ఉన్నాయి. ముందుగా ఖగోళ కక్ష పొడవును, వాటి వాటి కక్షలలో, గృహాల రోజువారీ సగటు గమనాలను(యోజనాల్లో) ముందుగా నిర్ణయించి, పరిశీలనలు చేసిన తరువాత గ్రహాల కక్షల పొడవులను, వాటి భ్రమణకాలాలను మన శాస్త్రజ్ఞులు కనుగొని ఉండాల్సింది. కాని అలా కనుక్కోలేదు.

మన శాస్త్రజ్ఞులు పరిశీలన ద్వారా గ్రహాల భ్రమణకాలాలను, చంద్రుని కక్ష పొడవును ముందుగా నిర్ణయించి, ఆ తరువాత వీటని ఆధారంగా చేసుకొని, ఖగోళ కక్ష పొడవును, గ్రహ కక్షల పొడవులను నిర్ణయించారు.

పంచసిద్ధాంతిక, గ్రహాల కక్షల పొడవులను, ఖగోళ పరిధిని, యోజనాల్లో తెలుపలేదు. అదేవిధంగా చంద్రకక్ష పొడవును కూడా తెలుపలేదు. అందుచేత ప్రాచీన సూర్య సిద్ధాంతంలో ఈ విషయాలు ఏమీ లేవు. కాని ఆధునిక సూర్య సిద్ధాంతంలో ఈ కొలతలు ఉన్నాయి. ఆధునిక సూర్య సిద్ధాంతం పంచ సిద్ధాంతిక కంటే ప్రాచీనమైనదని ఈ రచయిత అభిప్రాయం. అయితే, గ్రహకక్షల పొడవులు తర్వాత కాలంలో ప్రక్షిప్తాలుగా ప్రవేశపెట్టి ఉండొచ్చు. అదేమీ అసంభవం కాదు. (శక.550లో సంకలనం చేసిన ప్రాచీన గ్రంథమైన బ్రహ్మసిద్ధాంతంలో ఈ వివరాలు లభిస్తున్నాయి. కాబట్టి, సూర్యసిద్ధాంతంలో ఈ వివరాలు ఉన్నాయంటే, అవి శక.550 తరువాత శీఘ్రకాలంలో ప్రవేశించి ఉండాలి)

ఇక రెండవ విషయం, మొదటి ఆర్యసిద్ధాంతం తప్ప మిగిలిన సిద్ధాంతాలన్నీ చంద్రకక్ష ఒక నిమిష కోణానికి 15 యోజనాలనే మానాన్ని తెలియచేశాయి.

మూడవ విషయం గ్రహాల కక్షలు స్థిరమైనవి, గ్రహాలు ఈ మార్గంలోనే తిరుగుతాయి. ఈ కక్షల ప్రదేశాలు మారవు. అందుచేత గ్రహాలన్నీ ఒక కల్పంలో, ఆకాశంలో ఒక ప్రదక్షిణ మాత్రమే చేస్తాయి అనడంలో అర్థం లేదు. భాస్కరాచార్యుల వారు సిద్ధాంత శిరోమణిలో కక్షాధ్యాయంలో దీనిని స్పష్టం చేస్తూ...

బ్రహ్మాండమేతన్మితమస్తు నో వా కల్పే గ్రహః క్రామతి యోజనాని।
యావంతి పూర్వైరిహ తత్ప్రమాణం ప్రోక్తం స్వకక్షాఖ్యమిదం మతం నః॥

విశ్వం, ఖగోళ పరిధి వల్ల, పరిమితం కావచ్చు లేక కాకపోవచ్చు. ఒక కల్పంలో ఒక గ్రహం ఎన్ని యోజనాలు ప్రయాణిస్తుందో, దానిని ఖగోళ కక్షా పరిధిగా పూర్వ ఆచార్యులు నిర్వహిస్తారని ఈ రచయిత (దీక్షిత్) అభిప్రాయపడ్డాడు.

మన జ్యోతిశ్శాస్త్రవేత్తలు చంద్రకక్షను, గ్రహాల ప్రదక్షిణ కాలాల సహాయంతో గ్రహకక్షల పొడవులను నిశ్చయించారు. వీరు ఈ విధంగా నిశ్చయించడానికి ఆధారభూతమైన సిద్ధాంతం – ప్రదక్షిణకాలం, గ్రహకక్ష పొడవు ఒక నియమితమైన అనుపాతంలో ఉంటాయనేది సరైనది కాదు. అందుచేత గ్రహకక్షల పొడవులు తప్పు అని నిరూపించారు. అంతేకాదు, ఖగోళకక్ష పరిధి పొడవు ఒక అభూత కల్పన అని తేలింది.


– డా॥ రేమెళ్ల అవధానులు

చతురంగబలేశ్వరీ

బహుపరాక్! రాజరాజార్చిత మహారాజ! పంచకోశాలకు, పంచభూతాలకు అధిపతియైనా కూడా ఆహ్లాదకరంగా సగుణ రూపంలోకి మారి, శ్రీ రాజరాజేశ్వరీదేవిగా సాక్షాత్కరించి దర్శనమిస్తున్నది, బహుపరాక్! అష్టవిధ ప్రకృతికి ప్రతిబింబంలా తన మహిమను చూపిస్తూ ధర్మాన్ని, అర్థాన్ని, భక్తి సామ్రాజ్య రూపంలో పునఃప్రతిష్టింప చేయడానికి ప్రకటితమవుతున్నది. 'క్లీం" కార వర్చస్సుగల వరలక్ష్మీదేవిని ముగ్ధ మనోహరంగా వ్యక్తమయిన ఈ సందర్భం అద్భుతంగా అర క్షణమైనా వీక్షించిన వారిని అనుగ్రహించుగాక!

దర్శనమాత్రానికి భక్తిరాజ్యాభిషేకం చేసే అనుగ్రహం నాదే ఈ అదృష్టం నాకు వరలక్ష్మీదేవి ఇచ్చిన దీవెన. ఈ వ్రత కార్యక్రమాన్ని ఆ లలితాదేవి నాతో సజావుగా చేయించుకొనే అదృష్టాన్ని అందరూ తిలకించేలా దీవించాలని నా కోరిక! "నేను" అనే శబ్దం నాలో లేకుండా అన్నీ తానే అయి పరిపాలిస్తూ స్వయంగా ఆధిపత్యం చేయాలని వేడుకుంటున్నాను.

అరుదైన వరంగా లభించిన ఈ సంకల్పానికి సర్వతంత్ర మంత్ర దేవతలు, పరివార దేవతలు, అష్టవిధశక్తుల సిద్ధులను, ఆయుధాలుగా ధరించి చతురంగ బలాలతో కూడి బాహ్యంగాను, అదృశ్యంగాను, అనంతమైన మహిమను ప్రసరింపచేయుగాక! ఈ ప్రకటన ప్రత్యక్షంగా, వ్యూహాత్మకంగా కదిలే ప్రక్రియలో దివ్యాస్త్రాలను సంధించే కృపాకటాక్షాలను ప్రసాదించుగాక! ప్రతి అస్త్రాన్ని లోక రక్షణకై అప్రతిహతంగా వినియోగింపబడుగాక. సమాజంలో భక్తినే నిజమైన అర్హతగా రాజపీఠంపై కూర్చుండబెట్టు గాక! ఈ ప్రక్రియలో రాజ రాజేశ్వరికి ఆమె సహాయ దేవతలు, పరివార దేవతలు జతగా ఉండుగాక! చైతన్యవంతమైన ధర్మపారిపాలనకు న్యాయమనే అస్త్రాన్ని కూడా జతచేయుగాక! అస్త్రానుసంధానికై అమ్మవారికి



శ్రమ కలిగించినందుకు క్షమాపణ! తత్ ఫలితంగా విజయం సిద్ధించేట్లుగా ఆశీర్వదించుగాక!

"రాజత్కృపా రాజపీఠ నివేశితా నిజాశ్రితా రాజ్యలక్ష్మీ కోశనాథా చతురంగబలేశ్వరీ!

రాజత్కృపా: "రాజంతీ శోభమాన కృపాయస్యా" దేదీప్యమానమైన కృపాకటాక్షాలతో, ప్రకాశితమైన ఆదిశక్తి స్వరూపిణివి. ఈ కృపాశక్తిని మనం బాహ్యంగాను, అదృశ్యంగాను చూడగలిగి, అనుభూతి పొందగలం. మానవలోకంలో భార్యాభర్తల మధ్య ప్రజలకు రాజుకు మధ్య, గురుశిష్యులకు మధ్య, తల్లిదండ్రులకు సంతానానికి మధ్య అద్భుతంగా ప్రతిష్టితమై ఉంది. ఎంతటి నాస్తికులైనా, విజ్ఞానఘనులైనా అమ్మవారి కృపాదృష్టిని అర్థం చేసుకోవాడానికి ఎన్నో జన్మల పుణ్యం కావాలి.

మూర్ఖులకు కూడా అర్థమయ్యేరీతిలో సృష్టిలోని తన పరిపాలనా మహాత్యాన్ని శ్రీ రాజ్యలక్ష్మీదేవి ఇలా వివరిస్తున్నది.. ఒక మానవుడు తోటి మానవుడి దయకు పాత్రుడు కావాలన్న, ఉన్నతాధికారి కృప కావాలన్నా ప్రతిభాపాటవాలను, శక్తి

త్రిగుణాత్మక స్వరూపిణి

యుక్తు లను ప్రదర్శించాలి. ప్రసన్నం చేసుకోవాలి. తల్లిదండ్రుల కృపాకటాక్షాలను పొందడానికి తన ప్రవర్తనను అనుకూలంగా మార్చుకొని మంచి మార్గంలో నడవాలి. ఒక ఇల్లాలి భర్త అనుగ్రహాన్ని పొందాలంటే ప్రేమ, నిజాయితీలతో సేవించి నిరూపించాలి. అప్పుడుగాని వీరందరి కృపా కటాక్షాలు పొంది, తద్వార లభించిన ఆనందంతో నిశ్చింతగా గడుపుతారు. తమ జీవితానుభవాలను ముందు తరాలకు అందించినపుడు గురు కటాక్షాలను పొందగలరు. వీటన్నిటినీ పాటిస్తూ కూడా దైవకృప పొందడానికి సాధన చేయాలి. అదే జ్ఞానమార్గానికి సోపానం. ఒక గురుకృపకు పాత్రులు కావాలంటే, గురువు నిర్ధేశించిన విలువలను ప్రతిబింబించేలా నడుచుకోవాలి.



–సి. విజయలక్ష్మీ రాజం

విజయక్రాంతి
గురువారం 07 ఫిబ్రవరి 2019
హైదరాబాద్

ప్రాంతీయం

ఉద్యమ సమయంలో ఉద్యోగుల పాత్ర కీలకం

విజయక్రాంతి, మెహిదిపట్నం: బుధవారం టీఎన్‌జీఓ భవన్ లో హైద్రాబాద్ జిల్లా 4 వ తరగతి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. 4వ తరగతి ఉద్యోగుల సంఘానికి ఘనమైన చరిత్ర ఉందని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపారు. టీఎన్‌జీఓ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం హుస్సేనీ(ముజీబ్) మాట్లాడుతూ..తెలంగాణా ఉద్యమ సమయంలో 4వ తరగతి ఉద్యోగుల పాత్ర కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో 4 వ తరగతి ఉద్యోగుల హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు వి.సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బిన్ హుస్సేన్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.సుధాకర్, కార్యదర్శి ఆర్య సతీష్ రాజ్, ట్రెజరర్ మహమ్మద్ ఇక్బాల్,కార్యవర్గ సభ్యులు సయ్యద్ ఖలీల్ అలీ, ఎమ్.నాగమణి, బి.విష్ణు లతో పాటు జిల్లా ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, టీడీపీకి పలువురు రాజీనామాలు

విజయక్రాంతి, బోడుప్పల్: స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంలో బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని రాజకీయ సమీకరణాలు మారుతు న్నాయి. గత సాధారణ ఎన్నికలలో ఘోరంగా ఓటమి పాలైన టీడీపీ, కాంగ్రెస్ పార్టీలలో కొనసాగితే తమ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని భావించిన నాయకులు ఆయా పార్టీలకు రాజీనామాలు చేస్తున్నారు. బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీటీసీ సభ్యులు చందర్ యాదవ్,కాంగ్రెస్ ఎంపీటీసీ స భ్యులు వీరాచారీ,కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యురాలు జె పద్మ,తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ,ఎంపీటీసీ సభ్యులు అశోక్ లో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ వా ర్డు సభ్యులు చీరాల నర్సింహ్మా,జె.రాములు, గుర్రాల వెంకటేష్,మునిగోండ భిక్షపతి రజక, పద్మా, నర్సమ్మలు తమ పదవులకు మరియు పార్టీ సభ్యత్వాలకు తమ అనుచరులతో కలిసి రాజీనామాలు చేశారు.

పోలీసుల పేరుతో దోపిడీలు



- పట్టుబడిన నిందితులు

విజయక్రాంతి, రామగుండం: పోలీసులమని చెప్పి అమాయకులను దోచుకుంటున్న సంఘటనలు ఇటీవల జరుగుతుండగా... ఈ నెల 4న జరిగిన ఓ సంఘటనలోని నిందితులను కమీషనరేట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖనిలో ఏసిపి రక్షిత కె. మూర్తి మీడియా సమావేశంలో నిందితుల అరెస్టును చూపారు. రక్షిత తెలిపిన వివరాల మేరకు... అంతర్గాం మండలం గోలివాడ గోదావరి బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనంపై వెలుతున్న నల్ల ప్రవీణ్ కుమార్‌ను అటకాయించిన ఇద్దరు వ్యక్తులు పోలీసులమని బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ. ఐదు వేల నగదును గుంజుకున్నారు. బాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. పోలీసు పేరుతో నేరాలకు పాల్పడిన గోలివాడకు చెందిన పూదరి సాయికిషోర్, టిటిఎస్ అంతర్గాంకు చెందిన మద్దిల సాయికుమార్‌లను అరెస్టు చేసినట్లు ఏసిపి తెలిపారు. ఈ నిందితుల నుంచి రూ. 4,400నగదుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాదీన పర్చుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో రామగుండం సిఐ బుద్దస్వామి, అంతర్గాం ఇంచార్జ్ ఎస్సై దత్తాద్రిలు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని వాహన చోదకులకు చిన్నారులతో పుష్పాల అందజేత..!




విజయక్రాంతి, మంథని: 30వ జాతీయ భద్రత వారొత్సవాల్లో భాగంగా మంథని నియోజకవర్గం పరిధిలోని ముత్తారం మండలంలో ముత్తారం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వినూత్నంగా అవగహన కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల విద్యార్థులతో ద్విచాహన చోదకులకు, కార్లు నడిపే వారికి పుష్పాల అందజేసి హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అలాగే ఆర్‌టీసీ బస్సు డ్రైవర్లు జాగ్రత్త బస్సు నడపాలని కొరుతూ పుష్పాలను అందజేయగా, ఈ కార్యక్రమాన్ని అపూర్వ స్పందన వచ్చిందని ఎస్ఐ రాజ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

వివేకానంద కళాశాలలో సదస్సు



విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్‌లోని స్థానిక వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో మార్చి 2వ తేదీన ఉత్తర తెలంగాణ పరిధిలోని ఎంకామ్, ఎంబీఏ విద్యార్థులకు సూయిజేనంస్ 2019 పేరిట ఒక రోజు సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ కిరణ్, బండి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తమ ఎంకామ్ విద్యార్థి, మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్‌తో పాటు నృత్య పోటీలు నైపుణ్య ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు ఈ సదస్సులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



విజయక్రాంతి, సంగారెడ్డి: వేసవిలో త్రాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు అన్ని జాగ్రత్తలతో పాటు ప్రనాళికలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతురావు ఆర్డబ్ల్యూస్, మిషిన్‌భగీరథ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్, మిషిన్ భగీరథ, ఇరిగేషన్ అధికారులతో తాగునీటి సరఫరా, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలకు సంబంధించిన ప్రనాళిక తదితర అంశాలపై మండలం వారిగా సుధీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులవల్ల భూగర్భ జలాలు తగ్గడంతో రాబోయే వేసవిలో ఎలాంటి ఇబ్బందులు, నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రధానంగా సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి ఆ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచుల సాకారంతో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.



ఫిబ్రవరి 14న నిర్వహించే ప్రేమికుల దినోత్సవాన్ని నిషేధించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. బుధవారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. దేశ సంస్కృతిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌ధళ్ నేతలు వెంకటేశ్వర్ రాజు, సుభాష్ చందర్, జీవన్, లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

మైనర్‌బాలికపై ప్రేమోన్మాది కత్తితో దాడి





విజయక్రాంతి, అంబర్‌పేట్: ప్రేమించడం లేదని కక్ష పెంచుకున్న ఓ మైనర్ బాలిక (17)పై విచక్షణ రహితంగా ప్రేమోన్మాది కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బుధవారం ఉదయం కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర సత్యానగర్ ప్రాంతానికి చెందిన మంగ రాములు, ఉదయల రెండో కుమార్తె మైనర్ బాలిక (మధులిక). మైనర్‌బాలిక నల్లకుంట శివంరోడ్డులోని శరత్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన వేణుగోపాల్ – కళ్యాణిల కుమారుడు చిట్టుకూరి భరత్(19) గత సంవత్సర కాలంగా అమ్మాయి వెంట పడుతూ ప్రేమించాలని వేదిస్తున్నాడు. భరత్ రాంకోఠిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. జనవరి 7వ తేదిన అమ్మాయి తల్లిదండ్రులు తమ కుమార్తెను భరత్ వేదిస్తుండటంతో షీటీంకు ఫిర్యాదు చేశారు. దీంతో షీటీమ్ భరత్‌ను, అతని కుటుంబ సభ్యులను, బాలికతో పాటు కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ చేశారు. ఇక నుంచి అమ్మాయి జోలికి వెళ్లనని, ఎలాంటి ఇబ్బందులు కల్గించనని భరత్ చెప్పాడు. ఎలాంటి ఇబ్బందులు కల్గించినా పరిణామాల తీవ్రంగా ఉంటామని షీటీం అధికారులు భరత్‌ను, వారి తల్లిదండ్రులను హెచ్చరించి పంపించారు. బాలిక రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి కళాశాలకని వెళ్తుండగా ముందస్తుగా ఓ పథకం ప్రకారం పకడ్బందిగా ఏర్పాటు చేసుకున్న విధంగా భరత్ అదే సమయంలో ఇంటి పక్కనే ఉంటున్న బంధువుల ఇంటి వద్ద బాలిక కోసం కాపు కాసాడు. అమ్మాయి నడుచుకుంటూ బయటకు రాగానే అక్కడ బాలిక కోసం ఎదురుచూస్తున్న భరత్ బాలికను పక్కకు లాక్కెల్లి కొబ్బరి బొండాల కత్తితో విచక్షణ రహితంగా మెడపైన, చేతులపైన,తలపైన కత్తితో నరికాడు. దీంతో అరుపులు, కేకలతో బాలిక రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. భరత్ బంధువులు, బస్తీ వాసులు చూస్తుండగా దాడికి తెగబడ్డాడు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కోట్టుమి ట్టాడుతున్న బాలికను వైద్య చికిత్స కోసం మలక్‌పేటలోని యశోద ఆసుపత్రికి తరలించారు. బాలికపై హత్యాయత్నం చేసిన సంఘటన స్థలాన్ని ఈస్ట్‌జోన్ డీసీపీ రమేష్ , అడిషనల్ డీసీపీ గోవర్ధన్‌రెడ్డి, కాచిగూడ ఏసీపీ సుధాకర్, కాచిగూడ డిఐ యాదేంద ర్‌లతో పాటు పోలీసు సిబ్బంది, క్లూస్ టీం సందర్శించి వివరాలు సేకరించారు. బాలిక తల్లి ఉదయ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మధులికను పరామర్శించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉదయం అంబర్‌పేట్ నియోజకవర్గం బర్కత్‌పుర సత్యానగర్‌లో ప్రేమోన్మాది చేతిలో గాయపడి మలక్‌పేట్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థినీ మధులికను హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరామర్శించిన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవిరమేష్‌తో కలిసి పరామర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉన్మాదానికి పాల్పడిన వ్యక్తి భరత్‌ను గతంలో మధులికను ప్రేమ పేరుతో వేదిస్తుండడంతో అమ్మాయి తల్లిదండ్రులు అతనిని షీ టీమ్‌కి అప్పగించడం కౌన్సిలింగ్ ఇవ్వడం కూడా జరిగినప్పటికి ఇలాంటి ఉన్మాద చర్యకు పాల్పడిన భరత్‌ను కఠినంగా శిక్షించాలని పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. మధులికకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లకు ఆదేశించారు. ఆయన వెంట టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్ ఉన్నారు.

మధులికకు మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి పరామర్శ

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న మధులిక విషయం తెలుసుకున్న అంబర్‌పేట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని అమ్మాయి తల్లిదండ్రులను పరామర్శించి డాక్టర్స్‌తో మాట్లాడారు. ఉన్మాదానికి పాల్పడిన భరత్‌ను కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను కోరారు.

మధులిక వైద్యం కయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది –

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధులిక తల్లిదండ్రులని పరామర్శించి డాక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వం అమ్మాయికి అండగా ఉందని, వైద్యం కయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు జెడి రాహుల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్ నాయక్, నల్లకుంట డివిజన్ ప్రధానకార్యదర్శి ఎం.జనార్ధన్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల జాతర

- నెల రోజుల్లో పార్లమెంటుకు సన్నద్ధం
- జూన్, జూలైలో మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- అదే నెలలో సహకార ఎన్నికలు
- జోష్‌లో కార్యకర్తలు
- 9నెలలుగా అమల్లో ఎన్నికల కోడ్



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల జాతర ప్రారంభమైంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి మొదలైన ఎన్నికల జాతర ఈ ఏడాది జూలై నెలతో ముగియనున్నది. గతేడాది సెప్టెంబర్ 6న ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రభుత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అదే రోజు టీఆర్ఎస్ పార్టీకి చెందిన 105 అభ్యర్థులకు బీ ఫారంలు ఇచ్చి ఎన్నికల వేడిని కేసీఆర్ రగిలించారు. అప్పటి నుంచి మొదలైన ఎన్నికల సందడి రాష్ట్రంలో ఇప్పటి వరకూ తగ్గడం లేదు. సెప్టెంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకూ అసెంబ్లీ ఎన్నికల సందడి కొనసాగింది. ఇంతలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో క్షేత్రస్థాయిలోని అన్ని పార్టీల నాయకులు ఎన్నికల కోసం వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగితేలారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. కేవలం నెల వ్యవధిలోనే అసెంబ్లీ, గ్రామ పంచాయతీలకు పోలింగులు జరిగాయి. ఈ ఎన్నికలు జనవరి 30తో ముగిశాయి. సెప్టెంబర్ నుంచి జనవరి వరకూ రాజకీయ నాయకులు, కార్యకర్తలు తీరిక లేకుండా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. గెలిచిన వారు సంబురాలు చేసుకోవడం, ఓడిపోయిన వారు ఓటమిపై సమీక్షలు చేసుకుంటున్నాయి. ఇంకా గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల నుంచి అయా రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు తేరుకోలేదు. ఈ నెలాఖరులో పార్లమెంటు ఎన్నికలకు షెడ్యూల్ రానున్నట్లు కథనాలు వస్తున్నాయి. దీంతో మరో నెల రోజులు గడవకముందే పార్లమెంటు ఎన్నికల హడావుడి ప్రారంభం కానున్నది.

ఇదిలా ఉండగా పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్షంలోని కాంగ్రెస్ పార్టీలు అయా ప్రాంతీయ పార్టీలతో పొత్తు కోసం సంప్రదింపులు చేస్తున్నాయి. దీన్నిబట్టి పార్లమెంటు ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలన్ని సన్నద్ధమౌతున్నట్లు తెలుస్తుంది. దేశ వ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలను ఏడు విడతలుగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించనున్నట్లు తెలిసింది. మన రాష్ట్రంలో ఈ ఎన్నికలు బహుశ ఏప్రిల్ చివరికల్లా పూర్తి కానున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వామపక్ష పార్టీలు, తెలంగాణ జనసమితి తదితర పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నాయి. దీంతో అయా పార్టీలు ఇప్పటి నుంచే అభ్యర్థుల వేటలో ఉన్నట్లు తెలిసింది. దానికి సంబంధించిన ప్రక్రియలో బిజీగా ఉన్నట్లు తెలిసింది. ఇక పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ మే నెలలో పూర్తి కానున్నది.

రాష్ట్రంలోని మున్సిపాలిటీల పాలకవర్గం జూన్ నెలలో పూర్తి కానున్నది. అదేవిధంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం కూడా జూలై నెల వరకూ కొనసాగనున్నది. దీంతో జూన్, జూలై నెలల్లో మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నది. ఈ ఎన్నికల్లో గ్రామీణ, పట్టణాల్లోని కార్యకర్తలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. దీంతో అయా రాజకీయ పార్టీలు కూడా ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తుంటారు. దీంతో ఆ రెండు నెలలు కూడా మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మునిగి తేలనున్నారు. ఇక ప్రాథమిక సహకార పరపతి సంఘాల పదవీకాలాన్ని ఇప్పటికే రెండుసార్లు ప్రభుత్వం పొడిగించింది. జనవరి వరకూ పొడిగించినప్పటికీ గ్రామ పంచాయతీ ఎన్నికల రీత్యా వారి పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో సహకార సంఘాలకు జూన్ నెలలో పదవీకాలం ముగియనున్నది. ఈ ఎన్నికలను కూడా జూన్ లేదా జూలైలో నిర్వహించే అవకాశాలున్నాయని తెలుస్తుంది. దీన్నిబట్టి రాష్ట్రంలో వరుసగా 9నెలలు రాజకీయ పార్టీలు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్యకర్తలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం తొలిసారి అని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తమ పాలనను సాగించేందుకు ఎన్నికల నియమావళి ప్రతిభంధకంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఈ ఏడాది జూలై తర్వాతనే పాలన సజావుగా జరిగే అవకాశాలున్నట్లు సమాచారం.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



విజయక్రాంతి,నిజామాబాద్: సిరికొండ ఎస్ఐ బషీర్ అహ్మద్ దౌర్జన్యాలను అరికట్టాలని కోరుతూ నిజామాబాద్ కలెక్టరేట్ ముందు సిరికొండ మండలం గడ్కోల్ గ్రామ ఆల్ కమిటి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగారు. ఎస్ఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్ఐ విడీసీల వద్ద డబ్బుల వసూళ్లు, బెల్ట్ షాపుల వద్ద మామూళ్లు, గొర్రె పోతుల వసూళ్లు, సివిల్ తగాదాల్లో చేతి వాటంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ఆల్ కమిటి సభ్యులు డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం గ్రామంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఇసుకను తీసుకొస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఎస్ఐ దుర్భాషలాడారని మండిపడ్డారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇసుక తరలించడాన్ని అడ్డుకున్న అధికారులకు పక్క గ్రామాలకు కాంట్రాక్టర్లు ఇసుక తోలుకు పోతుంటే కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు.

విద్యార్థులు పరీక్షలను ఇష్టపడి రాయాలి

విజయక్రాంతి,నల్లగొండ: విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా కష్టపడి చదివి నిర్భయంగా రాయాలని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వైఆర్‌పి చారిటబుట్ ట్రస్ట్ ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎలా వ్రాయాలనే అంశంపై నిర్వహించిన సదస్సును జ్యోతి వెలిగించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆడుతూ, పాడుతూ చుదువుకొని ఎలాంటి భయం లేకుండా ఇష్టంతో పరీక్షల వ్రాసేలా విద్యార్థులను సిద్దం చేయాల్సియ బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని ఆయన అన్నారు. అన్నారు. అనంతరం వైఆర్‌పి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌పి ట్రస్ట్ వ్యవస్థాపకులు రవి ప్రకాశ్, జిల్లా విద్యాశాఖ అధికారి సరోజిని దేవి, రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు మర్రి యాదయ్య గౌడ్



విజయక్రాంతి, నల్లగొండ: నాల్గవ తరగతి ఉద్యోగస్తులకు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేస్తున్న మర్రియాదయ్య గౌడ్‌ను ప్రతి ఉద్యోగి గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాడని జెడ్‌పి చైర్మన్ బాలూనాయక్ అన్నారు.బుధవారం రత్నఫంక్షన్ హాల్‌లో నాల్గవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదయ్య గౌడ్ పదవీ విరమణ కార్యక్రమానకి హాజరై ఈ సందర్బంగా మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖలో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయించి ఎన్నో వందల కుటుంబాలకు ఆదర్శప్రాయుడుగా నిలిచిన వ్యక్తి మర్రి యాదగిరి గౌడ్ అని ఆయన కొనియాడారు. శాసనసభ్యుడు నోముల నర్సింహయ్య మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన తరువాత స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ నిండు, నూరేళ్ల జీవించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, వేపల సత్యనారాయణ రెడ్డి, శంకర్ గౌడ్, యాదయ్య, సుంకరి భిక్షంగౌడ్, జెడ్‌పి సీఈవో విజయలక్ష్మి, ఎల్లయ్య,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం: డాక్టర్ రాకేష్



విజయక్రాంతి, నల్లగొండ: అరుణ హాస్పిటల్‌లో ఆరుదైన శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి చెందిన కుక్కల సైదమ్మకు రెండు నెలల నుండి తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ అనారోగ్యానికి గురైన బాధితురాలిని జిల్లాలో ఏ డాక్టర్లు పట్టించుకోకపోవడంతో చివరకు ఐఎంఏ కన్వీనర్ డాక్టర్ పుల్లారావు చొరవతో ఆ పేషంట్‌ను ఛాలెంజ్‌గా తీసుకొని ఆమెకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా కోటి మందిలో ఒకరికి ఉండే బాంబే బ్లడ్ గ్రూప్‌తో బాధపడుతున్న వ్యక్తిని పట్టణంలోని స్థానిక అరుణ అస్పత్రిలో అడ్మిట్‌చేసి ఐఎంఏ అసోసియేషన్ సహకారంతో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. అరుణ హాస్పిటల్ ఎండి. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ కుక్కల సైదమ్మకు బాంబే బ్లడ్ గ్రూప్‌తో బాధపడుతుందని ఐఎంఏ సలహాతో మా హాస్పిటల్‌లో అడ్మిట్ చేసుకొని ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని చెన్నై, మహారాష్ట్ర, హైద్రాబాద్ ల నునండి మూడు బ్లడ్ ప్యాకెట్లు తీసుకువచ్చి రోగికి అరుదైన శస్త్ర చికిత్సను డాక్టర్ శేఖర్‌రెడ్డి, అరుణా కుమారి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోగి తరపున బంధువులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అరుణ హాస్పిటల్ డాక్టర్స్‌ను అభినందించారు.

ఉప విద్యాధికారి పోస్టును మంజూరు చేయాలి



విజయక్రాంతి, హైదరాబాద్: దశాబ్దాలుగా ప్రమోషన్లకు అవకాశము లేక నష్టపోతున్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల పక్షాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిలిచి ఇప్పించిన రాష్ట్రపతి ఉత్తర్వులు, రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తీర్పు ఇవ్వడం, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌పి వేసి హైకోర్టు తీర్పును నిలపుదల చేస్తూ ఉత్తర్వులు పొందిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గారికి తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం పక్షాన ధన్యవాదములు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంలో ఈ క్రింది అంశాలు మీ దృష్టికి తీసుకవస్తున్నాం.

1. నూతన జిల్లాలు/జోనల్ విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులందరికి స్థానికతని నిర్ణయించాలి. వారికి సొంత జిల్లాను ఎంపిక చేసుకోవడానికి ఆప్షన్ అవకాశం కల్పించాలి.2. విద్యాశాఖలోని వివిధ పోస్టులను జిల్లా/ జోనల్/ మల్టీ జోనల్ స్థాయి పోస్టులుగా నిర్ణయించాలి.3. 31 జిల్లాలలో విద్యాశాఖ డివిజన్‌లను 4 మండలాలకు 1 డివిజన్‌గా ఏర్పాటు చేయాలి.4. ప్రతి డివిజన్‌కు ఉప విద్యాధికారి పోస్టును మంజూరు చేయాలి.5. కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాలకు డీఈఓ పోస్టులను మంజూరు చేయాలి.

6. నూతనంగా ఏర్పడిన అన్ని జిల్లాలలో డీఐఈటీలను ప్రారంభించాలి

ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై ట్రస్మా బహిరంగసభ

విజయక్రాంతి, కరీంనగర్ : తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యం (ట్రస్మా) ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ట్రస్మా ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక అర్థవంతమూన చర్చ జరిపి సమస్యలపై పరిష్కారానికి తగు సూచనలు చేసేందుకు ఈ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావులతో పాటు పలువురు ప్రముఖులు ఈ సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లోని స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ సభను నిర్వహించనునాన్నమని, విద్యావంతులు, మేధావులు సుమారు 10వేల మందికి పైగా హాజరుకానున్నట్లు తెలిపారు.

టవరెక్కిన బొగ్గు గని కార్మికుడు

విజయక్రాంతి, రామగుండం: సింగరేణి రామగుండం రీజియన్‌లో గుర్తింపు కార్మిక సంఘం నాయకుని వేధింపులను తట్టుకోలేక ఓ కార్మికుడు గని ఆవరణలోని టవరెక్కి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ సంఘటన సింగరేణి ఏరియా వర్క్‌షాప్‌లో జరిగింది. వెంకటస్వామి అనే కార్మికుడిని అదే డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న టిబిజికెఎస్ గుర్తింపు సంఘ ఫిట్ సెక్రెటరీ స్వామిదాస్ తనను నానా విధాలుగా వేదింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ... టవరెక్కి దూకడానికి సిద్దమయ్యాడు. గని అధికారులు, పలువురు కార్మికులు నచ్చజెప్పడంతో వెంకటస్వామి కిందికి దిగివచ్చాడు. గంటపాటు జరిగిన ఈ సంఘటన కార్మిక వర్గంలో సంచలనాన్ని కల్గించింది.

బాధ్యతలు చేపట్టిన ప్రియాంక



ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ బుధవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రియాంకను పార్టీ ప్రధాన కార్యదర్శిగా, తూర్పు యూపీ ఇన్‌చార్జ్‌గా ఆమె సోదరుడు, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ జనవరి 23న నియమించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని అక్బర్ రోడ్ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ చాంబర్ పక్కనే ప్రియాంక కార్యాలయం ఏర్పాటు చేశారు.కాగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ప్రియాంక గురువారం తొలి అధికారిక సమావేశంలో పాల్గొంటారు. సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన వ్యూహాలను రూపొందించేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్చార్జ్‌తో జరిగే సమావేశానికి ప్రియాంక హాజరుకానున్నారు.

భర్త రాబర్ట్ వాద్రాకు బాసట

మనీల్యాండరింగ్ కేసులో ఈడీ ఎదుట హాజరైన తన భర్త, వాణిజ్యవేత్త రాబర్ట్ వాద్రాకు ప్రియాంక సంఘీభావం తెలిపారు. కుటుంబానికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఈడీ విచారణ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. వాద్రాను ఈడీ కార్యాలయం వద్ద డ్రాప్ చేసిన అనంతరం నేరుగా ఏఐసీసీ కార్యాలయానికి చేరుకున్న ప్రియాంక పార్టీ బాధ్యతలు స్వీకరించారు.



అవినీతికి 'చౌకీదార్' మోదీ

(మొదటి పేజీ తరువాయి) జరుగుతున్నందున.. రాహుల్‌గాంధీ.. ఆ రాష్ట్రంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ వారం రోజుల్లో రెండుమార్లు ఆ రాష్ట్రంలో పర్యటించారు.

మోదీ 'చౌపట్ రాజ్'

ప్రధాని మోదీ.. వాక్చాతుర్యంతోనే పాలన సాగిస్తున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఆయన పాలన కారణంగా దేశం నష్టపోతున్నదంటూ 'చౌపట్‌రాజు' అని పేర్కొన్నారు. నిరుద్యోగం తీవ్రత పెరిగిపోయిందని, వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకొని పోయిందని తెలిపారు. దీనికి సంబంధించి మీడియాలో వచ్చిన ఒక నివేదికకు ప్రస్తావించారు. నాలుగవ తరగతి ఉద్యోగాల కోసం పీహెచ్‌డీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. ' ఈ చౌపట్‌రాజ్ పాలనలో వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర లభించడం లేదు. యువతకు ఉద్యోగాలు రావడం లేదు. పరిష్కారానికి కృషి చేయకుండా మాటలతో పాలన కొనసాగిస్తే... గౌరవం పొందలేరు.' అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

విచక్షణ కోల్పోతున్న టీనేజి ప్రేమికులు

యువతలో విపరీత పోకడలు

విజయక్రాంతి, హైదరాబాద్: టీనేజి యువతలో సంయమనం లోపిస్తోంది. సమాజంలో తలెత్తుతున్న విపరీత పోకడలు లేత మనసులను చిదిమేస్తూ చిన్న చిన్న ఘటనలకే తీవ్రంగా స్పందించేలా చేస్తోంది. అహం అడ్డుగోడగా నిలుస్తూ పరస్పరం అపోహలకు తావిస్తూ బంగారంలాంటి భవిష్యత్‌ను కాలరాస్తోంది. నగరంలోనే కాక తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు సామాజిక పరిశీలకులను ఆందోళనకు గురిచేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రోజు రోజుకు ఈ దాడులు మితిమీరుతూ యావత్ సమాజాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ క్రమంలో కొందరు తనువు చాలిస్తుంటే, మరికొందరు చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల ఎర్రగడ్డ లో జరిగిన ప్రేమికులపై జరిగిన దాడిని మరవక ముందే, బుధవారం బర్కత్ పురాలో కౌమారం వీడని ప్రేమజంటను ద్వేషం కాటేసింది. ప్రేమించిన అమ్మాయి పెద్దల జోక్యంతో ఎక్కడ దూరమవుతుందోనని ఒక వైపు..అమ్మాయి తల్లిదండ్రులు తమ కుటుంబాన్ని బజారుకు లాగారన్న కోపం వెరసి వివేకాన్ని కోల్పోయి ఉన్మాదిగా మారిన ఘటన చోటు చేసుకుంది. అమ్మాయిని హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ప్రియురాలు తీవ్ర గాయాలై ఆసుపత్రిపాలు కాగా, స్థానికులు చుట్టుముట్టి కత్తిని లాక్కొని పోలీసులకు అప్పగించారు. కౌన్సిలింగ్ నాలో కోపాన్ని పెంచింది– నిందితుడు భరత్: మమ్మల్ని విడదేసేందుకు మధులిక తల్లిదండ్రులు చేసిన ప్రయత్నంలో జరిపిన కౌన్సిలింగ్ తనలో కోపం పెంచిందన్నాడు నిందితుడు భరత్.



పాన్, ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- సుప్రీంకోర్టు స్పష్టం

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను రిటర్నును దాఖలు చేయడం కోసం పాన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తెలిపింది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139 ఏఏను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. జస్టిస్ ఏ కే సిక్రి, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ తో కూడిన దిసభ్య ధర్మాసనం బుధవారం ఈమేరకు తీర్పునిచ్చింది. పాన్ కార్డుకు ఆధార్ అనుసంధానం లేకుండా ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు ఢిల్లీ హైకోర్టు శ్రేయ సేన్, జయశ్రీ అనే ఇద్దరు వ్యక్తులకు ఈ అనుమతి ఇచ్చింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి పాన్, ఆధార్ అనుసంధానం లేకుండానే ఐటీ రిటర్నులను దాఖలు చేయవచ్చని తెలిపింది. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అపీలు చేసింది. బుధవారం దీనిపై సుప్రీం కోర్టు విచారణ జరిపింది. ఈ అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నపుడు హైకోర్టు ఈ తీర్పును ఇచ్చిందని పేర్కొంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139 ఏఏ ఉద్దేశాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఐటీ రిటర్నుల దాఖలుకు పాన్, ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.



అభివృద్ధి వేదికలు గ్రామాలు

(మొదటి పేజీ తరువాయి) పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, పంచాయతీరాజ్ కమిషనర్ నీతూప్రసాద్, సెర్ప్ సీఈఓ పౌసమిబసు, సీఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, పలువురు హాజరైనారు.

పలుమార్లు పద్యాలు చదివిన కేసీఆర్

ఆయా అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశంలో పలుమార్లు సందర్భోచితంగా పద్యాలు చదివి, దాని అర్థం చెప్పారు. 'అనగననగ రాగ మతిశయిల్లుచునుండు" అనే వేమన పద్యం పాడి, గ్రామాల్లో సంస్కరణల అమలు నిరంతర ప్రక్రియగా సాగాలని, కొంత కాలానికి ప్రజలకు, ప్రతినిధులకు అది అలవాటుగా మారుతుందని వివరించారు.

'నయమున బ్రాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా' అనే సుమతి శతకంలోని పద్యాన్ని ఉదహరించి, గ్రామ పంచాయతీలు విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే కఠినంగా శిక్షించాలని చెప్పారు. భయముంటేనే బాగా పనిచేస్తారని, పాలన పారదర్శకంగా ఉంటుందని వివరించారు. 'జాతస్యహి మరణం ధృవం' అనే భగవద్గీత శ్లోకం చదివి పుట్టిన వారు గిట్టక మానరు కాబట్టి చనిపోయిన తర్వాత కూడా మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడానికి స్మశాన వాటికలు నిర్మించాల్సిన అవసరాన్ని చెప్పారు. బతికినంత కాలం కులం పేరిట, మతం పేరిట కొట్టుకు చచ్చినం, చనిపోయిన తర్వాతనైనా ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై' అనే ఏనుగు లక్ష్మణకవి సుభాషితం చదివి, గ్రామాల వికాసానికి మంచి సంకల్పంతో నడుం బిగించి, తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన స్ఫూర్తితో పనిచేయాలని ఉద్బోధించారు.

51 రైల్వే స్టేషన్లలో ఉచిత హైస్పీడ్ వైఫై సదుపాయం



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆదేశాల మేరకు దేశాన్ని డిజిటల్ ఇండియా వైపుకు తీసుకెళ్లేందుకు , ఎక్ట్రానిక్ యుగానికి అనుగుణంగా అన్ని సేవలను ప్రజకు అందుబాటులో ఉంచే దిశలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు భారతీయ రైల్వే ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ప్రధాన రైల్వే స్టేషన్లు మరియు గ్రామీణ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు, వినియోగదారు సౌకర్యార్థం ఉచిత హైస్పీడ్ వైఫై ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రోజూ ప్రయాణించేసే వేలాది మందికి స్టేషన్లలో 'రైల్ వైర్' బ్రాండ్ పేరుతో ఉచితంగా వైఫై సేవలందిస్తున్నారు. ఈ సేవలు అనతికాలంలోనే అంత్యంత ప్రజాదరణ పొందాయి. దేశవ్యాప్తంగా 400 'ఏ1', 'ఏ' కేటగిరీ రైల్వే స్టేషన్లలో వినియోగదారుకు ఉచిత హైస్పీడ్ వైఫై అందించే సౌకర్యాలను పూర్తి చేశారు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో 24 'ఏ1' మరియు 'ఏ' కేటగిరీ రైల్వే స్టేషన్లలోను మరియు 27 గ్రామీణ నేపథ్యం గల రైల్వే స్టేషన్లలో గూగుల్ సహకారంతో రైల్ టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఆర్సిఐఎల్) పర్యవేక్షణలో ఉచిత హైస్పీడ్ వైఫై సేవను ఏర్పాటు చేయడం జరిగింది. ఉచిత హైస్పీడ్ వైఫై సేవను విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, కర్నూల్ సిటీ, తుని, తెనాలి, సామల్ కోట్, రాజమండ్రి, నెల్లూరు, కాకినాడ టౌన్, , భీమవరం టౌన్, అనకాపల్లి, తాడేపల్లి గూడెం, ఒంగోలు, గూడూరు, చీరా, గుంతకల్, రేణిగుంట, కడప మరియు అనంతపూర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఉచిత హైస్పీడ్ వైఫై సౌకర్యం కల్పించిన 27 గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లలో గుణదల, నిడదవోలు, గోదావరి, కొవ్వూరు, బాదంపూడి, భీమడోలు, గన్నవరం, కృష్ణా కెనాల్, ముస్తాబాద,, నూజివీడు, పెదవడ్లపూడి, పెద్దవుట పల్లి, పూళ్ళ, వట్లూరు, పవర్‌పూట, మంగళగిరి, నంబూరు, సంగం జాగర్లమూడి, వేజెండ్ల, అరకు మరియు శృంగవరపు కోట ఉన్నాయి.

శబరిమల వివాదంపై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: కేరళలోని పవిత్ర శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతించ వచ్చని సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్లపై జడ్జిమెంట్‌ను ధర్మాసనం రిజర్వ్ చేసింది. శబరిమలలో 10–50 ఏళ్ల వయసులోపు మహిళల ప్రవేశానికి అనుమతి కల్పిస్తూ 2018 సెప్టెంబర్ 28న ఇచ్చిన చారిత్రక తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ దాఖలైన 64 పిటిషన్లపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. సుపీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలోని ఈ బెంచ్‌లో జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ఖ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఇందు మల్హోత్రా సభ్యులుగా ఉన్నారు. కేరళ ప్రభుత్వంతో పాటు ట్రావెన్ కోర్ దేవస్వోమ్ బోర్డు (టీడీబీ), నాయర్ సొసైటీ తదితరులు తమ వాదనలను రాజ్యాంగ ధర్మాసనానికి వినిపించారు.

మహిళల ప్రవేశంపై వైఖరి మార్చుకున్న శబరిమల దేవస్థానం బోర్డు

మరోవైపు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు తన వైఖరిని పూర్తిగా మార్చుకుంది. గతంలో అన్ని వయసుల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించడాన్ని వ్యతిరేకించిన టీడీబీ, తాజాగా మహిళల అనుమతికి అంగీకారం తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తామని రివ్యూ పిటిషన్ల విచారణ సందర్భంగా బోర్డు న్యాయస్థానానికి స్పష్టం చేసింది. అన్ని వయసుల మహిళలను దేవస్థానంలోకి అనుమతించాలని సుప్రీంకోర్టుకు తెలిపింది. ట్రావెన్ కోర్ బోర్డు తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. రాజ్యాంగ ధర్మాసనంలోని జస్టిస్ ఇందు మల్హోత్రా బోర్డు తరపు న్యాయవాదిని ఉద్దేశించి మాట్లాడుతూ రిట్ పిటిషన్లపై తీర్పు సందర్భంగా చేసిన వాదనలో మార్పు వచ్చిందా? అని అడిగారు. దీనిపై బోర్డు తరపు న్యాయవాది రాకేశ్ ద్వివేది సమాధానం చెప్తూ "ఔను, తీర్పును గౌరవించాలని బోర్డు నిర్ణయించింది, దీనికి సంబంధించి దరఖాస్తు కూడా చేసింది" అని చెప్పారు. మతాచారాలు అందరికీ సమానంగా ఉంటాయని ఆర్టికల్ 25(1) చెబుతోందన్నారు. జీవ సంబంధిత లక్షణాల కారణంగా మహిళలపై వివక్ష చూపించడం సరికాదన్న ద్వివేది, శబరిమల అంశంలో న్యాయస్థానం తీర్పును అంగీకరిస్తున్నామని తెలిపారు. అయితే రుతుక్రమ వయసు మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించమని ట్రావెన్‌కోర్ బోర్డ్ గతంలో పలుమార్లు చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై బోర్డు తన వైఖరి మార్చుకోవడం గమనార్హం.

ఒక్కో దేవుడికి ఒక్కో పూజా విధానం, సంప్రదాయాలు..

కాగా హిందూమతంలో ఒక్కో దేవుడికి ఒక్కో పూజా విధానం, సంప్రదాయాలు ఉంటాయని, అలాగే శబరిమల అయ్యప్ప స్వామికి కొన్ని సంప్రదాయాలున్నాయని ట్రావెన్ కోర్ దేవసం బోర్డ్ మాజీ ఛైర్మన్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. ' ఆర్టికల్ 17 ఇక్కడ ఏమాత్రం వర్తించదు. మత విశ్వాసాన్ని సైన్స్ మ్యూజియంగా చూడలేం. మతవిశ్వాసాలకు సంబంధించిన విషయాల్లో రాజ్యాంగా నిబంధనలను గుడ్డిగా అమలు చేయలేం' అని ఆయన పేర్కొన్నారు. శతాబ్దాలుగా ఆలయ సంప్రదాయాలు మార్చాలా వద్దా అనే విషయాన్ని సంబంధిత వర్గం నిర్ణయిస్తుంది కాని కొందరు ఉద్యమకారులు దాన్ని నిర్ణయించలేరన్నారు. కొన్ని ఆచారాలను రూపు మాపడానికి ఇంతవరకు ఎటువంటి చట్టపరమైన శిక్షలు లేని పక్షంలో కోర్టు ఈ అంశంలో తలదూర్చకూడదని మరో సీనియర్ న్యాయవాది శేఖర్ నేఫడే ధర్మాసనం ఎదుట తన వాదనలు వినిపించారు. ఇది విస్తృత ప్రజాబాహుళ్యానికి సంబంధించిన అలంశం కాదని, ఓ వర్గం అంతర్గత వ్యవహారమని, వారి విశ్వాసానికి సంబంధించినదని ఆయన కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. సుప్రీం తీర్పు అనంతరం కేరళలో నెలకొన్న సామాజిక అశాంతిని మనమంతా టీవీల్లో చూశామన్నారు.

తీర్పుపై రివ్యూ అవసరం లేదు: కేరళ ప్రభుత్వం

అయతే కేరళలోని పవిత్ర శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్న వయసుల మహిళలకు అనుమతి కల్పిస్తూ ఇచ్చిన తీర్పుపై ఎలాంటి పునః సమీక్ష చేపట్టాల్సిన అవసరం లేదని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ వివాదంపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై బుధవారం విచారణ సందర్భంగా కేరళ ప్రభుత్వం తరపున న్యాయవాది జైదీప్ గుప్తా తన వాదనలు వినిపించారు. రివ్యూ పిటిషన్ల రూపంలో కేసును తిరిగి చేపట్టలేరని ఆయన పేర్కొన్నారు. 'హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలను ఆలయంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించాల్సిన అవసరం లేదు. దీన్ని కోర్టు గుర్తించింది. ఓ ఆలయ సంప్రదాయాన్ని మొత్తం మతాచారంగా చెబితే చట్ట ప్రకారం చెల్లదు. దీన్ని ఆధారంగా చేసుకునే తీర్పును సమీక్షించమని కోరడం సరికాదు. శబరిమల తీర్పుపై సమీక్ష అవసరం లేదు' అని జైదీప్ గుప్తా కోర్టుకు తెలిపారు. దీనిపై దాఖలైన రివ్యూ పిటిషన్లను కొట్టివేయాలని కేరళ ప్రభుత్వం తరపున న్యాయస్థానాన్ని ఆయన కోరారు.


పిటిషనర్లందరి వాదనలు వినలేం..

అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై 64 రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే సమయాభావం దృష్ట్యా పిటిషనర్ల అందరి వాదనలు వినలేమని ధర్మాసనం తెలిపింది. 8 నుంచి 9 మంది పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత తీర్పు వెల్లడిస్తామని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ఈ పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలా వద్దా అనే దానిపై ఉత్తర్వును వెలువరిస్తామని రాజ్యాంగ బెంచ్ పేర్కొంది.


మరోసారి శబరిమలను సందర్శిస్తాం: బిందు, కనకదుర్గ

శబరిమల ఆలయాన్ని మరోసారి సందర్శిస్తాని బిందు, కనకదుర్గ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ నెల 12న ఆలయం తిరిగి తెరుచుకోగానే ప్రవేశించాలని భావిస్తున్నరని వారి తరుపు న్యాయవాది ఇంద్రా జైసింగ్ సర్వోన్నత న్యాయస్థానికి బుధవారం వెల్లడించారు. ఆలయ సందర్శనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మహిళలంతా ఎలాంటి అడ్డంకులు లేకుండా లోనికి ప్రవేశించేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు. కాగా శతాబ్దాల సంప్రదాయాలను ధిక్కరిస్తూ శబరిమల ఆలయంలోకి అడుగుపెట్టి అత్తమామల చేత ఇంటి నుంచి గెంటివేతకు గురైన కనకదుర్గ ఎట్టకేలకు తిరిగి ఇంటికి చేరింది.

అయోధ్యపై వీహెచ్‌పీ యూటర్న్



(మొదటి పేజీ తరువాయి) చేశారు. దీని కోసం బుల్లెట్లను ఎదుర్కోడానికైనా సరే తాము సిద్ధమేనన్నారు. హిందువులంతా ఒక్కొక్కరు నాలుగు ఇటుకలు పట్టుకుని ఫిబ్రవరి 21న అయోధ్యకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వసంతపంచమి రోజైన ఫిబ్రవరి 10న సాధువులంతా అలహాబాద్ నుంచి అయోధ్యకు యాత్రను ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు అంటే తమకు గౌరవం ఉందనీ, అయితే ఇప్పుడు తాము రామాలయ నిర్మాణం ప్రారంభించకపోతే ఇంకెప్పటికీ కుదరకపోవచ్చని శంకరాచార్య స్వరూపానంద సరస్వతి స్పష్టం చేశారు. ఇక సాధారణ ఎన్నికల వేళ మిత్రపక్షమైన శివసేనతోపాటు మాతృసంస్థ ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థల నుంచి బీజేపీపై తీవ్ర వ్యతిరేక వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రం అయోధ్యపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగానే అయోధ్యలో గతంలో సేకరించిన వివాద రహిత భూమి ని తిరిగి వాస్తవ యజమానులకు అప్పగిం చేందుకు అనుమతివ్వాలంటూ సుప్రీంకోర్టులో కేంద్రం ఇటీవల పిటిషన్ వేసింది. దీనిపై సర్వోన్నత న్యాయం స్పందన కోసం ఎదురు చూస్తున్న మోదీ ప్రభుత్వం.. బడ్జెట్ సమావేశాల తర్వాత కీలక నిర్ణయం ప్రకటించే అవకాశముంది. బీజేపీ నేతలు కూడా పరోక్షంగా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. అయోధ్యలో మందిర నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఏ అనుమానం లేదని ఇటీవల డెహ్రాడూన్‌లో బీజేపీ నిర్వహించిన త్రిశక్తి సమ్మేళనంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. అయితే రామ మందిరంపై రాహుల్ గాంధీ మాట ఏమిటని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణంపై కాంగ్రెస్ వైఖరిని స్పష్టం చేయాలని అమిత్ షా డిమాండ్ చేశారు. అయోధ్య రామ జన్మభూమిలోని వివాద రహిత భూమి సుమారు 42 ఎకరాలు ఉందన్నారు. దీనిని అసలు యజమానులైన రామ జన్మభూమి న్యాస్, తదితరులకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటోందని అయితే దీనిపై కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. రామాలయాన్ని నిర్మించాలా? వద్దా? ఏదో ఒకటి చెప్పండి అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అమిత్ షా కోరారు. కాంగ్రెస్ పార్టీ అభిప్రాయమేంటో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా ఈ నెల 10న తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి కుంభమేళాలో పవిత్ర స్నానం మాచరించనున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ యూపీ వేదికగా అయోధ్యపై అమిత్ షా ప్రశ్నకు సమాధానమిచ్చే అవకాశముంది. మరోవైపు సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శివసేన వంటి మిత్రపక్షాలను ప్రసన్నం చేసుకునేందుకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తర్వాత అయోధ్యపై కేంద్రం తర్వలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇంతలోనే దేశవ్యాప్తంగా చేపట్టిన రామజన్మభూమి ఉద్యమానికి విశ్వహిందూ పరిషత్ బ్రేక్ ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



తీవ్ర పరిణామాలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి) అనుమతులిచ్చారన్నారు. కోరిన మైదానాన్ని కాకుండా చిన్న మైదానాన్ని కేటాయించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందన్న భయంతోనే..మమత ఈ విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. చిట్‌ఫండ్ కేసులో పోలీస్ అధికారిని సీబీఐ విచారించకుండా అడ్డంకులు సృష్టిం చి, ఆయనకు మద్దతుగా కోల్‌కతాలో మమత ధర్నా చేయడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

గూండాలను తరిమిన 'యోగి'

ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు మెరుగయ్యాయని అమిత్ షా తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌పై ప్రశంసలు గుప్పించారు యూపీలో యోగి పాలన రాకముందు.. మాఫియా కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయిందని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పారు. పోలీసులే.. గూండాలకు భయపడే పరిస్థితి నెలకొని ఉండేదన్నారు. ముఖ్యమంత్రిగా యోగి బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రం నుంచి మాఫియాను, గూండాలను తరిమికొట్టారని తెలిపారు. భూముల సమస్యను కూడా పరిష్కరించారని చెప్పారు. గత ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం సాధించిన కార్యకర్తలను ఆయన ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ప్రతిపక్షాలకు మధ్యకు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. యూపీలో ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై ఆయన విమర్శలు గుప్పించారు. మోదీపై ఉన్న భయంతోనే వ్యతిరేక శక్తులైన ఈ రెండు పార్టీలు క లిసి పోటీ చేస్తున్నాయని ఆయన విమర్శించారు.




వాద్రాను ప్రశ్నించిన ఈడీ

(మొదటి పేజీ తరువాయి) విరుచుకుపడింది. యూపీఏ హయంలో రాబర్ట్ వాద్రా భారీగా లబ్దిపొందారని, ఈ మొత్తంతో వాద్రా విదేశాల్లో కోట్లాది రూపాయలతో విలాసవంతమైన ఆస్తులను కొనుగోలు చేశారని బీజేపీ ప్రతినిధి సంబిట్ పాత్ర ఆరోపించారు. లండన్కు చెందిన ఓ స్థిరాస్తి(1.9మిలియన్ పౌండ్ల) వ్యవహారంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ వాద్రాపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. అయితే కేసు విచారణ నిమిత్తం ఫిబ్రవరి 6న ఈడీ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని కోర్టు వాద్రాకు సూచించింది. దీంతో నేడు ఆయన ఈడీ కార్యాలయానికి వచ్చారు.

గిరిజన విశ్వవిద్యాలయాన్ని

ప్రారంభించండి

- కేంద్రమంత్రికి కడియం వినతి



విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజన విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించాలని మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు కడియం కలిశారు. భేటీ అనంతరం కడియం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభం చాలా ఆలస్యమైందన్నారు. 2019–20 విద్యా సంవత్సరంలో ములుగు జిల్లా కేంద్రంగా గిరిజన విశ్వ విద్యాలయం ప్రారంభించాలని జవదేకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. సూపర్ న్యూమరిక్ సీట్లను ఏర్పాటు చేసి స్థానిక గిరిజనులకు మేలు జరిగేలా చట్టంలో ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జబాల్పూర్‌లోని ఇందిరా గాంధీ వర్సిటీలో గిరిజనులకు అన్యాయం జరిగిందని, అలాంటి పరిస్థితి తెలంగాణలో రాకుండా చట్టంలో సవరణ చేయాలని కోరామన్నారు. గిరిజన వర్సిటీలో ఉద్యోగావకాశాలున్న కోర్సులను ప్రారంభించాలని తెలిపారు. 2019–20లోనే గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి జవదేకర్ హామీ ఇచ్చారని కడియం వెల్లడించారు. అదే విధంగా ములుగు జిల్లాల్లో నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. రాష్ట్రానికి 13 నవోదయ, 21 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. 15 రోజుల్లో కొత్త నవోదయ విద్యాలయాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు సైతం త్వరలో చేపడతామని హామీ ఇచ్చారని కడియం చెప్పారు.

ఈ నెల 10న కేబినెట్ విస్తరణ?

• 8 మందికి మాత్రమే అవకాశం

విజయక్రాంతి, హైదరాబాద్: ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కేబినెట్ విస్తరణ ఈ నెల 10 వ తేదీన జరగనున్నట్లు విశ్వాస నీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కేవలం ఒక ఎనిమిది మందిని మాత్రమే మంత్రివర్గంలోకి తీసుకోవాలని కేసీఆర్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో కేటీఆర్, హరీష్‌రావులకు చోటు దక్కక పోవచ్చని పార్టీ వర్గాల భోగట్టా. రేపు, లేదా ఎల్లుండి క్యాబినెట్‌లోకి తీసుకునే నాయకులకు సమాచారం అందవచ్చని తెలుస్తోంది . అయితే పార్లమెంట్ ఎన్నికల అనంతరం మరోసారి కేబినెట్ విస్తరణ ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

నిరుద్యోగ మహిళలకు శిక్షణా తరగతులు

విజయక్రాంతి, రాజేంద్రనగర్: సాంకేతిక శిక్షణలో నిరుద్యోగ యువత రాణిస్తే జీవితంలో స్థిరపడతారని బైరెడ్ సంస్థ డైరెక్టర్ యేసెపు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని డైరెడ్ (బ్యాంకర్ల గ్రామీణ, అభివృద్ధి సంస్థలో నిరుద్యోగ మహిళలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో వృత్తి నైపుణ్యతతో పాటు శారీరక దారుఢ్యం ఎంతో అవసరమన్నారు. బైరెడ్ సంస్థ ఎంతో మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, వసతులు కల్పిస్తూ నిరుద్యోగుల పాలిట బాసటగా నిలిచిందన్నారు. నైపుణ్యం కలిగిన శిక్షకులచే నిర్ణీత కాలంలో నిరుద్యోగ మహిళలు, యువకులకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సంస్థలో కంప్యూటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్ధోసీ, మగ్గం, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతందన్నారు. అంతే కాకుండా శిక్షణ కాలంలో యోగా, ఆరోగ్య వైద్య సేవలను సైతం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీరావు, కెనారా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వరప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ రవిందర్, ఫ్యాకల్టీ వెంకట్‌రాంరెడ్డి, సతీష్, మహ్మద్ షరీఫ్, ఉమామహేశ్వరీ, నిర్మల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ ప్రక్రియ ప్రారంభం



విజయక్రాంతి, హైదరాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తొలి విడత తనిఖీ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఇటీవల ఈవీఎంలపై వస్తున్న ఆరోపణలను దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటిస్తున్నారు. దీనిలో భాగంగా చుడీ బజార్లో ఉన్న ఈవీఎం గోడౌన్ నుండి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలోని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను చాదర్ఘాట్ విక్టరీ ప్లేగ్రౌండ్ కు తరలించేందుకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీజ్ చేయబడిన చుడీ బజార్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను తెరిచారు. ఈ గోడౌన్లో ఉన్న దాదాపు 14వేల బి.యు, సి.యు, వివి ప్యాట్లను చాదర్ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ గోడౌన్ కు తరలించారు. అడిషనల్ కమిషనర్లు అద్వైత్ కుమార్ సింగ్ , సందీప్‌షా జా లతో పాటు వివిధ రాజకీయ పార్టీలు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రాజేష్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి పవన్, సి.పి.ఐకి చెందిన శ్రీకాంత్‌ల సమక్షంలో చుడీ బజార్ ఈవీఎం గోడౌన్ సీలును తొలగించారు. దీనికి ముందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన ప్రత్యేక గదులకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. ఈ తాళాలు, సీళ్ల పై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం వారి సమక్షంలోనే గదులను తెరిచి ఈవీఎంలను ప్రత్యేక వాహనంలో విక్టరీ ప్లేగ్రౌండ్‌కు తరలిస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకై ...

మేడ్చల్ జిల్లాలో 23 మంది నోడల్ అధికారులు

విజయక్రాంతి, మల్కాజిగిరి: రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మేడ్చల్ జిల్లాలో మొత్తం 23మంది నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.వి.రెడ్డి తెలిపారు. ఈ మేరకు కొత్తగా నియమితులైన నోడల్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని వారిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపై ఇప్పటినుండే తగిన ప్రణాళికను తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నియమావళిని పూర్తిగా అమలు పరచాల్సిన బాధ్యత నోడల్ అధికారులపైనే ఉందని ఆయన గుర్తు చేశారు. సూపరింటెండెంట్‌లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకుంటూ సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈసారి దివ్యాంగుల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవీఎంలు భద్రపరిచేందుకు వీలుగా స్ట్రాంగ్ రూంల ఏర్పాటు కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.



ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ముందుకు

• శివరాంపల్లిలో సాయంత్రపు ఆసుపత్రి ప్రారంభం

విజయక్రాంతి. రాజేంద్రనగర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం శివరాంపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో రంగారెడ్డిజిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిణి వెంకట స్వరాజ్యలక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుజనలతో కలిసి సాయంత్ర కాలపు 'ఇవినింగ్ ఆస్పిటల్) ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఎల్లవేళల మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఆసుపత్రులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తుండగా గర్భిణీలు, బాలింతలు ఇతర మహిళలకు సంబంధించిన వైద్య సేవలు అందించేందుకు ఈ సాయంత్రపు ఆసుపత్రులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అనవసరంగా డబ్బులు ఖర్చుచేసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన సేవలు పొందాలని సూచించారు. అదే విధంగా జిల్లా వైద్యాధికారి వెంకటస్వారాజ్యలక్ష్మీ మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకోసం సాయంత్రపు ఆసుపత్రులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇక మహిళలు సోమవారం నుంచి గురువారం వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సాయంత్రపు ఆసుపత్రిలో గర్భకోశ నిపుణులు (గైనకాలజిస్టు) వైద్యసేవలు పొందవచ్చునన్నారు. సాధారణ రోజుల్లో ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంట వరకు సాధరణ వైద్య సేవలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మీ, డాక్టర్ వందనరాజన్, డాక్టర్ సౌమ్య, సూపర్ వైజర్ భువనేశ్వరి, డాక్టర్ కేశవ్, డాక్టర్ రమణ, రంగారెడ్డిజిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ డేవిడ్, వార్డు కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, ఎన్‌జీఓ పి.వెంకటేశ్, స్థానిక నాయకులు పడమటి శ్రీధర్‌రెడ్డి, బండారు శంకర్, శివ ముదిరాజ్, తదితరులున్నారు.



ఫీజుల చెల్లింపులపై విద్యార్థి సంఘాల ఆందోళన



విజయక్రాంతి, బోడుప్పల్: ప్రభుత్వం నుండి రావాల్సిన రీయంబర్స్ మెంట్ రాక ముందే ముందస్తుగా ఫీజుల చెల్లించాలని యాజమాన్యం చేస్తున్న వత్తిళ్లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగిన సంఘటన పర్వతాపూర్ లో జరిగింది. వివరాల్లోకి వెళితే మేడిపల్లి పీఎస్ పరిధిలో ఉన్న అరోరా ఇంజనిరింగ్ కళాశాలలో ఇంజనిరింగ్ చదువుతున్న విద్యార్థులను, కళాశాల యాజమాన్యం తీవ్ర అర్థిక సంక్షోభంలో ఉంది కనుక విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులను సత్వరమే చెల్లించాలని సర్క్యూలర్ జారీ చేసింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. =ఇది తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు కళశాల ఆవరణకు చేరుకుని విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఓ వైపూ ఫీజు రియంబర్స్ మెంట్ మంజూరు చేయకుండా సర్కార్ చోధ్యం చేస్తుంటే మరో వైపూ ఫీజులు కట్టలంటూ కళశాల యాజమాన్యాలు వత్తిళ్లు చేయాడం ఎంటని ప్రశ్నించారు...ఈ రోజు నష్టాల్లో ఉన్నం కనుక ఫీజులు సత్వరమే ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా యాజమాన్యాలు గతంలో లాభాల బాటలో ఉన్న సమయంలో విద్యార్థులకు వాటాలు పంచి ఇచ్చారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థి సంఘం నాయకులు అన్వర్, సునీల్, రమేష్‌లు పాల్గొన్నారు

సహకరించమని కోరాం– డైరెక్టర్ శ్రీకాంత్

విద్యార్థులు ,విధ్యార్థి సంఘం నాయకులు చేస్తున్న అందోళన విషయంపై స్పందించిన యాజమాన్యం ఎట్టకేలకు దిగిచ్చిన యాజమాన్యం విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల డిప్యూటి డైరక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తాము ఇబ్బందుల్లో ఉన్నందున మాకు సహకరించాలని కోరాం అయితే ఇది విద్యార్థులను ఇబ్బంది పెట్టాలని చేసిన పని కాదని అన్నారు.

ఫుట్‌పాత్‌ల నిర్మాణంపై దృష్టి సారించిన జీహెచ్ఎంసీ



విజయక్రాంతి, హైదరాబాద్: జంటనగరాలలో వాకింగ్ ఫ్రెండ్లీ ఫుట్‌పాత్‌ల నిర్మాణం దిశగా జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. పాదచారులు సురక్షితంగా నడిచేలా ఆక్రమణలు నియంత్రించేలా , ప్రత్యేక డిజైన్ల రూపకల్పనపై దృష్టి సారించింది. పాదచారులు ప్రమాదాలకు గురికాకుండా, మహిళల మెడల్లో బంగారు నగల చోరీ జరగకుండా తగిన జాగ్రత్తలతో కొత్త ఫుట్‌పాత్‌లు నిర్మించాలని నిర్ణయించారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల డిజైన్ సరిగా లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎగుడుదిగుడుగా ఉన్న ఫుట్‌పాత్‌లపై నడిచే క్రమంలో అదుపు తప్పి కింద పడి గాయాల పాలవుతున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో నడకదారులు ఉన్నా రోడ్లపైనే పాదచారులు వెళ్లాల్సి వస్తోంది. ఇది చాలా ప్రమాదాలకు కారణమవుతోంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పట్‌పాత్‌లు నిర్మిస్తున్నా పూర్తి స్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేక నిరూపయోగంగా మారుతున్నాయి. జీహెచ్ఎంసీ, మెట్రో రైల్ విభాగాలు పలు ప్రాంతాల్లో నిర్మించిన ఫుట్‌పాత్‌లు రంగరంగుల టైల్స్‌తో ఆకర్షణీయంగా కనిపిస్తున్నా నడిచేందుకు మాత్రం అనువుగా లేని పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల ఫుట్‌పాత్ లేకపోవడంతో ఎక్కడం, దిగడం పాదచారులకు ఇబ్బందికరంగా ఉంది. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే పౌరులకూ అసౌకర్యంగా ఉంది. మాదాపూర్‌లో నిర్మించిన ఫుట్‌పాత్ డిజైన్లపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఈ పరిస్దితి చక్కదిద్దాలని స్దానికులు కోరుతున్నారు.

కమలానగర్ రైల్వే స్టేషన్‌లో హాల్ట్



విజయక్రాంతి, హైదరాబాద్: కమలానగర్ రైల్వే స్టేషన్‌లో విజయవాడ – సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించారు. రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో బీదర్ ఎంపీ భగవంత్ ఖుబా మాట్లాడుతూ, విజయవాడ – సాయినగర్, షిర్డీ– విజయవాడ, కాకినాడ పోర్ట్ – సాయినగర్ షిర్డీ – కాకినాడ పోర్ట్, సికింద్రాబాద్ – సాయినగర్ షిర్డీ – సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించినట్టు తెలిపారు. ఈ హాల్టు సౌకర్యంతో షిర్డీ వచ్చే యాత్రికులతో పాటు స్థానికులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

విజయక్రాంతి, మంథని: పెద్దపల్లి జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను వేగవంతం చేసి, పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని కొరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు వినతి పత్రాన్ని సమర్పించినట్లు మంథనికి చెందిన కీసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శశి భూషణ్ కాచే తెలిపారు. పత్తి క్వింటాల్‌కు రూ. 5400 చెల్లించి కొనుగోలు చేయాలని ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతుంటే, సీసీఐ అధికారులు, మార్కెటింగ్ అధికారులు మద్దతు ధరకు అమ్మించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ట్రేడర్లు తేమ పేరుతో రైతులను దోచుకుంటున్నారన్నారు.

మధులికపై దాడి దుర్మార్గం: వీహెచ్

హైదరాబాద్: మైనర్ బాలిక మధులికపై జరిగిన దాడి ఘటన దుర్మార్గమైందని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిపై అతికిరాతకంగా దాడి జరుగుతుంటే ఎవ్వరూ అపకపోవడం మరింత దారుణమన్నారు. అమ్మాయి నుంచి నేలమీద పడ్డ రక్తపు బొట్లను కడిగెయ్యడం అమానుషమని తెలిపారు. అబ్బాయిపై ఫిర్యాదు చేస్తే షీటీమ్స్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చారు తప్ప పోలీసులు ఎందుకు సీరియస్ వార్నింగ్ ఇవ్వలేదని వీహెచ్ మండిపడ్డారు. అమ్మాయి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నిందితుడు భరత్, ఆయనకు సహకరిస్తున్న బంధువులపై చర్యలు తీసుకోవాలన్నారు. షీ టీమ్ ఎందుకు కేసు బుక్ చెయ్యలేదని ప్రశ్నించారు. కేవలం కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో క్రైమ్ ఎక్కువ అవుతోందని ధ్వజమెత్తారు.

విజయశాంతి ఎంపీగా పోటీ చేస్తే గెలిపిస్తాం

విజయక్రాంతి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్న తరుణంలో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి విజయశాంతి పోటీ చేస్తే స్వాగతించి గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మానవతారాయ్ అన్నారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ నటిగా, తెలంగాణ ఉద్యమకారిణిగా ఆమెకు గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. ఖమ్మం నుంచి చాలాసార్లు వలస నేతలే విజయం సాధించారని ఆయన గుర్తుచేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం కోసం, విజయశాంతి గెలుపు కోసం తాను కృషిచేస్తానని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి స్థానం నుంచి పోటీచేయ్యాలని మానవతా రాయ్ ప్రయత్నించారు. ప్రస్తుతం వరంగల్ లోక్‌సభ స్థానాన్ని తనకు కేటాయించాలని రాహుల్ గాంధీని కోరాతానని ఆయన తెలిపారు.




లక్ష్యం..పచ్చదనమే

• జిల్లాల్లో కలెక్టర్ల విస్తృత పర్యటనలు

విజయక్రాంతి, సంగారెడ్డి: తెలంగాణలో పచ్చదనాన్ని పరిచి...ఆకుపచ్చగా మార్చాలన్నా ప్రభుత్వ లక్ష్యాన్ని చేదించడమే లక్ష్యంగా పాలనాధికారులు, తదితర అధికారులు పరుగులు తీస్తున్నారు. గత నాలుగేళ్లలో నాటి మొక్కలకంటే ఐదో విడతలో ఇంకా అధికంగా మొక్కలు నాటడమే లక్ష్యంగా సమీక్షా సమావేశాలు వి స్తృతం చేశారు. సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామాలలోని నర్సరీలను పరిశీలిస్తున్నారు. నర్సరీలు లేని గ్రామాలలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచి సంరక్షించాలని సూచిస్తున్నారు.

నాలుగేళ్ల లక్ష్యం... ఈ ఏటే...

గడిచిన నాలుగేళ్లలో నాలుగుచ విడతల్లో ఏడాదికి కోటి మొక్కలు నాటగా ఈ ఏడాది జిల్లాలో నాలుగు కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. శివంపేటలో ఏర్పాటు చేసిన మండల్ సర్వభ్య సమావేశంలో పాల్గొని కలెక్టర్ కొత్త సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. పంచాయితీరాజ్ కొత్త చట్టంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయితీలో నర్సరీ ఏర్పాటు చూసి మొక్కలు పెంచాలని, నాటిన మొక్కల్లో 80 శాతం సంరక్షించాలన్నారు. జిల్లాలోని 15 గ్రామాలలో తప్ప అన్ని గ్రామ పంచాయితీల్లో నర్సరీలను పెంచుతున్నారని తెలిపారు. గ్రామాలలో సంపూర్ణ పారిశుద్యానికి గాను ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకు అవసరమైన సహాకారం తాము అందిస్తామన్నారు.



శివ్వంపేటలో భూసమస్యలు అధికం

శ్వింపేటలో పట్టాదారు పాసుపుస్తకాలు రాక రైతు బందు, బీమా పథకాలు ధక్కడం లేదని స్థానిక పాలకులు కలెక్టర్ దృష్టికి తేగా...స్పందించిన ఆయన జిల్లాలోనే శివ్వంపేటలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, శివ్వంపేటతో పాటు మరో 12 గ్రామాలలో జమీందారు భూముల్లో సర్వే సంపూర్ణంగా చేమయలేదని పేర్కొన్నారు. ఈ గ్రామాలలో ఒక సర్వే నంబరు రెండు సార్లు ఉండడంతో సమస్యలు తలెత్తాయన్నారు. శివ్వంపేట, పిల్లుట్లలో సర్వే పూర్తి చేశామని తెలిపారు. మరిన్ని భూసమస్యలు పరిష్కరించవలసి ఉందన్నారు. పాప న్నపేట మండలంలోనూ ఇలా ంటి సమస్యలు కొన్ని ఉన్నాయన్నారు.



ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడే కొలస్ట్రమ్...

పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరం. పుట్టిన గంటలో తల్లి పాలు త్రాగకపోతే బిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. తొలి గంటలోనే పాలు ఇవ్వకపోతే బిడ్డ చనిపోయే అవకాశాలు 33 శాతం పెరుగుతాయి. ఒకవేళ 24 గంటల్లో కూడా తల్లి పాలు అందకపోతే, శిశువు మరణించే ప్రమాదం రెట్టింపు అవుతుంది. తల్లి అయిన తర్వాత కొన్ని రోజుల వరకూ కొలొస్ట్రమ్ ఉత్పత్తి అవుతుంది. కొలస్ట్రమ్‌ను తల్లి తొలిపాలు అంటారు. తల్లీబిడ్డల మధ్య మొదటి స్పర్శ కొలొస్ట్రమ్ ఏర్పడడానికి కూడా సాయం చేస్తుంది. ఇది చిక్కగా, జిగటగా, పసుపుగా ఉంటుంది. ఇందులో కార్బోహైడ్రేట్, ప్రొటీన్, యాంటీబాడీస్ నిండి ఉండి, ఫ్యాట్ చాలా తక్కువగా ఉంటుంది. అందుకే పిల్లలు వీటిని సులభంగా జీర్ణం చేసుకోగలరు. సీసెక్షన్ అంటే ఆపరేషన్ వల్ల జరిగే ప్రసవాలు పెరగడం వల్ల కూడా చాలా సార్లు తల్లి గంటలోపే బిడ్డకు పాలు తాగించలేకపోతుంది. కానీ పిల్లలకు ఎలా బ్రెస్ట్ ఫీడ్ ఇవ్వాలి అనేది తెలుసుకుంటే.. అది అంత సమస్య కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో బిడ్డను పుట్టగానే తల్లి చేతికి అప్పగిస్తారు. ఆ తర్వాతే శుభ్రం చేస్తారు. ఏదైనా కారణంతో పిల్లలు పాలు తాగలేకపోతుంటే, సక్షన్ పంప్‌తో పాలు తీసి డ్రిప్ ద్వారా తాగించవచ్చు. అలా కాకుండా తల్లే పాలు ఇచ్చే స్థితిలో లేనప్పుడు బిడ్డకు ఫార్ములా మిల్క్ ఇవ్వడం తప్పనిసరి అవుతుంది. యునిసెఫ్ రిపోర్టు ప్రకారం తల్లి మొదట ఇచ్చే పాలను, పిల్లలకు మొదటి వ్యాక్సిన్‌గా భావిస్తారు. ఎక్కువ దేశాల్లో కొందరు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడానికి బదులు తేనె, చక్కెర నీళ్లు, ఫార్ములా మిల్క్ లాంటి ఇవ్వడమే మంచిదని భావిస్తారు. కానీ అలా చేయడం వల్ల తల్లి, బిడ్డ మధ్య బంధం ఏర్పడడం ఆలస్యం అవుతుంది. బిడ్డకు తల్లి పాలు కాకుండా వేరే పాలు ఇస్తే, ఆ బిడ్డ తల్లి పాలకు అలవాటు కాలేదు. స్తన్యం తాగలేదు. అలాంటి స్థితి మరింత ప్రమాదకరం కావచ్చు అని డాక్టర్ సింఘల్ చెబుతారు. చాలా రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడటానికి తల్లిపాలు ఎంతో అవసరం. కావున ప్రతి తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కొరకు కేవలం కొద్ది కాలం వరకు మాత్రమే కాకుండా, కనీసం సంవత్సరం పొడవునా త్రాగేటట్లు చేసుకోవాలి.

ఫుడ్ ఫర్ థాట్

మన కంచం మహా గొప్పది. మనం తినే తిండి, వండుకునే వంటలు, వండుకునే విధానం సర్వోత్తమమని పాశ్చాత్య అధ్యయనాలు ఇప్పుడు రూఢిచేస్తున్నాయి. జిహ్వకు పరమానందమే కాదు, పర్యావరణానికి పరమ సుఖమని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి. శాస్త్రవేత్తలు ఇప్పుడు సిఫార్సులు చేయడంతో పశ్చిమ దేశాల డైనింగ్ టేబుల్ పై భారతీయ వంటకాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇటీవలే సుప్రసిద్ధ శాస్త్రీయ పరిశోధనా పత్రిక లాన్సెట్‌లో 2050 నాటికి మాంసం వాడకాన్ని, పంచదార వాడకాన్ని సగానికి తగ్గిస్తే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేసినవారవుతామని ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మాంసాహార భోజనం పేరిట జరిగే జంతు హత్య, వాడకానికి ఉపయోగించే ఘాటు మసాలాలు, నూనెలు గ్లోబల్ వార్మింగ్‌లో 20 శాతం పెరుగుదలకు కారణమౌతున్నాయని కూడా అధ్యయనాలు ప్రకటించాయి. ఈ అధ్యయనాలు చేసినవారిలో పోట్స్ డామ్ ఇన్స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ చేంజ్ ఇంపాక్ట్ రీసెర్చ్ డైరెక్టర్ కూడా ఉండటం గమనార్హం. అంతే కాదు. మాంసాహారాన్ని వండి, వడ్డించే హోటళ్ల ముందు పర్యావరణవాదులు ప్రదర్శనలు చేయడమూ గణనీయంగా పెరిగింది. ఆ తరువాత నుంచి ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడే ఆహారాలకై వెతుకులాట మొదలుపెట్టి పాశ్చాత్యులు భారతీయ వంటకాలు, వండే విధానం, తినే విధానం మీద పడుతున్నారు. ఫలితంగా శాకాహారానికి పాశ్చాత్య దేశాల్లో పెద్ద పీట ... కాదు కాదు ... పెద్ద కంచం వేస్తున్నారు. అమెరికన్ సూపర్ మార్కెట్లలో ప్రాణ, గురు వంటి ఆహార బ్రాండ్లు అత్యధికంగా అమ్ముడు పోతున్నాయి. సింథెటిక్ ఎరువుల వాడకం లేని, రసాయనిక క్రిమిసంహారకాలతో పనిలేని ఆర్గానిక్ వ్యవసాయం ఇప్పుడు ఫేషన్ స్థాయికి చేరింది. ఈ ఏడాది కెనడా ప్రభుత్వం జారీ చేసిన అధికారిక ఫుడ్ గైడ్ 2019 లో భారతీయులు తరతరాలుగా తింటూ వస్తున్న అన్నం, పప్పు, పెరుగును సిఫార్సు చేసింది. పసుపును ఆహారపదార్థాల్లో వాడటాన్ని అత్యంత ఆరోగ్యకర విధానంగా కెనడా ప్రకటించడమే కాదు, భారతీయులు అత్యంత ఇష్టంగా తినే నెయ్యిని ఏకంగా సూపర్ ఫుడ్ గా ప్రకటించింది.

స్థానిక పంటలు, మార్కెట్లతో ప్రాసెసింగ్‌లతో సంబంధం లేని వంటింటి పంటలను ప్రోత్సహించాలన్న ఉద్యమం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. సస్టెయినబుల్ ఈటింగ్ (స్వయంపోషక ఆహార సేవనం) 2017 నుంచి లైఫ్ స్టైల్ ట్రెండ్ గా పాశ్చాత్యదేశాల్లో కొనసాగుతోంది. దీని ప్రకారం ఆయా ఋతువుల్లో లభించే స్థానిక ఆహార ఉత్పాదనలనే వాడటాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంతే కాదు. వీలైనంత వరకూ స్వహస్త భోజనం మంచిదని ప్రకటిస్తున్నారు. ఆహారాన్ని వృథా చేయవద్దని, అవసరానికి మించి వండుకుని, దాన్ని చెత్తకుప్పల్లో వేయడం మానేయాలని కూడా ఉద్యమాలు ఉధృతమౌతున్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని రీ యూజ్, రీ సైకిల్ చేయాలని కూడా ఉద్యమాలు నడుస్తున్నాయి.

నిజానికి ఇవన్నీ భారతీయ భోజన ప్రక్రియలో భాగాలే. అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా ఆరాధించడం, పూజించడం, సహనౌభునక్తు అంటూ పంచుకుని తినడం, భోజన కాలంలో మంచి ఆలోచనలు వచ్చేందుకు హరి నామస్మరణం చేయడం వంటివి ఫుడ్ సైకాలజీలో భాగమే. అదే విధంగా పర్యావరణానుకూల భోజనం, గ్లోబల్ వార్మింగ్‌ను నిరోధించే ఆహారం తయారీలకు భారతీయ ఆహార శాస్త్రం ప్రాథమ్యాన్నిస్తుంది. వృక్షాల నుంచి తయారయ్యే ఆహారపదార్థాలు గ్లోబల్ వార్మింగ్ ను కలుగచేయవన్న స్పృహ వల్లే శాకాహారాన్ని మన సంస్కృతి ఎంచుకుంది. అంతెందుకు? ఆఖరికి తద్దినాల్లో పిండప్రదానం చేసేటప్పుడు పిండాన్ని ఆవుకి వేస్తే పరమాన్నం ఆ పిండంలో కలపవద్దని, నీటిలో వేస్తే చేపలకు విషతుల్యమైన మినుములుండే మినప గారెలు కలపవద్దని చెబుతారు. ఇలాంటి పర్యావరణ స్పృహ మన కంచంలోని ప్రతి మెతుకుపై లిఖితమై ఉంది. ఇప్పుడు పాశ్చాత్య దేశాలు వీటి వైపు పయనించడం మంచి పరిణామం.

మన దేశంలోనూ పర్యావరణానుకూల ఆహారం కోసం పలు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు దేశ వ్యాప్తంగా ఆర్గానిక్ ఫార్మింగ్ పెరిగింది. 2016 నుంచే సిక్కిం నూటికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ రాష్ట్రంగా ఏర్పడింది. ఈ సారి పద్మశ్రీ గ్రహీతల్లో ఒకరైన రాజ్ కుమారీ దేవి వంటింటి పంటల ఉద్యమానికి జీవితాన్నే అంకితం చేశారు. కిసాన్ చాచీ (రైతు పిన్ని) గా పేరొందిన రాజ్ కుమారీ దేవి బీహార్ లో సైకిల్ పై ప్రయాణం చేస్తూ కిచెన్ ఫార్మింగ్‌ను, తద్వారా పర్యావరణపరంగా సానుకూలమైన ఆహార సేవనాన్ని ప్రోత్సహిస్తున్నారు.

అయితే దురదృష్టం ఏమిటంటే మన దేశంలో మాత్రం నాగరీకులు, విద్యాధికులు పాశ్చాత్య ఆహారశైలిని, వంట పద్ధతులను క్రమేపీ విసర్జించడం నానాటికీ పెరుగుతోంది. అకాల భోజనం అనవసరంగా పెరుగుతూండటం కూడా ఆందోళనకరమైన పరిణామం. అన్ని విషయాల్లోనూ పాశ్చాత్యులను అనుకరించడమే నాగరికమనుకునే మన విద్యాధిక నాగరీకులు ఈ విషయంలోనూ పాశ్చాత్యాన్ని అనుసరిస్తే బాగుంటుందేమో కదా!!

శ్రేష్ఠతా సోపానపథం (శ్రేష్ఠతాకరదీపిక)

'శ్రేష్ఠతాసోపానపథం' (సుగమమైన – సులభమైన మెట్లు) మొదట 1987లో ఎక్సెల్ సమూహానికి ప్రస్తుత సంయుక్త కార్యనిర్వాహక సంచాలకులు, భావనగర్ విభాగానికి పూర్వ ముఖ్య నిర్వాహణాధికారి అయిన శ్రీ దీపేశ్‌బాయి ష్రాఫ్ గారికి ఒక సుదీర్ఘమైన లేఖారూపంలో నిర్మించి ఇచ్చినాను.

1986–87 కాలంలో ఎక్సెల్ విషమ పరిస్థితులను ఎదుర్కొన్నది. వాటిని అధిగమించి, సంస్థలో నూతనోత్తేజాన్ని జవసత్వాలను తిరగి నింపవలసిన అవసరం ఏర్పడింది. ఆ ప్రయాసలో ఈ సోపానపథం ముఖ్య భూమిక పోషించింది.

ఈ లేఖ శ్రీ దీపేశ్‌భాయిని ఎంతో ప్రభావితం చేసింది. ఈ అనుభూతిని పరిశ్రమల్లోని తన సహయోగులకు గూడా పంచిఇచ్చే సంకల్పంతో, దీన్ని రెండు ముద్రణల్లో వెరసి 4,000 ప్రతులను ప్రచురించియున్నారు. ఆ తర్వాత ఎక్సెల్ వారు నిర్వహిస్తున్న వివిధ క్షేత్రాల్లోని ప్రశిక్షణ కేంద్రాలన్నింటిలో ఒక పాఠ్యాంశం అయింది.

ఈ పుస్తకాన్ని శ్రీ ప్రభాకర్‌తోషార్, శ్రీ రోహిదాస్‌కబాడే గార్లు మరాఠీలో శ్రేష్ఠతా చా సోపాన్ గా రూపాంతరం చేసినారు. అలాగే గుజరాతీలో శ్రీ హస్‌ముఖ్ ఉపాధ్యాయ గారు శ్రేష్ఠతానూ సోపాన్ మకుటంతో భావానువాదం చేసినారు.

యష్ పేపర్స్ లిమిటెడ్, ఏసియా బ్రౌన్ బోవరీ లిమిటెడ్, న్యూటన్ కెమికల్స్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థల్లోని ఉద్యోగులు కార్యనిర్వాహకులు ఈ గ్రంథాలను వారి కరదీపికలుగా ఆదరిస్తున్నారు.

ఇప్పటి వరకు మొత్తం 12,000 ప్రతులు ముద్రించటం జరిగింది. పారిశ్రామిక వర్గాల్లోని చాలా మంది దీన్ని తమ వ్యక్తిగత పరిష్కార సూచిగా సంప్రదిస్తున్నారు.

ప్రముఖ శహనాయి విద్వాంసులు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ గారు ఈ గ్రంథాన్ని పరిశీలించినారు. శ్రేష్ఠతాసోపానపథంలో వివరించిన "నాణ్యత నుండి స్పష్టత" వరకు గల పద్దెనిమిది అంశాలు సంగీత కళలో శ్రేష్ఠతకు గూడా అన్వయిస్తాయని ప్రశంశించినారు.

నేను ఆంగ్లంలో వ్రాసిన 'విద్యాభ్యాసంలో శ్రేష్ఠత' జీవన సరళిలోని ప్రతి క్షేత్రంలోని 'అభ్యాసం–పరిశ్రమ'లకు అన్వయించగలదని నిరూపించింది. 'నాణ్యత మరియు శ్రేష్ఠత' అనే విషయంపై ఆంగ్లంలో 'లెట్ క్వాలిటీ అండ్ ఎక్సెలెన్స్ బి యువర్ సిగ్‌నేచర్' పద్య రూపంలో కూర్చినాను. ఇది పలు గోష్ఠుల్లో, సభల్లో, సమావేశాల్లో ఆదరణీయమైంది.

ఈ శ్రేష్ఠతాసోపానపథం, నిరంతర అధ్యయనం, అభ్యాసం, అనుభవం, భాగస్వామ్యాల ద్వారా నా జీవన సరళిలో అతి ముఖ్యమైన భాగంగా రూపొందింది. 'అహ్మదాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' (ఏ.ఎం.ఏ) వారు దీని సవరణ రూపాన్ని ప్రచురిస్తున్నందుకు నాకెంతో ముదావహం.

నాయకత్వంలో నైతిక విలువలను నిర్వచిస్తూ ఆంగ్లంలో రచించిన బాధ్యతాయుతమైన నాయకత్వం :గీతామార్గంలో ప్రయాణం గ్రంథాన్ని ఏ.ఎం.ఏ. వారు గతంలో ప్రచురించి యున్నారు. ఇప్పుడు నిర్మించిన ఈ శ్రేష్ఠతా సోపానపథం శ్రమ సంస్కృతిలోని నైతిక విలువలను నిర్వచిస్తున్నది. ఈ విధంగా ఈ రెండు గ్రంథాలు నాయకత్వంలోని, శ్రమసంస్కృతిలోని నైతిక విలువలను నిర్ధారిస్తున్నాయి.

మన భారతీయ కార్యనిర్వాహకులకు మరియు నాయకత్వానికి వారి శ్రేష్ఠతా శిఖరారోహణానికి సుగమమైన ఈ శ్రేష్ఠతా సోపా నపథాన్ని అందిస్తున్న అహ్మదాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.



పాఠకులకు, శ్రేష్ఠతా భాగస్వాములకు శుభాకాంక్షలతో..

గట్టు నారాయణ (గురూజీ)
శ్రేష్ఠతా సోపానపథం పుస్తకం నుంచి

నీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై చిట్టావిప్పిన జగపతిరావు

(నిన్నటి తరువాయి)

ప్రతాప్ కిషోర్ ఆయనమిత్రులు షేర్‌ఖాన్, సయ్యద్ షహబుద్దీన్ తదితరులకు నాగపూర్‌లో విదర్భ జర్నలిస్ట్ సంఘం ఆతిథ్యం ఇచ్చి, విదర్భనాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రతినిధుల కార్యకలాపాలకు నాగపూర్ పట్టణంలో స్థానిక పత్రికలు చాలా ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రతాప్‌కిషోర్ ఇక ముందు ప్రయాణం కాలినడకన కొనసాగించే అవకాశం బొత్తిగా లేకపోవడంతో ఈ ప్రతినిధి వర్గం రైలు ప్రయాణం చేసి ఢిల్లీ చేరుకొని మరొకసారి ప్రధానమంత్రికి కేంద్రమంత్రులకు విజ్ఞాపన పత్రాలు సమర్పించింది.

ఢిల్లీ నుండి తిరిగివచ్చిన అనంతరం మరికొందరు ప్రత్యేక రాష్ట్ర వాదుల సలహాపై పాత తెలంగాణ ప్రజా సమితిని పునరుద్దరించి 'గణ సభను' రద్దు చేశారు. 1987 పునః ఆవిర్భవించిన టి.పి.యస్‌కు వరంగల్‌కు చెందిన నాయకుడు భూపతి కృష్ణమూర్తిని అధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు. అప్పటికే తెలంగాణ పోరాట సమితి పేరుతో ప్రత్యేక రాష్ట్ర సాధన కొరకు మేచినేని కిషన్‌రావు, కె.ఆర్. అమోస్ ప్రభృతులు ఉద్యమం ప్రారంభించి తమకు తోచిన కార్యక్రమాలు చేబట్టారు.

ఈలోగా ఢిల్లీలో ఏర్పాటైన అఖిలభారత సదస్సు చిన్న రాష్ట్రాల ఏర్పాటు గురించి చర్చించి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం సమర్పిస్తూ తెలంగాణ, జార్ఖండ్, విదర్భ మొదలైన ప్రాంతాల ప్రజల అభీష్టం మేరకు ఆయాప్రాంతాలకు రాష్ట్రప్రతిపత్తి ఇవ్వాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజాసమితి ప్రతినిధులను కూడ ఈ సదస్సు నిర్వాహకులు ఆహ్వానించగా, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల గురించి 1989లో శాసన సభ చర్చించింది.

1991–92 ప్రాంతంలో, తెలంగాణ ప్రముఖ రాజకీయ నాయకుడు మాజీ శాసనసభ్యుడు శ్రీ వెలిచాల జగపతిరావు నీటిపారుదల భాగంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను, అధికారిక సమాచారాన్నే ఉటంకిస్తూ సవివరంగా ఒక ప్రచురణను వెలువరింపచేశారు. ఈ ప్రచురణలో వివరాలు తెలంగాణ నాయకులకు మనస్తాపాన్ని, కనువిప్పును కలుగచేశాయి.

తమ ప్రచురణలో శ్రీ వెలిచాల జగపతి రావుగారు ఎంతో విలువైన సమాచారం పొందుపరిచారు. వాటిలో కొన్ని భాగాలు సంక్షిప్తంగానే ఇక్కడ ప్రచురించడం జరిగింది. శ్రీ జగపతిరావు గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

'ఆంధ్రప్రదేశ్‌లోని 40 జీవనదుల ద్వారా మరియు 330 టి.యం.సి కృష్ణా మిగులు జలాల ఉపయోగం ద్వారా మన రాష్ట్రానికి 3076 టి.యం.సి నీరు లభిస్తుంది. ఈ నీరు దాదాపు 120 లక్షల నుండి 200 లక్షల ఎకరాలకు సరిపోతుందని అంచనా వేయబడింది.

'తెలంగాణాలో ప్రవహిస్తున్న రెండు పెద్ద నదుల (గోదావరి,కృష్ణా) ప్రవాహక తీరు ప్రామాణికంగా తీసుకున్నట్లయితే తెలంగాణాకు న్యాయంగా 1700 టి.యం.సి నీరు రావలసి ఉన్నది. తెలంగాణా జనాభా, భౌగోళిక విస్తీర్ణత లేక సాగుబాటు భూమి విస్తీర్ణత ప్రాతిపదికగా తీసుకున్నా తెలంగాణాకు కనీసం 1400 టి.యం.సి నీరు లభించవలసి ఉంది. కాని దీనికి విరుద్ధంగా తెలంగాణాకు కేవలం 1170 టి.యం.సి. నీరుపై హక్కు ఉన్నట్లు గుర్తించబడింది.

ఆంధ్రరాష్ట్రంలో ప్రవహించే 40 జీవ నదులలో 2 మాత్రమే తెలంగాణాకు ఎక్కువ స్థాయిలో ఉపయోగపడతాయి. మిగతా 38 నదుల ద్వారా లభించే 900 టి.యం.సి నీరులో 7 టి.యం.సి మాత్రం తెలంగాణాకు ఉపయోగపడుతుంది. మిగతా 893 టి.యం.సి నీరు ఆంధ్ర ప్రాంతానికి ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రాంతంలో ఈ నీటిలో దాదాపు 95 శాతము ఇది వరకే ఉపయోగానికి తేబడింది. ఈ 38 నదుల నీరుతో పాటు కృష్ణా గోదావరి నదుల ద్వారా బచావత్, తదితర అవార్డుల వలన లభించిన నీరు కూడా ఆంధ్రప్రాంతంలో పూర్తిస్థాయిలో ఉపయోగించటం జరుగుతున్నది.

తెలంగాణా ప్రాంతంలో ఉపయోగానికి నిర్ధారించిన 1170 టి.యం.సి నీరులో 80 శాతం ఇంతవరకు ఉపయోగించబడలేదు. 20 శాతం ఉపయోగానికి తెచ్చిన నీరులో 74 టి.యం.సి నీరు 1956 కంటే ముందు 15 టి.యం.సి నీరు 1956 తరువాత నిర్మాణం పూర్తిచేసిన ప్రాజెక్టుల ద్వారా ఉపయోగానికి వచ్చింది. నిర్మాణంలో ఉన్న మధ్య తరహా మరియు పెద్ద తరహా ప్రాజెక్టుల ద్వారా 153 టి.యం.సిల నీరు ఉపయోగానికి వచ్చింది. ఇంకా మిగతా 928 టి.యం.సి. నీరు వృధాగా పోతున్నది. ఈ నీరు ఆధారంగా రూపొందిన 46 మధ్యతరహా పెద్ద తరహా ప్రాజెక్టులకు 3 దశాబ్దాలుగా గతి మోక్షం లేకుండా ఉన్నది.

నల్గొండ జిల్లాకు చెందవలసిన నాగార్జునసాగర్ నీరు మూడు లక్షల ఎకరాలకు పైగా కుదించబడింది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమకాలువను అంతులేని వివాదంలో ఇరికించడం వలన మూడు లక్షల ఎకరాలు సాగుబాటు అయ్యేనీరుకు అవాంతరం ఏర్పడింది. సింగూర్ ప్రాజెక్టు నీరు జంట నగరాల నీటి అవసరాలకు తరలించడం వలన నిజాంసాగర్ ఆయకట్టు సగానికి పైగా తగ్గడమే కాకుండా మెదక్ జిల్లాలో సాగుబాటు కావలసిన లక్షల ఎకరాలకు గండిపడింది. 10 టి.యం.సి. శ్రీరాంసాగర్ నీరు రామగుండం జాతీయ ధర్మల్ ప్రాజెక్టుకు తరలించడం వలన లోకలైజేషన్ అయ్యి, సాగుబాటులో ఉన్న లక్షా యాభైవేల ఎకరాల భూమి బీడు పడింది. 330 టి.యం.సిలతో తెలంగాణా అయిదు జిల్లాలలో 21 లక్షల ఎకరాలు సాగుబాటు చేయగలిగే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 112 టి.యం.సి లకు కుదించటం వలన తెలంగాణా అయిదు జిల్లాలలో దాదాపు 10 లక్షల ఎకరాల ఆయకట్టు తగ్గింది.

'హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతానికి అంతర్ రాష్ట్ర ఒడంబడికల ద్వారా ఆంధ్రరాష్ట్ర అవతరణ కంటే ముందు సంక్రమించిన నీటివాటాలు తారుమారు చేయబడినవి. ఉదాహరణకు నాగార్జున సాగర్ ఎడమకాలువ ద్వారా తెలంగాణాకు చెందవలసిన నీరు 161 టి.యం.సి నుండి 131కి, 131 టి.యం.సి నుండి 111కు, 111 టి.యం.సి నుండి 97కు చివరకు 87.5 టి.యం.సి కి కుదించబడింది. పోచంపాడు ప్రాజెక్టు నీరు 330 టి.యం.సి నుండి 250కి, 250 టి.యం.సి నుండి 220కు, 200 టి.యం.సి నుండి 171కి, 171 టి.యం.సి నుండి 160కి చివరకు 112 టి.యం.సి కి కుదించబడింది. అదే మాదిరిగా శ్రీశైలం రిజర్వాయర్ నీటిపై తెలంగాణకు ఉన్న యాభైశాతం హక్కును విస్మరించి మొత్తం ప్రాజెక్టులు చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయరు నీరే కాకుండా ఈ మధ్య కొత్తగా తేలిన 330 టి.యం.సి. మిగులు జలాలపై తెలంగాణాకు యాభై శాతం వాటా ఉన్నప్పటికీ తెలంగాణాలో ఈ నీరు ఆధారంగా కొత్త ప్రాజెక్టులు ఒక్కటి గూడా చేపట్టక ఉమ్మడి ప్రాజెక్టు నీరును ఇతర చోట్లకు పగడ్బందీగా తరలిస్తున్నారు.

'రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో 24 లక్షల హెక్టారులు సాగుబాటు చేయగలిగిన నీరులో 4 లక్షల హెక్టార్లకు మాత్రం నీటి వసతి కల్పించబడింది. సాగుబాటుకు ఉపయోగపడే మొత్తం భూమిలో 16.8 శాతం భూమికి మాత్రం ఇంత వరకు నీరు అందించబడింది.

కరువు కాటకాల రాయలసీమ 4 జిల్లాలలో 27.66 లక్షల సాగుబాటు భూమిలో 6.91 లక్షల హెక్టార్లకు నీరు అందితే తెలంగాణా 4 కరువు జిల్లాలో 4 లక్షల హెక్టార్లకు నీరు అందింది. ఈ నాలుగు జిల్లాల్లో 16.8 శాతం భూమికి నీరు అందితే రాయలసీమ 4 జిల్లాల్లో 24.5 శాతం నీరు అందింది. తెలంగాణా 4 జిల్లాల్లో 116 టి.యం.సి. నీరు వాడే ప్రతిపాదనలు 35 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నవి. రాయలసీమ 4 కరువు జిల్లాల్లో 320 టి.యం.సి. నీరువాడే ప్రతిపాదనలను ప్రభుత్వం అంగీకరించి వాటిలో అధికశాతం ప్రాజెక్టులను చేపట్టింది.

రాష్ట్రాల పునర్విభజన కంటే పూర్వం తెలంగాణా ప్రాంతంలో ఒక పెద్దతరహా ప్రాజెక్టు, 16 మధ్య తరహా ప్రాజెక్టులు పూర్తి చేయబడినవి. వీటి ద్వారా 74 టి.యం.సి. నీరు తెలంగాణా భూములకు లభించింది. 35 సంవత్సరాల రాష్ట్ర అవతరణ తరువాత (1991 నాటికి) తెలంగాణలో కేవలం 11 మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తి చేయబడినవి. వీటి ద్వారా కేవలం 15 టి.యం.సి. నీరు వాడకానికి వచ్చింది. తెలంగాణాలో 1956 తరువాత ఒక పెద్ద ప్రాజెక్టు కూడా పూర్తి చేయబడలేదు.

నిర్మాణంలో ఉన్న పెద్ద తరహా ప్రాజెక్టుల ద్వారా 147 టి.యం.సి. నీరు ఇవ్వబడింది. నిర్మాణంలో ఉన్న 13 మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 6 టి.యం.సి. నీరు ఉపయోగానికి వచ్చింది. అనగా దాదాపు మూడున్నర దశాబ్దాల తరువాత సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో ఉపయోగించిన 1170 టి.యం.సి. ల నీరులో కేవలం 168 టి.యం.సి నీరు రైతుకు ఇవ్వబడింది. అనగా సగటున 35 సంవత్సరాలలో సంవత్సరానికి సుమారు నాలుగున్నర టి.యం.సి. చొప్పున ఉపయోగానికి వచ్చింది. తెలంగాణాలో ఒక కోటి ఏభై లక్షల సాగుబాటుకు వీలున్న భూములు ఉండగా ఇప్పటి వరకు కేవలం 15 లక్షల ఎకరాలకు మాత్రం నీరు ఇవ్వబడింది.

దశాబ్దాల తరబడి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వలన తెలంగాణ ప్రజల ఆర్థికస్థోమత దెబ్బతిన్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, జూరాల, సింగూర్, శ్రీశైలం ఎడమ కాలువ నిర్మాణం పూర్తి అయితే తెలంగాణాలో దాదాపు 30 లక్షల ఎకరాల భూమి సాగుబాటుకు వచ్చేది. రెండు దశాబ్దాలుగా వీటిపైన రెండు వందల అరవై ఎనిమిది టి.యం.సి. నీరు వాడుకునే అవకాశం ఉండగా కేవలం 128.25 టి.యం.సి. నీరు (యస్‌యస్‌పి/87.25+యస్‌ఆర్‌యస్‌పి/41 టి.యం.సి) ఉపయోగానికి వచ్చింది. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

కాలుష్య విషవలయంలో రాలుతున్న పసిమొగ్గలు..!

బాలల బంగారు భవితను సుందరంగా నిర్మించడంలో కీలక పాత్ర ప్రకృతిది. దాని పరిరక్షణను ప్రభుత్వాలు విస్మరించడం వల్ల ఆబాలగోపాలం ఇక్కట్లపాలవుతూనే ఉంది. అమూల్యమైన పర్యావరణ రంగంలో అతి ప్రమాదకర మార్పులా.. అంటూ ఐక్యరాజ్య సమితి గతంలోనే ప్రశ్నించింది. అందరికీ జలమే ఆధారం. అది కలుషితమైన కారణంగా మనదేశంలోని ఐదేళ్ళలోపు చిన్నారుల్లో ఏటా దాదాపు 17లక్షల మంది శాశ్వతంగా కన్నుమూస్తున్నారు. అపరిశుభ్ర పరిసరాలు, కలుషిత జలాలనే తాగాక తప్పని పరిస్థితుల్లో వ్యాధుల బారిన పడి ఏటా వేల సంఖ్యలో పిల్లలు విగతజీవులవుతున్నారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చట్టాలు లేకపోలేదు. 1974లో ఒకసారి, అనంతరం మూడేళ్ళకు మరోసారి దేశంలో ఆ చట్టాలు తెచ్చారు. అమలు తీరు సరేసరి. నానారకాల మురికి పదార్థాలూ నీళ్ళలో కలుస్తున్నాయి. ద్రవ, ఘన, వాయు వ్యర్థాలెన్నో నీటిలోకే చేరుతున్నాయి. ఇది పిల్లలపాలిట ప్రాణాంతకమవుతోంది. నానారకాల కాలుష్యాలతో ప్రాణాలు కోల్పోతున్నవారెందరో.. వారిలో 92శాతం పేద లేదా తక్కువస్థాయి ఆదాయాలు గల దేశాలవారున్నారు. ఆ మృతుల్లో అనేకమంది బాలలేనని ఓ అంతర్జాతీయ వైద్య పత్రిక తాజా అధ్యయనం నిర్ధారించింది. వాయుకాలుష్యం వల్ల మనదేశంలో ఉత్తరాది ప్రాంతాల్లో అయిదేళ్ళలోపు పసివాళ్ళు ఏటా 6 లక్షల మంది మృత్యువు పాలవుతున్నారు. వివిధ దేశాల్లో 30కోట్ల బాలబాలికలు విషపూరిత వాయువుల వల్ల పలు రుగ్మతలకు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. ధూళితో నిండిన రోడ్లు, వాటిపై ధూమకాలుష్యం తెచ్చే చేటు అంతా ఇంతా కాదు. పరుగులు తీసే పొగల బండ్లు పిల్లల గుండెల్ని అదరగొడుతున్నాయి.పరిశ్రమల నుండి వెలువడే పొగ వాయువులు, కర్మాగారాలు విడుదల చేసే రసాయన తదితర వ్యర్థ పదార్థాలు లక్షలాది పిల్లల జీవితాలకు తూట్లు పొడుస్తున్నాయి. వారి మెదడు, ఊపిరితిత్తులపై అవి పెనుప్రభావం చూపుతున్నాయి.బాలల వ్యాధినిరోధక వ్యవస్థను అత్యంత దారుణంగా దెబ్బతీస్తున్నాయి. అనేక దేశాల్లో ఏటా 34 లక్షల పసికందులు నెలలు నిండకుండానే పుడుతున్నారంటే, వాయుకాలుష్య తీవ్రతే దీనికి మూలకారణం. కాలుష్య రక్కసికి లెక్కలేనన్ని రూపాలు. అది గాలితో పాటు భూమిని,జలాల్ని విషమయం చేస్తుంటే, పసిప్రాణాలు నిలిచేదెలా?



పర్యావరణ పరిరక్షణను లక్షించి మనదేశంలో చట్టం రూపొంది 33ఏళ్ళు గడిచాయి.


వివిధ పారిశ్రామిక కాలుష్య నియంత్రణ చట్టాలు ఒకటీ రెండూ కాదు,మూడు దశాబ్దాలుగా ఉన్నాయి. వాటి అమలు అప్పటి నుంచీ అంతంతమాత్రమే! అలా అని పర్యావరణాన్ని రక్షించడం ప్రభుత్వశాఖలకో, స్వచ్ఛంద సంస్థలకో పరిమితమా? కానే కాదు. అది సమాజంలో ఉండబడే ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యంగా భావించాలి. కాలుష్యరహిత వాతావరణంలో జీవించడం మానవహక్కుల్లో అంతర్భాగం.. అని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆ తీర్పు బాలల హక్కులకూ వర్తిస్తుంది. వారు కాలుష్యాల బారిన పడకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ పంజాబ్, హర్యానా, రాజస్థాన్ ప్రభుత్వాలని నిలదీసింది. స్వచ్ఛమైన గాలి, నీరు కల్పించకపోవడం అంటే జీవించే హక్కును కాలరాయడమే అవుతుందనీ పేర్కొంది.శబ్దకాలుష్యం కలిగించే అనుభవాలు ఎంత భయానకమో చెప్పనలవి కాదు.వాటి వల్ల బాలబాలికలకు నరకయాతనే! ఒక్క వినికిడి శక్తినే కాదు.. మెదడు, రక్తప్రసరణ, జీర్ణశక్తి, జీవక్రియలన్నింటిపైనా ధ్వని కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇన్ని రకాల కాలుష్యాల కోరల్లో చిక్కిన బాలల్ని కాపాడే చత్రాలు రెండు. స్వచ్ఛత కోసం పరితపించే ప్రభుత్వాల నిబద్ధత ఒకటి. దానికి కుడిఎడమల దన్నుగా నిలిచే పౌరసమాజ బాధ్యతాయుత వైఖరి మరొకటి. ఈ రెండింటి కలయికతోనే కాలుష్యాన్ని నియంత్రించడం సాధ్యపడుతుంది.

–శ్రీనివాస్ చిరిపోతుల,96034 71199

పలుచబారుతున్న నల్లమల అడవులు..

పర్యావరణం కలుషితమైపోతున్న ఈ రోజుల్లో అడవుల పరిరక్షణ ఎంతో అవసరం. అరుదైన వన్య ప్రాణులు, వృక్ష జాతులకు ఆలవాలమైన నల్లమల స్మగ్లర్ల ధాటికి గురవుతున్నది. వన్య ప్రాణులు వేటగాళ్ల ఉచ్చులకు బలైపోయి, అటవీ ప్రాంతం క్రమక్రమంగా పలుచబారుతుంది. నల్లమలలో వెదురుబొంగు సేకరణ పూర్తిగా నిలిపివేసినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా స్మగ్లర్ల ఇష్టారాజ్యంగా మారింది. చెట్లను నరికి కలపను దోచుకుంటున్నారు. నరికి వేతకు గురైన వృక్షాలు, చెదలు, రోగాలతో చనిపోయిన చెట్ల స్థానంలో మొక్కలు పెంచడం కోసం రూ.లక్షల్లో నిధులను ఖర్చు చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. కొల్లాపూర్ ప్రాంతాల్లో చెక్ పోస్టులున్నా అక్రమంగా తరలిస్తున్న కలప, బొంగు రవాణాను నిలువరించలేకపోతున్నారు. నదిలో బోట్ల ద్వారా సమీప గ్రామాలకు కలపను తరలించడం, అక్కడి నుంచి వాహనాలపై ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. కొల్లాపూర్ పట్టణానికి ఆనుకొని ఉన్న అడవి నేడు పంట పొలంగా మారిపోయింది. అటవీ శాఖా అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే విపరీతమైన ప్రతికూల పరిస్థితులు ఏర్పడిపోతాయి. కేంద్ర ప్రభుత్వం అడవుల పరిరక్షణకోసం కృషి చేసిన జమునతుడు అనే ఆదివాసీకి చెందిన యువతికి ఇటీవల పద్మశ్రీ అవార్డును ఇచ్చింది. అవార్డులతో పాటు, అటవీ శాఖా అధికారులపై కూడా కఠినమైన నిర్ణయాలు తీసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే అడవులు అంతరించిపోకుండా ఉంటాయి.

– సురేష్, జోగులాంబ గద్వాల్





ఎన్నికల సమర శంఖం పూరించిన
వైఎస్ జగన్

విజయక్రాంతి, తిరుపతి : ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల సమర శంఖాన్ని పూరించారు. రేణిగుంట సమీపంలో బుధవారం యోగానంద ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 'సమర శంఖారావం' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే మీరందరూ సవ్యసాచులై పని చేయాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. '9 ఏళ్లుగా నా కోసం చాలా కష్టపడ్డారు. మీకు తగిలిన ప్రతి గాయం నా గుండెకు తగిలినట్లే. మీ అందరి బాగోగులు అన్ని రకాలుగా మిమ్మల్ని ఆదుకుంటా. రాజకీయంగా, సామజికంగా ఆదుకుంటా. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. ఆ పథకాలు అందించ డంలో మీ పాత్ర కీలకం. న్యాయానికి, అన్యాయానికి ఎన్నికలు జరగబోతున్నాయి. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలంటే మీరంతా కీలక బాధ్యత తీసుకోవాలి. చాలాచోట్ల వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నారు. 59 లక్షల దొంగ ఓట్లు నమోదు చేయించారు. ఎల్లో మీడియా సాయంతో దొంగ సర్వేలు చేయిస్తున్నారు. చంద్రబాబు పాలనలో పడరాని పాట్లు పడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చాలా గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ఎన్నికలు వస్తున్నాయంటే పోలీసులతో గూండాగిరి చేయిస్తుంటారు. వచ్చే ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే ఎన్నికలు. విశ్వసనీయత, మోసానికి మధ్య జరిగే ఎన్నికలు.. రానున్న ఎన్నికలు ఆప్యాయతకు, డబ్బుకు మధ్య జరిగే ఎన్నికలు. 2014లో చంద్రబాబు మొదటి సినిమా చూపించారు. ఆ ఎన్నికల్లో చంద్రబాబు ప్రచారాన్ని గుర్తు చేసుకోండి. నరేంద్ర మోదీతో కలిసి చంద్రబాబు ప్రచారం చేశారు. ఆయనొస్తున్నాడు.. రెండు నెలల్లో అన్నీ అయిపో తాయని చెప్పారు. జాబు రావాలంటే బాబు రావాలని ప్రచారం చేశారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అని చెప్పారు. డ్వాక్రా రుణాలు మాఫీ అన్నారు. బెల్టు షాపులు రద్దు చేస్తామన్నారు.

అక్కాచెల్లెమ్మలు తాకట్టు పెట్టిన బంగారం నెల రోజుల్లోనే ఇంటికొస్తుందని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యుత్ అన్నారు. పేదవారికి ఇల్లు కట్టిస్తామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్నారు. ప్రత్యేక హోదాను ఐదు కాదు.. పదికాదు... 15 ఏళ్లు తెప్పిస్తామన్నారు. చివరకు ఎన్నికలకు ఆరు నెలల ముందు చంద్రబాబు నల్లచొక్కా వేసుకున్నారు. ఇక మేనిఫెస్టోలో ప్రతి కులానికి ఒక పేజీ కేటాయించి మోసం చేశారు. చంద్రబాబు పాలనలో పడరాని పాట్లు పడ్డారు. ఇక ఎల్లో మీడియా గురించి చెప్పాల్సిన పని లేదు' అని జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

విభజనతో రాష్ట్రంలో
పలు సమస్యలు

• ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



విజయక్రాంతి, అమరావతి: రాష్ట్ర విభజనతో చాలా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామన్నారు. ఏపీ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. "పొలం పిలుస్తోంది, బడికి పోదాం వంటి కార్యక్రమాలు చేపట్టాం. ఇది పేదల ప్రభుత్వం.. పేద వారి జీవన ప్రమాణాలు పెంపొందించడాకి కృషి చేస్తాం. ప్రజా భాగస్వామ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. నీరుమీరు, వనంమనం, ఆనంద ఆదివారం, సంక్రాంతి కానుకలు ఇచ్చాం. ఈ ఐదు సంవత్సరాలు మనం చేసిన పనుల వల్ల ప్రజలు సంతృప్తి చెందారు.

ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం రెండంకెల అభివృద్ధిని సాధిస్తోందని వెల్లడించారు. కరువులు ఇబ్బందులు ఉన్నా 11 శాతం అభివృద్ధి సాధించడం అంటే గొప్ప. ఏపీలో 300 శాతం ఎఫ్‌డీఐలు పెరిగాయి. దేశంలో అత్యధిక స్థాయిలో ఎఫ్‌డీఐలు సాధించింది మనమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రెండు సంవత్సరాలు తొలిస్థానంలో నిలిచాము. నేను కష్టపడినా.. మంత్రులు కష్టపడినా.. అధికారులు కష్టపడినా పేదల ముఖంలో ఆనందం చూడాలనే లక్ష్యంగా పెట్టుకొన్నాం. రూపాయికే కేజీ బియ్యం, చక్కెరను ఇచ్చాం. దేశంలో ఎవరికీ రానన్ని అవార్డులు ఏపీకి వచ్చాయి." అని తెలిపారు.

అసెంబ్లీలో ఆరుబిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

శాసనసభలో 6 బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రైవేటు వర్సిటీల స్థాపన.. క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ప్రపంచ స్థాయి డిజిటల్ విద్యాబోధనకు సంబంధించిన బిల్లులను మంత్రి గంటా శ్రీనివాసరావు, బీసీ ఉపప్రణాళిక బిల్లుతోపాటు మరో మూడు బిల్లులను మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెట్టారు. ఈబీసీలో కాపులకు చదువు, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్‌కు ఉద్దేశించిన బిల్లుతోపాటు ఇతర అగ్రవర్ణాల పేదలకు సంబంధించి మరో బిల్లు, వ్యాట్ సవరణ బిల్లులను మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. మొత్తంపై నాలుగు బిల్లులను మంత్రి అచ్చెన్నాయుడు.. రెండింటిని మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రవేశపెట్టారు. అనంతరం పబ్లిక్ అకౌంట్స్ కమిటీ నివేదికను భాజపా సభ్యుడు విష్ణుకుమార్ రాజు సభలో ప్రవేశపెట్టారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీనే

బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది టీడీపేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు న్యాయం చేసిన రాష్ట్రం మనదేనన్నారు. విదేశీ విద్య కోసం రూ. 15 లక్షలు ఇస్తున్నామని, పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్లు ఇచ్చామని సీఎం చెప్పారు.

వీఆర్వో, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు జీతాలు పెంచామని తెలిపారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు మూడు రెట్లు జీతాలు పెంచామని, సమాజంలో అందరికీ న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

సీపీఎస్ విధానం తొలగింపు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రూ. 80 వేల కోట్లతో 30 లక్షల ఇళ్లు కడుతున్నామని తెలిపారు. ఏప్రిల్ నుంచి 5 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తామని, అమెరికాలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఆ ఇద్దరూ మోడీ కనుసన్నల్లోనే..

అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర బడ్జెట్ పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని చెప్పారు. టీడీపీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్ని ఆర్థిక కష్టాలున్నా.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామంటే మన సమర్థతే కారణమన్నారు. సమాజంలో ఎవరినీ నిరాదరణకు గురికానివ్వమని చెప్పారు. తెరాస అధినేత కేసీఆర్, వైఎస్‌ఆర్‌సీ అధ్యక్షుడు జగన్ తప్ప బెంగాల్ చర్యను అంతా ఖండించారని.. దీంతో ఆ ఇద్దరూ ప్రధాని మోదీ కనుసన్నల్లో ఉన్నారన్నది సుస్పష్టమైందన్నారు.

కుల, మత విద్వేషాలతో అమాయకులకు వల పన్నుతు న్నారని చంద్రబాబు ఆరోపించారు. పేదరిక నిర్మూలనే తమ కులమని.. పేదరికంలో ఉన్నవారిని గుర్తించి తోడ్పాటు అందించే ఏకైక పార్టీ తెదేపా అని సీఎం అన్నారు. రాజకీ యంగా, ఆర్థికంగా, సామాజికంగా అందర్నీ పైకి తీసుకొ స్తామని చెప్పారు. వ్యవసాయం పండగ పేరిట రైతులకు చెక్కులిచ్చే కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని చంద్రబాబు వివరించారు.



జనసేన సెంట్రల్ కమిటీ ఫర్ అఫైర్స్ చైర్మన్‌గా
పులి శేఖర్

- నియమించిన పవన్ కల్యాణ్
- యూఎస్‌లో తన వ్యాపారాన్ని శేఖర్ వదులుకున్నారు
- పార్టీ కోసం పని చేసేందుకు నిబద్ధతతో వచ్చారు
- స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం ఆయనది

విజయక్రాంతి, హైదరాబాద్ : జనసేన పార్టీలోని కమిటీల నియామకంలో భాగంగా సెంట్రల్ కమిటీ ఫర్ అఫైర్స్ (సీసీపీఏ) చైర్మన్‌గా పులి శేఖర్‌ని నియమించారు. ఈరోజు ఉదయం హైదరాబాద్ లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లా డుతూ, ప్రవాసాంధ్రుడైన పులి శేఖర్, అమెరికాలోని తన వందల కోట్ల విలువైన వ్యాపారాన్ని వదులుకొని పార్టీ కోసం పని చేసేందుకు నిబద్ధతతో వచ్చారని ప్రశంసించారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుం బం నుంచి వచ్చిన పులి శేఖర్‌లో సామాజిక స్పృహ, పాలనలో పారదర్శకత ఉండాలన్న తపన ఆయనలో మెండుగా ఉన్నాయని కొనియాడారు.

అనంతరం, పులి శేఖర్ మాట్లాడుతూ, సిద్ధాంత బలంతో నిర్మితమైన పార్టీ 'జనసేన' అని, పవన్ కల్యాణ్ ఆలోచన విధానం, ఆయన భావజాలం తననెంతో ఆకర్షించాయని, ఈ రాష్ట్రం వారి నాయకత్వం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తోందని, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు.

విజయకీలాద్రిపై శ్రీవారి
బ్రహ్మోత్సవాలు

• 10 నుంచి ప్రారంభం

విజయక్రాంతి, విజయవాడ: కృష్ణాతీరంలోని సీతానగరాన విజయకీలాద్రి పర్వతంపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఆమేరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శ్రీత్రిదండి చిన్న జీయ ర్స్వామి దివ్యమం గళా శాసనా లతో ఆల యంలో బ్రహ్మోత్స వాలను శ్రీమదు భయ వేదాన్తా



చార్య పీఠం నిర్వహించనుంది. అందుకు పర్వతంపై ఉన్న పది ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దుతు న్నారు. పవిత్ర కృష్ణానది చెంతనే ఉన్న విజయకీలాద్రి పర్వతాన్ని తాకుతూ మూడువైపులా కృష్ణమ్మ నదీ జలాలు ప్రవహిస్తుంటాయి. శ్రీరంగంలాంటి దివ్యక్షే త్రంలో కావేరీ నది ఏవిధంగా మూడువైపులా ప్రవహిస్తుందో అదే తరహాలో విజయకీలాద్రికి మూడువైపులా కృష్ణానది ప్రవహిస్తుంది. 1965లో శ్రీపెద్ద జీయర్‌స్వామి ఇక్కడకు వచ్చిన సమయంలో విజయకీలాద్రి పర్వతం విశిష్టమైన పర్వతంగా రూపొం దింది. కొండపై ఆలయాలను నిర్మించి 350 మెట్లు కలిగిన మార్గాన్ని ఏర్పరిచారు. నేడు దివ్యక్షేత్రంగా విజ యకీలాద్రి విలసిల్లడానికి పెద్ద జీయర్‌స్వామి 56 ఏళ్ల క్రితం చేసిన మహా సంకల్పానికి సహకారమైంది. త్వరలో పర్వతంపై శ్రీభగవత్ రామానుజుల సహ స్రాబ్ది పురస్కరించుకుని 135 అడుగుల సమతామూర్తి విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులు సంకల్పించారు.

ప్రత్యేక తలు

10వ తేదీ భక్తు లతో గిరి ప్రదక్షణ, ధ్వజారో హణం ఉంటుంది. సాయంత్రం బేరీపూజ, శేషణవాహసేవ నిర్వహిస్తారు. 11న హంసవాహనసేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహి స్తారు. 12న సూర్యప్రభ వాహనసేవ, ఆదిత్య హృదయ పారాయణం, రథసప్తమిసందర్భంగా కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. 13న చంద్రప్రభ వాహనంపై స్వామివారి దర్శనం, 14న పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాసన, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం నిర్వహిస్తారు. 15న ఏకాంతసేవ, 16న భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీవిష్ణుసహస్రనామ జయంతి ఉంటుంది. శ్రీచిన్నజీయర్ స్వామి ప్రత్య క్షంగా సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణంలో పాల్గొంటారు.

అవార్డులతో ప్రభుత్వ
ప్రతిష్ఠ పెరిగింది

• చంద్రబాబు

విజయక్రాంతి, అమరావతి: అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమష్టిగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలతో రాష్ట్రానికి 670 అవార్డులు వచ్చాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు కేంద్రం ఇచ్చిన అవార్డులతో శాసన సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఏపీకి ఇన్ని అవార్డులు రావటం సంతోషంగా ఉందన్నారు. మనం చేసిన పనికి ఈ అవార్డులు గుర్తింపు అని ఆయన వ్యాఖ్యానించారు.

కొత్త రాష్ట్రంలో ఇబ్బందుల నడుమ పనులు ప్రారంభించామని.. చిత్తశుద్ధితో పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రావడంతో ప్రభుత్వ ప్రతిష్ఠ మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. బాగా పని చేసేందుకు ఈ అవార్డులు స్ఫూర్తినిస్తాయని సీఎం అన్నారు. ఐదేళ్లలో ఏం సాధించామో ప్రజలకు చెప్పేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ కోడెల, మండలి ఇన్‌చార్జ్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశంలో
అశాంతి నెలకొంది



- ఏపీకి ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలి
- కొన్ని రాష్ట్రాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు
- పార్లమెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీలు

ఢిల్లీ : ప్రధాని మోడీ పాలనలో దేశంలో అశాంతి నెలకొందని ఏపీ టీడీపీ ఎంపీలు విమర్శించారు. ఏపీకి ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలంటూ పార్ల మెంట్ ఆవరణలో టీడీపీ ఎంపీలు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది.

'మోడీ హఠావో దేశ్ బచావో' అంటూ ఎంపీలే నిన దించారు. ఈ సందర్భంగా ఎంపీ మురళీమోహన్ మాట్లాడుతూ, గుజరాత్‌తో పాటు తన అనుకూల రాష్ట్రాలకే మోడీ నిధులు కేటాయిస్తున్నారని, కొన్ని రాష్ట్రాలపై కక్షపూరితంగా వ్యవహరి స్తున్నారని ఆరోపిం చారు. టీడీపీకి చెందిన మరో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వాలే కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన పరిస్థితిని మోడీ తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు.



జయరాం హత్యకేసు
తెలంగాణకు బదిలీ

విజయక్రాంతి, నందిగామ: ప్రవాసాంధ్రుడు, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, చిగురుపాటి జయరాం హత్య కేసు తెలంగాణకు బదిలీ అయింది. ఘటన జరిగింది తెలంగాణ పరిధి కావడంతో ఏపీ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ సిటీ పోలీసు లకు ఈ కేసును బదిలీ చేస్తున్నట్లు ఏపీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ ప్రకటించారు. ఈ అంశంపై ఏపీ పోలీసులు న్యాయనిపుణుల సలహా తీసుకుని నిర్ణయాన్ని వెల్లడిం చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జయరాం భార్య పద్మశ్రీ నిన్న రాత్రి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఏపీ పోలీసులు కేసు బదిలీ ఆలోచన చేశారు. తెలంగాణ పోలీసులు ఈ కేసును విచారించా లంటూ పద్మశ్రీ నిన్న మీడియాతో పేర్కొన్న విషయం తెలిసిందే.

జయరాం హత్యకేసు నిందితులను పోలీసులు నందిగామ కోర్టులో హాజరుపరిచారు. నిందితులు రాకేష్‌రెడ్డి, శ్రీనివాసులను రిమాండ్‌కు పంపుతూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిందితు లను నందిగామ సబ్‌జైలుకు తరలించారు.

పేదలకు అద్దె కొంప చంద్రబాబు విజన్

• బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఎద్దేవా



విజయక్రాంతి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం తొమ్మిది లక్షలకు పైగా ఇళ్లను కేటా యిస్తే.. టెక్నాలజీ పేరుతో చంద్రబాబు నాయుడు వాటిలో కూడా అవినీతికి పాల్పడుతున్నారని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఆరోపించారు. పేదలకు ఉచిత ఇల్లే నా కల అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్తుంటే.. పేదలకు అద్దె ఇల్లే నా కల అని చంద్రబాబు చెబుతు న్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కట్టే ఇళ్లల్లో గాలి, వెలుతురు సరిగా రావడం లేదన్నారు. బుధవారం గవ ర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో మాధవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ చేత కూడా అబద్ధాలు చెప్పించిందని ఆరోపించారు. గత ఎన్ని కల్లో బీసీలకు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. . డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఆ విషయం గురించే మరిచిపోయారని విమర్శించారు. రుణమాఫీ చేయకుండా ఎన్నికల వేళ డ్వాక్రా మహిళ లకు రూ. 10వేలు ఇస్తూ మరోసారి మోసం చేయడానికి చంద్రబాబు యత్నిస్తున్నారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వృద్ధుల పెన్షన్లు రూ.1000 నుంచి రూ.2000 పెంచాలని ఎన్నికల రోజుల్లో గుర్తొంచిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి సింహభాగం నిధులు కేంద్రం కేటాయించిదని చెప్పారు. ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేయని చంద్రబాబుకు గట్టి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

'డ్వాక్రా మహిళలతోనే
కేసులు పెట్టిస్తాం'

విజయక్రాంతి, కడప: ఎన్నికల వేళ ప్రజలు మభ్యపెట్టే విధంగా ఏపీ బడ్జెట్‌ను రూపొందించారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సీ రామచంద్రయ్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాశాయని మండిపడ్డారు. ప్రజలు తరతరాలు అప్పులు కట్టుకునే విధంగా చంద్రబాబు నాయుడు అప్పులు చేస్తున్నాడని, ప్రతిఏడాది అప్పులు తీవ్రంగా పెరిగిపోతున్నాయని విమర్శించారు.

జరిగిన అభివృద్ధి మాత్రం శూన్యమనీ, రాబోయే ఎన్నికల్లో గెలిచే సీన్ చంద్రబాబుకు లేదని ఆయన జోస్యం చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి నిధులు ఎలా వస్తాయో స్పష్టత లేదని అభిప్రాయ పడ్డారు.




ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఓడిస్తారని చంద్రబాబు కు ముందే తెలుసని అందుకు కొత్త నాటకాలు ఆడుతున్నారని రామచంద్రయ్య పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పసుపు కుంకుమ పథకానికి మళ్లించారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో ప్రశ్నించిన వారిని స్పీకర్ సాక్షిగా చంద్రబాబు బెదిరిస్తున్నారని అన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయితే వారిచేతని కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ 150 సీట్లు సాధిస్తుంది..

గత ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను మరిచి చంద్రబాబు నాయుడు కొత్త నాటకాలకు తెర తీశారని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విమర్శించారు.

కడప ఉక్కు పరిశ్ర మను ఆర్భాటంగా శంకుస్థాపన చేసి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదని అన్నారు. చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనించాలని, సర్వేల ప్రకారం ఆయనకు ఓటమి తప్పదని చెప్పారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 150 సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో టీటీడీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ తనను ఓడించాలని శతవిధాల ప్రయత్న చేశారని, కానీ ప్రజలు వారి ఎత్తుగడలను తిప్పికొట్టారని గుర్తు చేశారు.

శాసనమండలి చైర్మన్ పదవికి
నోటిఫికేషన్ జారీ



విజయక్రాంతి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ పదవికి నోటిఫికేషన్ జారీ అయింది. శాసన మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఈ మేరకు సభలో ప్రకటన జారీ చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటలలోపు మండలి కార్యదర్శికి నామినేషన్లు అందజే యాలని ఆయన సూచించారు. నేటి ఉదయం శాసనమండలి చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు సుబ్రహ్మణ్యం ప్రకటించారు.

శాసనమండలి చైర్మన్ అభ్యర్థిగా షరీఫ్ పేరును అధికార టీడీపీ ఇప్పటికే ఖరారు చేసింది. ఆయన బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీకి సభలో పూర్తి మెజార్టీ ఉన్న నేపథ్యంలో షరీఫ్ ఎన్నిక లాంఛనం కానుంది.

కాలిబూడిదైన కోట్ల రూపాయల కరెన్సీ

మంగళూరు: ఉడిపి జిల్లాలోని ములూర్ కార్పోరేషన్ బ్యాంకు శాఖలో అగ్నిప్రమాదం సంభవించింది. ములూర్ బస్టాండ్‌కు సమీపంలో బ్యాంకులో నిన్న రాత్రి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. లక్షల రూపాయలు మంటల్లో బూడిదయ్యాయి. అర్థరాత్రి బ్యాంకులో నుంచి మంటలు వస్తున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

లోక్‌పాల్‌పై ముందడుగు

నెలాఖరులోగా సభ్యుల నియామకం

- సుప్రీంకోర్టు అసంతృప్తి
- అన్నా దీక్ష నేపథ్యంలో కదలిక



ఢిల్లీ: లోక్‌పాల్ నియామకంపై ముందడుగు పడింది. ఈ నెలాఖరులోగా లోక్‌పాల్ సభ్యులను నియమించాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగానే లోక్‌పాల్ ఛైర్మన్, సభ్యుల నియామకానికి గానూ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఛైర్మన్, సభ్యుల నియామకం కోసం రేపటి నుంచి 22 వరకు ఈ కమిటీ దరఖాస్తులు స్వీకరించ నుంది. అనంతరం ఈ వీటిని పరిశీలించి ఉన్నతస్థాయి కమిటీకి నివేదించనుంది.

లోక్‌పాల్ నియామకంపై ఎంపిక కమిటీ అనుసరిస్తున్న ధోరణిపై ఇటీవల సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. లోక్‌పాల్‌పై అన్నా హజారే దీక్ష నేపథ్యంలో కూడా ప్రభుత్వంలో కదలిక వచ్చినట్లయింది. ఫిబ్రవరి నెలాఖరులోగా లోక్‌పాల్ ప్యానెల్ కమిటీ సభ్యుల పేర్లను సిఫార్సు చేయాల్సిందిగా న్యాయస్థానం ఎంపిక కమిటీకి గడువు విధించింది. సభ్యులను ఎంపిక చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గోగొయ్‌తో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించిన తదుపరి విచారణను మార్చి 7కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సమావేశమైన ఎంపిక కమిటీ దరఖాస్తులను ఆహ్వానించేందుకు నిర్ణయం తీసుకుంది.

లోకసభ పోటీలో హార్దిక్ పటేల్



లక్నో: పటేదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయనున్నారు. లక్నోలో జరిగిన ర్యాలీలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 2014లో జరిగిన ఎన్నికల సమయంలో చిన్న వయసు కారణంగా ఆ ఎన్నికలకు దూరంగా నిలిచాడు. అయితే ఏ స్థానం నుంచి అతను పోటీ చేస్తాడన్న విషయాన్ని ఇంకా వెల్లడించలేదు. గుజరాత్లోని అమ్రేలీ లేదా మెహసానా స్థానం నుంచి పోటీ చేస్తాడన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మెహసానాలో ప్రవేశించరాదు అన్న నిషేధం ఉంది కాబట్టి, అతను అమ్రేలీ నుంచి పోటీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అమ్రేలీ లోక్‌సభభ నియోజకవర్గ పరిధిలో ఉన్న అయిదు స్థానాల్లో పటేదార్లు గెలిచారు. దీంతో హార్థిక్ ఆ స్థానం నుంచే పోటీపడే అవకాశాలు ఉన్నాయి. హార్థిక్ పటేల్ పలు ఉద్యమాలు, ఆందోళనల్లో పాల్గొని పటేదార్లే కాకుండా మిగతా సామాజిక వర్గాల్లో కూడా సమస్యలపై గళమెత్తారు. ఈ నేపథ్యంలో ఆయన విజయం కూడా తథ్యమనే భావనలో పలువురు ఉన్నారు.

నక్సలైట్‌కు జవాన్ రక్తదానం

ఝార్ఖండ్: ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ఓ నక్సలైట్‌కు రక్తదానం చేసి నిండు మనసు చాటుకున్నాడు ఓ జవాన్. ఝార్ఖండ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన జవాన్‌ను ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు పలువురు. ఝార్ఖండ్‌లోని సింగ్భమ్ జిల్లాలోని ఖుంతి సరిహద్దు వద్ద జనవరి 29న జవాన్లకు, నక్సలైట్లకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి.

ఇరుపక్షాల మధ్య హోరాహోరీగా సాగిన ఈ ఎదురు కాల్పుల్లో ఐదుగురు నక్సలైట్లు మరణించారు. ఓ నక్సలైట్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడి గురించి తెలియక స్థానికులు దగ్గరలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత అతడు నక్సలైట్ అని తెలిసి డాక్టర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తీవ్ర రక్తస్రావమై ఆస్పత్రిలో నక్సలైట్ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న విషయం రాజ్‌కమల్ అనే జవాన్ చెవిన పడింది. దీంతో ఆయన నేరుగా అక్కడికి వెళ్లి రక్తదానం చేశారు. దాంతో నక్సలైట్‌కు ప్రాణాపాయం తప్పింది. ఈ విషయాన్ని నక్సలైట్‌కు చికిత్సనందించిన ఓ వైద్యుడు మీడియాకు వెల్లడించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గజముతస్సీ మరణం



తిరువనంతపురం: ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరొందిన 'దాక్షాయని' ఇక లేదు. 88 ఏళ్ల వయస్సుతో గిన్నీస్ రికార్డులో చోటు సంపాదించిన దాక్షాయని పప్పనామ్కోడ్‌లోని ట్రామా కేర్ సెంటర్‌లో కన్నుమూసింది. వయస్సు పైబడటంతో అస్వస్థతకులోనైన ఏనుగు ప్రాణాలు విడిచిందని ఏనుగును సంరక్షిస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్వామ్ బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది.

2016లో దాక్షాయనిని 'గజముతస్సీ' బిరుదుతో సత్కరించారు. గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి కూడా ఎక్కింది. మూడేళ్ల క్రితం వరకు పద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించే 'అరట్టు' ఊరేగింపులో దాక్షాయని పాల్గొన్నది. పోస్టల్ శాఖ దాక్షాయని ఏనుగు బొమ్మతో పోస్టర్ స్టాంప్‌ను కూడా తీసుకొచ్చింది. దాక్షాయని అంత్యక్రియలు ఇవాళ సాయంత్రం నిర్వహించనున్నారు.

మేఘాలయలో బీజేపీకి గడ్డుకాలం



షిల్లాంగ్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈశాన్య భారతంలో ఎన్డీయే కూటమికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద పౌరసత్వ బిల్లు2016ను ఈశాన్య ప్రాంతంలోని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కొనసాగుతున్న పార్టీలు బిల్లుకు నిరసనగా బయటకు రావాలని యోచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేఘాలయ ముఖ్యమంత్రి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) అధినేత కాన్రాడ్ సంగ్మా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఎన్డీయేతో సంబంధాలు తెంచుకునేందుకు తగిన సమయంకోసం ఎదురుచుస్తున్నామని సంగ్మా అన్నారు. పౌరసత్వ బిల్లుకు రాజ్యసభలో తమ పార్టీ సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేస్తారని ఆయన స్పష్టంచేశారు. మేఘాలయ అసెంబ్లీలో ఇద్దరు శాసన సభ్యులున్న బీజేపీ, ఇతర పార్టీల మద్దతుతో గత ఏడాది సంగ్మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మేఘాలయతో పాటు మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఎన్పీపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాలే నడుస్తున్నాయి. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లో బీజేపీకి సంగ్మా మద్దతు ప్రకటించడంతో అక్కడ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఎన్డీయే కూటమి నుంచి ఎన్పీపీ బయటకు వచ్చినట్లయితే ఆ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు పడిపోయే అవకాశం ఉంది.

మేఘాలయలో కాంగ్రెస్ 21 సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా.. రెండే సీట్లు గెలిచిన బీజేపీ ఇతరుల మద్దతు కూడగట్టి ఎన్పీపీ అధికారంలోకి వచ్చేలా చక్రం తిప్పింది. బీజేపీ నుంచి విడిపోతే మేఘలయ తమకు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉందని సంగ్మా ఇదివరకు ప్రకటించారు. మరికొన్ని పార్టీలు కూడా బీజేపీని వీడేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈశాన్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారనున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం లోక్సభలో ఆమోదం పొందిన బిల్లును త్వరలోనే రాజ్యసభ ప్రవేశపెట్టనున్నారు.

బీజేడీ ఎంపీ మృతి.. లోక్‌సభ వాయిదా



ఢిల్లీ: బిజు జనతా దళ్ ఎంపీ లడు కిశోర్ స్త్వన్ మృతితో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. బుధవారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహజన్.. కిశోర్ మరణం గురించి సభ్యులకు తెలిపారు. అనంతరం సభ్యులు ఆయన మృతికి సంతాపంగా మౌనం పాటించారు. ఆ తర్వాత సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

బీజేడీ సీనియర్ నేత అయిన కిశోర్(71) గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. భువనేశ్వర్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ తరపున కిశోర్ అస్కా నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. కిశోర్ మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు.

అవినీతి పునాదులపై కాంగ్రెస్ పార్టీ: బీజేపీ



న్యూఢిల్లీ: అవినీతి పునాదులపై కాంగ్రెస్ పార్టీ నిలబడిందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకగాంధీ రాజకీయ ఆరంగేట్రం చేసిన నేపథ్యంలో ఆమె భర్త రాబర్ట్ వాద్రా లక్ష్యంగా బీజేపీ తన దాడితీరులో జోరు పెంచింది. గతంలో వెలుగుచూసిన అవినీతి ఆరోపణలపై ఈడీ విచారణకు హాజరయ్యేందుకు ఆయన సిద్ధమవుతున్న నేపథ్యంలో బీజేపీ తన విమర్శల దాడిని పెంచింది. పెట్రోల్, డిఫెన్స్ ఒప్పందాల ద్వారా రాబార్ట్ వాద్రా భారీ ఎత్తున ముడుపులు అందుకున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ముడుపుల ద్వారా అందుకున్న డబ్బుతో లండన్‌లో వాద్రా ఎనిమిది ఆస్తులు కొన్నారని పేర్కొన్నారు.

ఈ కేసులో ముద్దాయిగా ఈడీ ముందు రాబర్ట్ వాద్రా హాజరవుతున్నారని చెప్పారు. వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని వాద్రా దోచుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని లూటీ చేసిందని, లక్ష రూపాయలు కూడా లేని వాద్రా దేశవిదేశాల్లో ప్లాట్లు ఎలా కొన్నారని, రోడ్పతి నుంచి కరోడ్‌పతి వరకు వాద్రా ఎలా ఎదిగారో చెప్పాలని డిమాండ్ చేశారు. సగటు వ్యక్తి సంపాదించేందుకు ఆపసోపాలు పడుతుంటే అత్యంత తక్కువ సమయంలో సంపన్నుడుగా వాద్రా ఎలా మారడన్నారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతిమయమైన ఆస్తులేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఫ్యామిలీ అంతా బెయిల్ ఫ్యామిలీగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రియాంక గాంధీ ఫ్యామిలీ బిజినెస్‌లో చేరడం పెద్ద విషయం కాదంటూ ఆమె రాజకీయాల్లో చేరడాన్ని ప్రస్తావించారు.

పీఎం జేఏవై కింద గుండె సంబంధిత

వ్యాధులకే ఎక్కువ క్లెయిమ్‌లు



న్యూఢిల్లీ: 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీ ఎంజేఏవై) కింద కేన్సర్, కీళ్లు, గుండె సంబంధ వ్యాధులకే ఎక్కువ క్లెయిమ్‌లు అందినట్లు జాతీయ ఆరోగ్య సంస్థ(ఎన్‌హెచ్ఏ) తెలిపింది. గుండె వ్యాధుల ప్యాకేజీలో ఉన్న యాంజియో ప్లాస్టీ, స్టెంట్ల అమరిక వంటి ఖరీదైన వైద్య సౌకర్యాన్ని అత్యధికులు వినియోగించుకున్నారని వివరించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంతో ఇప్పటి వరకు 10.8 లక్షల మంది లబ్ధి పొందారని పేర్కొంది. ఈ పథకం కింద గుర్తించిన 14,756 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.1,041 కోట్ల విలువైన 8 లక్షల క్లెయిమ్‌లు అందగా రూ.808 కోట్ల విలువైన ఆరు లక్షల క్లెయిమ్‌లకు ఆమోదం తెలిపినట్లు ఎన్‌హెచ్ఏ వివరించింది. లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలు, దగ్గరలోని ఆస్పత్రుల వివరాలు, సహాయం పొందే విధానం వంటి వివరాలతో రూపొందించిన యాప్‌ను ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మంగళవారం ప్రారంభించారు. ఇప్పటికే ఈ యాప్‌ను 10,460 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎన్‌హెచ్ఏ తెలిపింది.

మురికివాడల సందర్శనలో

ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకా గాంధీ నియమింపబడ్డ తర్వాత తొలిసారిగా ఆమె ప్రజల్లో కనిపించారు. న్యూఢిల్లీలోని ఔరంగజేబు రోడ్డులో ఉన్న మురికివాడలలో ప్రియాంకాగాంధీ పర్యటించారు. ప్రజలతో మమేకమయ్యారు. అయితే తొలిసారిగా మురికివాడల్లో పర్యటించి తాను ఎప్పటికీ సాధారణ మనిషి వైపే అన్న సంకేతాలను పంపకనే పంపారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక అసలు విషయానికొస్తే... ప్రియాంకా గాంధీ తన సోదరుడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసేందుకు తన నివాసం నుంచి బయలు దేరింది. రాహుల్ నివాసం ఔరంగజేబు రోడ్డు క్లస్టర్ తర్వాత ఉంది. అయితే ఆ రోడ్డులో వెళుతుండగా చాలా మురికివాడలు కపిపించడంతో ఆమె వాహనం దిగి అక్కడి ప్రజలను కలుసుకుని వారితో కాసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆమె ఆశిష్ అనే దివ్యాంగుడైన బాలుడితో కరచాలనం చేసి మాట్లాడారు. తన ఆరోగ్యం గురించి వాకబు చేసి ఆ అబ్బాయి కుటుంబ పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రియాంకా గాంధీ ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆ మురికి వాడకు వచ్చి తమతో సమయం గడుపుతుందని ఆశిష్ చెప్పాడు.

తమ క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుంటారని బాలుడు వివరించాడు. ఆశిష్ చికిత్స కోసం అయ్యే ఖర్చు తానే భరిస్తోందని గద్గద స్వరంతో చెప్పాడు ఆశిష్ తండ్రి. ఇదిలా ఉంటే ఫిబ్రవరి 7న ప్రియాంకాగాంధీ ఏఐసీసీ కార్యదర్శులతో ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ ఇంఛార్జీలతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఆమె లోక్సభ 2019 ఎన్నికల గురించి దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఇక ఫిబ్రవరి 9న ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ లీడర్లతో రాహుల్ గాంధీ సమావేశం కానున్నారు.

స్వీపర్ పోస్టులకు బీటెక్‌ల పోటాపోటీ



చెన్నై: ఉన్నత చదువులు చదివిన వారు కిందిస్థాయి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకాడుతారని చాలామంది భావిస్తారు. కానీ నిరుద్యోగం కారణంగా ఎంబీఎం, ఎంటెక్, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు కూడా కిందిస్థాయి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. తమిళనాడులోని అసెంబ్లీ సచివాలయంలో స్వీపర్ ఉద్యోగాలకు ఉన్నత ఉద్యోగాలు చదివిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ మొత్తం 14 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో స్వీపర్ ఉద్యోగానికి పది ఖాళీలు, శానిటరీ వర్కర్ ఉద్యోగానికి నాలుగు ఖాళీలు ఉన్నాయి. వీటి కోసం డిప్లోమా పూర్తి చేసిన వారు కూడా రేసులో నిలిచారు. అసెంబ్లీ సెక్రటరియేట్ గత ఏడాది సెప్టెంబర్26వ తేదీన ఖాళీలు ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పింది. ఈ ఉద్యోగానికి క్వాలిఫికేషన్ పెద్దగా క్వాలిఫికేషన్ ఏమీ లేదు. కనీస వయస్సు మాత్రం 18. ఇందుకోసం వేలాది దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 4,607 మంది ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో 677 అప్లికేషన్లు ఎలిజిబులిటీ లేని కారణంగా తొలగించారు. మొత్తంగా 3,930 అభ్యర్థులకు ఇంటర్వ్యూ కోసం లెటర్స్ పంపించారు. వేతనం రూ.15,700 నుంచి రూ.50,000 వరకు ఉంది. రిక్రూట్మెంట్ రోస్టర్ ప్రకారం 4 ఉద్యోగాలు జనరల్ కేటగిరీకి, 4 ఓబీసీలకు, 3 బీసీలకు డీ నోటిఫైడ్ ట్రైబ్స్‌కు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీలకు కేటాయించారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది ఎంబీఏ, ఇంజినీరింగ్, ఎంటెక్, బీటెక్ చేసిన విద్యార్థులు ఉన్నారు.

ముజఫర్‌నగర్ అల్లర్లలో దోషులు ఏడుగురు



ముజఫర్‌నగర్: ముజఫర్‌నగర్ అల్లర్ల సమయంలో ఇద్దరు యువకులను చంపిన కేసులో కోర్టు ఏడుగురిని దోషులుగా నిర్ధారించింది. 2013 ఆగస్టు 27న అల్లర్ల సమయంలో జరిగిన దాడిలో కావల్ గ్రామానికి చెందిన గౌరవ్, సచిన్లు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఆ ప్రాంతంలో ఘర్షణలు చెలరేగాయి. భారీగా రంగంలోకి దిగిన పోలీసులు పలు సమూహాలపై లాఠీఛార్జీ కూడా చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా పోలీసులు ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు లో పది మంది సాక్షుల వాంగ్మూలం నమోదు చేసిన కోర్టు..ఏడుగురు నిందితులు ముజామిల్, ముజస్సిమ్, ఫర్కన్, నదీమ్, జానంగిర్, అఫ్జల్, ఇక్బాల్ లను దోషులుగా నిర్ధారించింది. దోషులకు శిక్షలను విధించేందుకు కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

మాల్యా కోసం జైలుగది సిద్ధం



న్యూఢిల్లీ: బ్యాంకులకు 9వేల కోట్ల రూపాయలు టోకరా పెట్టి..పరారీలో ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా విచారణ వేగవంతం చేసేందుకు అన్నీ సిద్ధం చేసినట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది. మాల్యాను లండన్ నుంచి తీసుకువచ్చిన వెంటనే..అతన్ని ఉంచేందుకు ఆర్థర్ రోడ్ జైలులో ఓ గదిని రెడీ కూడా చేసినట్లు ఈడీ తెలిపింది. మాల్యాను భారత్‌కు అప్పగించే దస్త్రంపై ఇటీవలే యూకే హోం మంత్రిత్వ శాఖ సంతకం చేసిన విషయం తెలిసిందే. రుణాల ఆరోపణల నేపథ్యంలో మాల్యా చాలా రోజులు ఎక్కడ ఉన్నారో కూడా తెలియలేదు. కాగా తాను బ్యాంకులకు బాకీ ఉన్న మొత్తాలను చెల్లిస్తానని సమయం ఇవ్వాలని ఇప్పటికే పలుమార్లు మాల్యా మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై బీమా భారం?

ఢిల్లీ: సీటు బెల్టు పెట్టుకోకుండా కారు నడుపుతున్నారా? సిగ్నళ్లను పట్టించుకోకుండా వాహనాన్ని నడుపుతున్నారా? ఇక ట్రాఫిక్ ఉల్లంఘనలపై వినూత్న రీతిలో శిక్షల అమలుకు రవాణా శాఖ యోచిస్తుంది. ఇందులో ముఖ్యమైంది.. వాహనానికి ఉన్న బీమా ప్రీమియాన్ని అమాంతం పెంచేయడం. దీంతో వాహనదారుడి జేబుకు చిల్లు పడనుంది.

పదే పదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారికి బీమా ప్రీమియంను పెంచాలని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఐఆర్డీఏ)కి రవాణాశాఖ సిఫార్సు చేసింది. దీంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తు.చ తప్పకుండా పాటించేవారికి బీమాను తగ్గిస్తే మిగతా వారిని ప్రోత్సహించినట్లవుతుందని రవాణాశాఖ అభిప్రాయపడింది. త్వరలోనే ఐఆర్డీఏ దీనిపై ఓ నిర్ణయానికి రానున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం అమెరికాలో దాదాపు ఇలాంటి నిబంధనే అమల్లో ఉంది. తరచూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులు 30–40 శాతం ఎక్కువ బీమా ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. మన దేశంలో రోడ్డు ప్రమాదాలు చాలా జరుగుతుంటాయి. ఇందులో ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా ప్రమాదాల బారిన పడ్డవారే ఎక్కువ. ఇలాంటి వాటిని అరికట్టేందుకే రవాణా శాఖ ఈ యోచన చేస్తోంది.

గాంధీ దిష్టిబొమ్మ కాల్చిన కేసులో అరెస్టులు

ఉత్తరప్రదేశ్: జాతిపిత మహాత్మాగాంధీని ఎలాగైతే నాథూరాంగాడ్సే హత్య చేశాడో... నాటి ఘటనను తిరిగి గుర్తు చేసి అదేపద్ధతిలో మహాత్ముడి ఫోటోను గన్‌తో కాల్చిన అఖిలభారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి పూజా షకున్ పాండేను ఆమె భర్తను అలిఘర్ పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు మహాత్మాగాంధీ దిష్టిబొమ్మను కాల్చడంతో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదంతా గతనెల గాంధీ వర్ధంతి రోజున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వీరంతా అఖిల భారత హిందూ మహాసభ సంస్థకు చెందిన వారిగా గుర్తించారు.

ఇక గాంధీ దిష్టి బొమ్మను పాండే ఒక బొమ్మ తుపాకీతో కాల్చారు. కాల్చిన వెంటనే గాంధీ బొమ్మనుంచి రక్తం కారడం కనిపిస్తుంది. ఇదంతా గాంధీ వర్ధంతి రోజున జరిగింది. అంతేకాదు దీన్ని వీడియో కూడా తీశారు. మరోవైపు గాంధీని హత్యచేసిన నాథూరాం గాడ్సే ఫోటోకు పూలమాలలు వేసి అతనికి అనుకూలంగా నినాదాలు చేశారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. గాంధీజీ అహింసావాది అని ఇంత పెద్ద దేశానికి అహింసా మంత్రంతో స్వాతంత్ర్యం సాధించిపెట్టారని ప్రపంచదేశాలు కొనియాడుతుండగా... ఇలా పూజా పాండే నీచంగా వ్యవహరించారని పలువురు దేశభక్తులు విమర్శలు గుప్పించారు. జాతిపితను అవమాని ంచినందుకు గాను పూజా పాండేను తన భర్తపై కేసు నమోదు చేయాలడి పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. అయితే పూజా పాండే వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలవడం ఇది తొలిసారి కాదు. అంతకుముందు కూడా గాడ్సే కంటే ముందు కనుక తాను జన్మించి ఉంటే మహాత్మా గాంధీనీ తానే హత్యచేసి ఉండేదనే వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు గాంధీలా తయారు కావాలనుకునే వారినెవరినైనా సరే కాల్చేస్తానంటూ బహిరంగ వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు దేశ విభజనకు కారణం గాంధీనే అని చెప్పిన పూజా పాండే... కొన్ని లక్షల మంది హిందువుల మరణానికి కూడా గాంధీనే కారణం అని ధ్వజమెత్తారు. గాంధీని మరోసారి చంపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో పోలీసులు పాండేను ఆమె భర్త అశోక్తో పాటు మరో 12 మందిని సెక్షన్ 147, 148.149,295 ఏ, 153 ఏల కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే గాంధీని హత్య చేసినందుకు గాను నాథూరాం గాడ్సేకు ఉరిశిక్ష విధించింది కోర్టు. 15 నవంబరు 1949 అంబాలా జైలులో గాడ్సేను ఉరితీయడం జరిగింది.

సైన్యం చట్ట పరిధిలో పని చేయాలి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ సైన్యం చట్ట పరిధిలోనే విధులు నిర్వహించాలని, రాజకీయాలకు దూరంగా ఉండాలని పాకిస్తాన్ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. 2017లో ఫైజాబాద్ సిట్‌కు సంబంధించి టెహ్రీక్–ఇ–లబ్బాయిక్ పాకిస్తాన్ (టీఎల్‌పీ), ఇతర చిన్న గుంపులకు సంబంధించిన కేసు విచారించి సుప్రీంకోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. తీవ్రవాదం, అతివాదం దేనికి సంబంధించిన విచారణ అయినా సరే చట్ట పరిధిలోనే విచారణ జరగాలని వ్యాఖ్యానించింది. గత ఎన్నికల్లో సైన్యం ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు సహకరించిందనే ఆరోపణలు ఎదుర్కొంటోంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సగం కాలం పాకిస్తాన్ నిర్ణయాధికారంలో సగం కాలం సైన్యం పరిధిలోనే ఉంది. ఈ నేపథ్యంలో ఒక రాజకీయ నాయకునికి కాని లేదా పార్టీ కోసం కాని సైన్యం పని చేయడానికి వీలులేదని, ఐఎస్ఐ లాంటి నిఘా సంస్థలు కూడా చట్ట పరిధిలోనే పని చేయాలని ఆదేశించింది.

బార్బీ బొమ్మల ఇల్లు



లాస్ ఏంజిల్స్: అజుసా సకమోటోకు బార్బీ బొమ్మలంటే ఇష్టం. ఎంతగా అంటే తన ఇంటినే ఆ బొమ్మలతో మందిరంగా మార్చేసేంతగా. ప్రముఖ అమెరికన్ బొమ్మల కంపెనీ మట్టెల్‌కు చెందిన ఈ బొమ్మలంటే ప్రపంచంలోని చాలా మంది పిల్లలకు, అందులోనూ ముఖ్యంగా అమ్మాయిలకు చాలా ఇష్టం. అందరు పిల్లలలాగే అజుసా చిన్నతనంలో ఈ బొమ్మతో ఆడుకుంటూ మనసుపడిందనుకుంటే పొరపాటే. జపాన్లో అప్పటికి ఈ బొమ్మ పెద్దగా ప్రాచుర్యంలో లేదు. పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఓ దుకాణంలో అకస్మాత్తుగా బార్బీ బొమ్మను చూసింది. అంతే! అది తనకు ఎంతలా నచ్చేసిందంటే లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారే అలా.. అప్పటి నుంచి బార్బీ బొమ్మల సేకరణను ఓ వ్యసనంలా మలుచుకుంది. వాటి కోసం ఇప్పటి వరకూ 80 వేల డాలర్లు ఖర్చు చేసి వాటితో ఇంటినంతా నింపేసింది. బార్బీ బొమ్మను తొలిసారి చూసినప్పుడు అది పిల్లల కోసం చేసింది కాదని తాను భావించినట్లు అసుజా సకమోటో పేర్కొంది. రకరకాల బార్బీ బొమ్మలను సేకరించిన అసుజా తన చేతులు, ఆమె స్టూడియో, వెస్ట్ హాలీవుడ్లోని తన ఇంటినీ గులాబీ రంగులోకి మార్చి.. అందులోని కళాకృతులు, గోడలపై, గ్లాసులు, టవల్స్ ఇలా దేన్నీ వదలకుండా గులాబీ వర్ణంలోగానీ, బార్బీ బొమ్మలతో గానీ అలంకరణలు ఉండేలా చూసుకుంటోంది. గత నాలుగేళ్లుగా నెయిల్ డిజైనర్‌గా లాస్ ఏంజిల్స్‌లో పనిచేస్తున్న అజుసా తన జుట్టుకు కూడా గులాబీ రంగునే డైగా వాడుతోంది. గులాబీ రంగు వస్త్రాలు ధరిస్తూ ఆహార్యంలో బార్బీ బొమ్మ రూపం ప్రతిబింబేలాగా జాగ్రత్త పడుతోంది. ఇంతటితో అజుసా ఆగలేదు. తనలాగా బార్బీపై అభిరుచి కలిగిన వారిని కలుసుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టేస్తోంది. అయితే ఆమె అభిరుచిపై మాత్రం కొందరు పెదవి విరుస్తున్నారు. నిజ జీవితంలో తనను తానొక బొమ్మలాగా ఊహించుకుంటూ వాస్తవిక ప్రపంచంలో జీవించడంలేదంటూ విమర్శిస్తున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోని అజుసా తన గోర్లకు వేసుకునే రంగులు, బార్బీలతో తీర్చిదిద్దిన ఇంటిని, తన అభిరుచులను ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ అభిమానులను చూరగొంటోంది. ఇప్పటి వరకూ బార్బీ బొమ్మలు, దుస్తులు, ఇతర వస్తువుల కోసం 80వేల డాలర్లు ఖర్చు చేశానని, అందుకు ఎలాంటి బాధ లేదని పేర్కొంది. ఈ భిన్న వేషధారణతో కనపడగానే చాలా మంది ఒక్కసారిగా నిర్ఘాంతపోతుంటారని, నాకు నేను ఇలా కనిపించడాన్ని ఎంతో ప్రేమిస్తున్నానని అజుసా పేర్కొంది. బార్బీమ్యాన్‌గా పేరొందిన స్టాన్లీ కోలోరైట్ తరహాలో తాను గుర్తింపు సంపాదిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.

కిమ్‌తో భేటీకి రెడీ

- అమెరికాను దోచుకోవడం చైనా వల్ల కాదు
- తాలిబన్లతో చర్చలు కొనసాగిస్తాం
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్ కార్యక్రమంలో ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్‌ఉన్‌తో ఈ నెలలో భేటీ కానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. యుఎస్ కాంగ్రెస్‌లో జరిగిన 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తర కొరియాతో చర్చల విషయాన్ని వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్‌తో ఫిబ్రవరి 27న వియత్నాంలో భేటీ కానున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ భేటీ రెండు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఉత్తర కొరియా అణ్వాయుధాలను త్యజించేలా తన కృషి కొనసాగుతుందన్నారు. గతంలో సింగపూర్‌లో జరిగిన భేటీతో సుహృద్భావ వాతావరణం నెలకొందని తెలిపారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని స్థాపించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు.

మన నాయకుల్ని అనాలి

అమెరికాను అలుసుగా తీసుకొన్నందుకు చైనాను నిందించకూడదని ట్రంప్ చెప్పారు. దీనికి తమ దేశనాయకులదే తప్పని తేల్చారు. వారే చైనాకు ఆ అవకాశం ఇచ్చారని తెలిపారు. డ్రాగన్‌పై 250 బిలియన్ డాలర్ల మేరకు పన్నులు విధించడంతో ఖజానాకు బిలియన్ల కొద్ది నిధులు సమకూరుతున్నాయన్నారు. అమెరికాలో ఉద్యోగాలను, మేధోసంపత్తిని చైనా దొంగిలిస్తోందని మండిపడ్డారు. తాము దూకుడు వ్యవహరిస్తూ దీనికి అడ్డుకట్ట వేస్తున్నామని చెప్పారు. అమెరికాను దోచుకోవడం ఇక కుదరని పని అని చైనాకు తేల్చి చెప్పామన్నారు. వాస్తవ పరిస్థితిలో మార్పులు ఉంటేనే ఆ దేశంతో ఒప్పందం చేసుకొంటామన్నారు.

ఆర్థిక వ్యవస్థలో అద్భుతాలు

తాను అధికారం చేపట్టాక ఆర్థిక వ్యవస్థ బాగా కోలుకుందని ట్రంప్ వెల్లడించారు. నిరుద్యోగం ఐదు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత తక్కువగా ఉందని చెప్పారు. తమ దేశ ఉద్యోగుల్లో మహిళలు కూడా అత్యధికంగా ఉన్నారని పేర్కొన్నారు. దేశ కాంగ్రెస్‌లో కూడా వారి శాతం ఎక్కువగానే ఉందని గుర్తు చేశారు.

రాజకీయ ఐక్యత అవసరం

అమెరికా శత్రువులను ఓడించాలంటే రాజకీయ ఐక్యత ముఖ్యమని ట్రంప్ హితవు పలికారు. అత్యున్నతమైన ఎంపిక ఉండాలని ఆయన సూచించారు. కొన్ని దశాబ్దాలుగా ఉన్న



రాజకీయ వైషమ్యాలను వీడి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కోట్ల మంది ప్రజలు మనల్ని గమనిస్తున్నారంటూ ఆయన డెమోక్రాట్లకు గుర్తు చేశారు. రెండు పార్టీల వలే కాకుండా ఒక దేశం వలే పాలిద్దామని చెప్పారు.

తాలిబన్లతో చర్చలు

అఫ్గనిస్థాన్‌లో అన్ని వర్గాలతో నిర్మాణాత్మక చర్చలు కొనసాగిస్తామన్నారు. ఈ వర్గాల్లో తాలిబన్లు కూడా ఉంటారన్నారు. ఈ నిర్ణయం వల్ల దళాల ఉపసంహరణ సులభమై ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టిపెట్టే అవకాశం లభిస్తుందన్నారు. ఈ క్రమంలో ఒప్పందం కుదురుతుందో లేదో చెప్పలేనన్నారు. కానీ శాంతి స్థాపన తుది ప్రయత్నానికి సమయం ఆసన్నమైందన్నారు. అవినీతిపరులైన పాలకుల వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని తాము ఇరాన్‌తో అణుఒప్పందాన్ని రద్దు చేసుకొన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు అమెరికా ఏ దేశంపై విధించనంత కఠినమైన ఆంక్షలను విధించామన్నారు. అమెరికా 'ఇరాన్ వ్యూహం'లో దీనిని విప్లవాత్మక మార్పుగా అభివర్ణించారు.

వలసదారులే దేశానికి పెనుముప్పు

చట్టబద్ధంగా వచ్చిన వారికే అమెరికాలో చోటు ఉంటుందని అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఆయన యూఎస్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వలసదారుల అంశాన్ని ప్రస్తావిస్తూ తమ దేశానికి వచ్చేవారు న్యాయపరంగా రావాలని ట్రంప్ కోరారు. అక్రమ వలసదారులే దేశానికి పెను ముప్పని తేల్చారు. ఈ సందర్భంగా ట్రంప్ 'అమెరికన్ల ఉద్యోగాలకు, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పిస్తూ బలమైన వలస వ్యవస్థను రూపొందించడం మా నైతిక బాధ్యత. న్యాయపరంగా వచ్చే వలసదారులు మా దేశానికి ఎంతగానో ఉపయోగపడుతున్నారు. విదేశీయులు ఇంకా ఎక్కువ మంది మా దేశానికి రావాలని కోరుకుంటున్నాను. కానీ వారు న్యాయపరంగా రావాలి' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. అక్రమ వలసల్ని, మాదక ద్రవ్యాలను అడ్డుకోవాలంటే సరిహద్దు గోడ నిర్మాణం తప్పనిసరని తేల్చారు. అమెరికా భద్రతకు అత్యంత కీలకంగా నిలిచే సరిహద్దు గోడ నిర్మాణాన్ని డెమోక్రాట్లు అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో చాలా మంది సరిహద్దు గోడ నిర్మణానికి మద్దతు తెలిపారని, కానీ నేడు వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు. ఈ నెల 15 లోగా సరిహద్దు గోడ నిర్మాణం గురించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ గడువు విధించారు. దేశ సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. గుడ్డుకు ఈకలు పీకే ధోరణితో అమెరికాలో శాంతిని డెమోక్రాట్లు దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. వారు గోడ నిర్మాణానికి నిధుల మంజూరుపై వ్యతిరేకతను వీడాలన్నారు. దేశంలోకి అక్రమ వలసలను అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యగా ట్రంప్ అభివర్ణించారు. గతంలో ఈ సభలో ఉన్న చాలా మంది గోడ నిర్మాణానికి అనుకూలంగా ఓటు వేశారని, కానీ గోడ నిర్మాణం మాత్రం జరగలేదన్నారు. తాను దానిని కచ్చితంగా నిర్మిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

అంతేకాక అదేసమయంలో 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యానికి సంబంధించి డెమొక్రాట్లు చేస్తున్న విమర్శల విషయంలో ఘాటుగా స్పందించారు. వాటిని పనికిమాలిన ఆరోపణలుగా కొట్టిపారేశారు.

ఇస్రో మరో ఘనత

జీశాట్ 31.. విజయవంతం



ఫ్రెంచ్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సిగలో మరో కలికితురాయి చేరింది. జీశాట్31 శాటిలైట్‌ను ఫ్రెంచ్ గయానా నుంచి విజవంతంగా ప్రయోగించింది.

ఏరియన్ 5 రాకెట్ ద్వారా 42 నిమిషాల్లోనే నిర్దేశిత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహం. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. ఫ్రెంచ్ గయానాలోకి కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ 31ను విజయవంతంగా ప్రయోగించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 2.31 గంటలకు జీశాట్ 31 ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకుపోయిన ఏరియన్5 రాకెట్ 42 నిమిషాల్లోనే నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. విజయవంతంగా ఇస్రో నింగిలోకి పంపిన ఈ ఉపగ్రహం సమాచార సేవలకు ఉపయోగపడుతుంది. జీశాట్ 31తో పాటు సౌదీకి చెందిన 1 హెల్లాస్ శాట్ 4 ఉపగ్రహం కూడా ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. జీశాట్ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తంచేశారు. దీంతో నింగిలోకి ఇస్రో పంపిన కమ్యూనికేషన్ ఉపగ్రహాల సంఖ్య 40కి చేరుకుంది. దాదాపు 2,536 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం 15 ఏళ్ల పాటు నిరాటంకంగా సేవలను అందించనుంది. అత్యంత సమర్థవంతమైన కేయూ బ్యాండ్ ప్రసార వ్యవస్థ ఉన్న జీశాట్ 31 సంప్రదాయ ఉపగ్రహాలైన ఇన్‌శాట్, జీ శాట్లకు ఆధునిక రూపమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. భూభాగాలు, ద్వీపాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతం పరిసరాల గురించి సమాచారాన్ని ఈ ఉపగ్రహం అందజేస్తుంది. ఈ ఉపగ్రహం వీశాట్ నెట్వర్క్స్, టెలివిజన్ అప్లింక్స్, డిజిటల్ శాటిలైట్, డీటీహెచ్ టెలివిజన్, సెల్యులార్ బ్యాకప్‌లకు అనుకూలమైన సాంకేతికతతో రూపుదిద్దుకుందని ఇస్రో వెల్లడించింది. ఇప్పటికే భూస్థిర కక్ష్యలో ఉన్న ఇతర సమాచార ఉపగ్రహాలతో చేరి ఇది అదనపు సేవలు అందిస్తుంది.

ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి జరిగిన ఈ ప్రయోగానికి ఇస్రో ప్రతినిధిగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డైరక్టర్ ఎస్ పాండ్యన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి లోపం తలెత్తకుండా ఈ ప్రయోగం విజయవంతమైందని అన్నారు. ఇన్‌శాట్ స్థానంలో జీశాట్ 31ను ప్రయోగించామని తెలిపారు. ఈ ప్రయోగం కోసం గత జనవరి నుంచి ఇస్రో సిబ్బంది, ఏరియన్ స్పేస్ తీవ్రంగా శ్రమించాయని పేర్కొన్నారు. అలాగే వచ్చే జూన్, జులైలో మరో సమాచార ఉపగ్రహం జీశాట్ 30 ప్రయోగాన్ని ఇదే కేంద్రం నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు. ఐరోపాలోని ఫ్రెంచ్ గయానాతో భారత్‌కు 1981 నుంచి అంతరిక్ష సంబంధాలు కొనసాగుతున్నాయని, ఇవి క్రమంగా మరింత బలపడుతున్నాయని పాండ్యన్ వివరించారు.

ఆఫ్ఘన్ నాయకులతో తాలిబన్ చర్చలు



మాస్కో: ఆఫ్ఘనిస్తాన్ రాజకీయ నాయకులతో తాలిబన్ నాయకులు రెండవ రోజు చర్చలు కొనసాగించారు. మాస్కోలో జరుగుతున్న చర్చల్లో తాలిబన్ నాయకులు తాము ఎలాంటి భవిష్యత్ ఆఫ్ఘనిస్తాన్‌ను కోరుకుంటున్నామో తాలిబన్ నాయకులు కెమెరాల ముందు వెల్లడించారు. దోహాలో అమెరికా సైన్యంతో 17 సంవత్సరాల యుద్ధానికి నిలిపివేయాలని తాలిబన్ అనుకుంటున్నట్టు వార్తలు వచ్చిన వారం రోజుల తర్వాత ఈ చర్చలు జరగడం గమనార్హం. దోహాలోని తాలిబన్ రాజకీయ కార్యాలయం డిప్యూటీ హెడ్ అబ్దుల్ సలాం హనేఫీ మాట్లాడుతూ, అమెరికా తమ సగం సైన్యాన్ని ఉపసంహరించుకోవాడనికి సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ఈ ఉపసంహరణ ఫిబ్రవరి 1న మొదలై ఏప్రిల్ చివరి వరకు కొనసాగుతుందన్నారు. ఇస్లాం ఆధారంగా చట్టం కావాలని తాలిబన్‌లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

ఆలయం కూల్చివేతపై పాక్ ప్రధాని ఆగ్రహం



కరాచీ: పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో కొంతమంది దుండగులు ఓ హిందూ దేవాలయాన్ని కూల్చివేశారు. ఆలయంలోని పవిత్ర గ్రంథాలు, విగ్రహాలకు నిప్పుపెట్టారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన పాక్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ వెంటనే విచారణకు ఆదేశించారు. "ఆలయం కూల్చివేత ఘటనపై సింధ్ ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ చర్య ఖురాన్‌కు వ్యతిరేకం" అని ఇమ్రాన్ ఖాన్ ట్విట్టర్ వేదికగా సింధ్ ప్రావిన్స్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సింధ్ ప్రావిన్స్‌లోని ఖైరాపూర్ జిల్లా కుంభ్ అనే ప్రాంతంలో చోటు చేసుకుంది. దీనిపై స్పందించిన అక్కడి హిందూ సమాజం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఖైర్పూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే ఘటన జరిగి ఐదారు రోజులవుతున్నా ఇప్పటికీ నిందితులను పట్టుకోక పోవడంపై హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. ఆలయ విధ్వంసాన్ని నిరసిస్తూ సింధ్ ప్రావిన్స్‌లో పలు హిందూ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించేందుకు స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి.

హిందూ దేవాలయాల పరిరక్షణకై ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ హిందూ కౌన్సిల్ సలహాదారు రాజేశ్ కుమార్ హర్దాసనీ డిమాండ్ చేశారు. "ఈ చర్య హిందూ సమాజాన్ని రెచ్చగొట్టేలా ఉంది. మత సామరస్యాన్ని చెదరగొట్టడంలో భాగంగానే దుండగులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. దేశంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించాలని చూస్తున్నారు" అని రాజేశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. గతంలోనూ 160ఏళ్ల నాటి పురాతన గోరఖ్ నాథ్ ఆలయంపై దుండగులు దాడి చేశారు. ఆలయంలోని చిత్రాలు, శివలింగాన్ని ధ్వంసం చేశారు. అంతకు కొన్ని రోజుల ముందే పెషావర్ హైకోర్టు దాన్ని తిరిగి తెరవాలని ఆదేశించింది. అప్పట్లో ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

కాగా, పాకిస్తాన్ మొత్తం జనాభా (22 కోట్లు)లో 2 శాతం మంది హిందువులు ఉన్నారు. పాకిస్తాన్‌లోని హిందువుల్లో ఎక్కువ మంది సింధ్ ప్రావిన్స్‌లోనే నివసిస్తున్నారు. అల్ప సంఖ్యాకులైన హిందువులపై అతివాదులు వేధింపులకు పాల్పడుతున్నారంటూ తరచూ పోలీసులకు ఫిర్యాదు అందుతుంటాయి.

సెరిబ్రల్ పాల్సీ ఉన్నా.. రచయిత్రిగా టాప్

బీజింగ్: కదల్లేని కియాంజిన్ సాహితీ రచయిత్రిగా చరిత్ర సృష్టిస్తోంది. చిన్నపాటి అనారోగ్యానికి గురైతేనే వామ్మో! అంటూ తెగ ఆందోళన పడిపోతుంటాం. అలాంటిది కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో, ఎప్పటికీ కోలుకోలేమని తెలిసినా ఎటువంటి నిరుత్సాహానికి గురి కాకుండా తమ పనితీరుతో కొత్త రికార్డులు సృష్టిస్తుంటారు. అలాంటివారిలో చైనాకు చెందిన వాంగ్ కియాంజిన్ (26)ఒకరు. తూర్పు చైనాలోని జియాంగ్సు ప్రావిన్సుకు చెందిన కియాంజిన్..ఆక్సిజన్ లోపం కారణంగా సెరిబ్రల్ పాల్సీ వ్యాధితో జన్మించింది. తల తప్ప ఏ భాగాన్ని కదలించలేదు. తల్లే ఆమెకు భోజనం తినిపిస్తుంది. అయితే ఆమె తన పరిస్థితిని చూసి బాధపడుతూ కూర్చోలేదు. పాఠశాలకు వెళ్లకపోయినా ఇంటి వద్దనే ఉంటూ చైనీస్, జపనీస్ భాషల మీద మంచి పట్టు సాధించింది. ఆన్లైన్లోనే షాపింగ్ చేస్తుంది. మనం అందంగా అలకరించుకొనే పెదాలతోనే ఆమె ఇతరులతో సంభాషిస్తుంది. వాటి ద్వారానే తాను చెప్పాలనుకున్న విషయాన్ని కీబోర్డు మీద టైప్ చేస్తుంది. వాటి సాయంతో సాహితి రచయిత్రిగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఆమె కాంట్రాక్టు రచయిత్రిగానూ పనిచేస్తోంది. ఆమె ప్రజ్ఞను చూసి 'శిక్షపడి, స్వర్గం నుంచి నిషేధానికి గురైన దేవదూత' అని ఆమె అభిమానులు పిలుచుకుంటుంటారు. ఆమె రచించిన అనేక నవలలు ఆన్లైన్లో ప్రచురితమయ్యాయి. వాటికి అనేక అవార్డులు కూడా గెలుచుకొని ఇంటర్నెట్ సెన్సేషన్గానూ మారింది కియాంజిన్. ఎప్పుడైనా ఈ వ్యాధి గురించి బాధపడ్డారా? అని ప్రశ్నిస్తే..'సమస్యల గురించి బాధపడటం అర్థం లేనిది' అని కంప్యూటర్ మీద టైప్ చేసి చాలా ఆత్మ విశ్వాసంతో ఈ చైనీస్ యువతి సమాధానం చెప్తుంది.

ట్రంప్ ప్రకటనను తిరస్కరించిన ఇరాక్

బాగ్దాద్: పొరుగు దేశంపై నిఘా వేసి ఉంచేందుకు యుఎస్ సైన్య బృందాలు ఇరాక్‌లో ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాక్‌లో సీనియర్ షియా మతగురువు ఒకరు వ్యతిరేకించారు. సీనియర్ ఇరాక్ అధికారి అలీ అల్ సిస్టానీ ఈ విషయంపై మాట్లాడుతూ, పొరుగు దేశానికి హాని తలపెట్టేందుకు తమ దేశంలో ఎలాంటి పనులు చేపట్టేందుకు లాంచింగ్ ప్యాడ్ ఏర్పాటు సమ్మతం కాదన్నారు. పొరుగు దేశాలతో ఇరాక్ సత్సంబంధాలు, సమతుల్యమైన సంబంధాలను కోరుకుంటుందన్నారు. పొరుగుదేశాలకు తమకు మధ్య అంతర్జాతీయ వ్యవహారాల జోక్యం లేకుండానే ఈ సంబంధాలు కొనసాగాలన్నారు. ఇరాక్ అధ్యక్షుడు, ప్రధానమంత్రి ఇద్దరు ట్రంప్ ప్రకటనను ఖండించారు.


లైంగిక దారుణాలు నిజమే: పోప్ ఫ్రాన్సిస్



అబుదాబి: చర్చిల్లో నన్స్‌పై జరిగే దారుణాలపై పోప్ ఫ్రాన్సిస్ తొలిసారిగా స్పందించారు. క్యాథలిక్ చర్చిలో కొంతమంది ఫాదర్ల చేతిలో నన్స్ లైంగిక వేధింపులకు గురైన మాట వాస్తవమేనని అంగీకరించారు. బిషప్ స్థాయి వ్యక్తులు కూడా ఈ దారుణాలకు ఒడిగడుతున్నారని తెలిపారు. చారిత్రక యూఏఈ పర్యటనను ముగించుకొని మంగళవారం (ఫిబ్రవరి 5) వాటికన్ సిటీకి విమానంలో వెళ్తున్న పోప్.. ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చిల్లో మతాధికారులు, ఇతర వ్యక్తుల వల్ల జరిగిన లైంగిక వేధింపులను నీచమైన నేరాలుగా పోప్ ఫ్రాన్సిస్ వర్ణించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైంగిక ఆరోపణల్లో ఇప్పటికే పలువురిపై చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.


చర్చిల్లో మతాధికారుల లైంగిక వేధింపులపై చాలా కాలంగా ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపిన మీటూ ఉద్యమం తర్వాత ఆ ఆరోపణలు మరింత తీవ్రమయ్యాయి. చర్చిల్లో మహిళ లు, పిల్లలను లైంగికంగా వేధిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు గళమెత్తారు. పోప్ ఈ అంశంపై స్పందించాలని పలు దేశాల ప్రధానులు కూడా కోరడం గమనార్హం. చర్చిల్లో జరుగుతున్న దారుణాలపై వాటికన్ సిటీకి చెందిన ఓ మహిళల మేగజైన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఎంతో మంది నన్స్ లైంగిక వేధింపులకు గురై గర్భాన్ని తొలగించుకోవడమో, పిల్లల్ని కనడమో చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఓ కథనంలో వెల్లడించింది. గతేడాది కేరళలోని ఓ చర్చిలో బిషప్ తనను చాలాసార్లు రేప్ చేశాడని ఓ నన్ ఆరోపించడంతో ఈ అంశంలోని తీవ్రత ప్రపంచానికి తెలిసొచ్చింది. దీంతో పోప్ ఈ అంశంపై ఎట్టకేలకు స్పందించారు. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఇటలీతో పాటు పలు దేశాల్లో ఈ సమస్య ఉందని పోప్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో సమస్య చాలా తీవ్రంగా ఉందని ఆయన చెప్పారు. ఇప్పటికీ వేధింపులు జరుగుతూనే ఉన్నాయని.. ఈ సమస్యను అరికట్టడానికి ఇంకా చాలా చేయాల్సి ఉందని పోప్ ఫ్రాన్సిస్ స్పష్టం చేశారు.

నవాజ్ షరీఫ్ ఆసుపత్రికి తరలింపు



లాహోర్: హృద్రోగ సమస్యలను ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఏడు సంవత్సరాలు జైలు జీవితం అనుభవించిన నవాజ్ షరీఫ్ లండన్ వెళ్లాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాహోర్‌లోని కోట్‌లఖ్‌పత్ జైలు నుంచి ఆసుపత్రికి తరలించారు. ది ఫోర్ట్ మెడికల్ బోర్డ్ ఈ విషయంపై మాట్లాడుతూ, షరీఫ్ ఎదుర్కొంటున్న సమస్యకు పాకిస్తాన్‌లోని ఏదేనీ కార్డియాక్ సర్వీసులున్న ఆసుపత్రుల్లో చికిత్స సాధ్యమేనని వ్యాఖ్యానించింది. నవాజ్ షరీఫ్ రక్త నమూనాలు, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ, హార్ట్, కిడ్నీ, బ్రెయిన్, నేత్రాల పరీక్షలు చేశామని తెలిపింది. పరీక్షల తర్వాత ఆయనగుండెకు చికిత్స అవసరమని వైద్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు. నవాజ్ షరీఫ్‌కు చికిత్స చేసేందుకు పంజాబ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ నుంచి కొంత మంది హృద్రోగ నిపుణులకు బాధ్యతలు అప్పగించారు.

ఫ్లోటింగ్ గొడుగు



అమెరికా: వర్షం పడుతున్నప్పుడో, మంచు కురుస్తున్నప్పుడో... గొడుగు బయటకు తీస్తాం. బయట తిరిగినంతసేపూ.. ఆ గొడుగును అలా పట్టుకోవాల్సిందే. పొరపాటున వదిలేశామా.. అది గాలికి కొట్టుకుపోతుంది. ఏ బైకో నడుపుతూ గొడుగు పట్టుకోవాలంటే మన వల్ల కానిపని. ఇప్పుడా సమస్యలకు చెక్ పెడుతూ ఫ్లోటింగ్ అంబ్రెల్లా వచ్చేసింది. ఇది మామూలు గొడుగు కాదు. దీన్ని మనం పట్టుకోవాల్సిన పనే లేదు. గాల్లో తేలుతూ, మనం ఎక్కడికి వెళ్తే అక్కడికి మనతోనే వస్తుంది. ఎప్పుడూ మన తలపైనే తేలుతూ... మనం ఏమాత్రం వర్షానికి, మంచుకీ తడిసిపోకుండా కాపాడుతుంది. ఫలితంగా దీన్ని మనం పట్టుకొని ఉండాల్సిన పనిలేదు. ఎంత గాలి వచ్చినా, ఏం జరిగినా ఇది మన తలపై నుంచీ పక్కకు వెళ్లనే వెళ్లదు. టెక్నాలజీ మహిమ అది.

మేక వేటకు రూ.80 లక్షలు!



పాకిస్తాన్: సాధారణంగా మాంసం కోసమో లేదంటే డబ్బుల కోసమో జంతువులను వేటాడుతారు. కానీ ఇతడు మాత్రం వేట కోసమే డబ్బులు చెల్లించాడు. అది కూడా ఏ వందో..వెయ్యో కాదు..! ఏకంగా రూ.80 లక్షల డబ్బుకట్టి మేకను వేటాడాడు. వేట అతడి సరదా మాత్రమే కాదు..జీవితం..! వేట కోసం ఎందాకైనా వెళ్తాడు..ఎన్ని దేశాలైనా తిరుగుతాడు..ఎంత డబ్బైనా ఖర్చుపెడతాడు. అతడే బ్రయాన్ కిన్సెల్ హర్లాన్..! అమెరికాలో పేరు మోసిన ప్రొఫెషనల్ హంటర్..! హర్లాన్ ఇంత భారీ మొత్తంలో డబ్బులు చెల్లించింది దేని కోసమే తెలుసా..? పాకిస్తాన్ జాతీయ జంతువైన మార్ఖోర్ మేక కోసం..! మార్ఖోర్..మన భాషలో చెప్పాలంటే అడవి మేక. జడల్లాంటి వెంట్రుకలు, మెలికలు తిరిగిన కొమ్ములతో అందంగా ఉంటుంది. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇండియాలోని హిమాలయ ప్రాంతాలు, తజకిస్థాన్, ఉజ్బెకిస్తాన్లో కనిపిస్తాయి. పాకిస్తాన్ జాతీయ జంతువు కావడంతో అక్కడ మార్ఖోర్ల వేట నిషిద్ధం. అంతరించిపోతున్న జంతు జాతుల్లో మార్ఖోర్ కూడా ఉంది. అందుకే వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది పాకిస్తాన్ ప్రభుత్వం. అంతర్జాతీయ సంస్థలు కూడా మార్ఖోర్ మేకల సంరక్షణకు నడుం బిగించాయి. మరి నిషేధం ఉన్నప్పటికీ మార్ఖోర్ మేకను యూఎస్ హంటర్ ఎలా వేటాడాడో తెలుసా..? దానికీ ఓ చరిత్ర ఉంది. అందులోనూ బలమైన ఓ కారణం ఉంది. పాకిస్తాన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏటా హంటింగ్ ట్రోఫీ జరుగుతుంది. ఈ ట్రోఫీలో ప్రపంచం నలుమూలల నుంచి పేరుమోసిన వేటగాళ్లు పాల్గొంటారు. ఐతే అందులో కేవలం కొందరికి మాత్రమే వేట అనుమతి ఉంటుంది. అందుకోసం పెషావర్ వైల్డ్ లైఫ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక వేలం నిర్వహిస్తుంది. ఎక్కువ పర్మిట్ ఫీజు చెల్లించే నలుగురిని ఎంపిక చేసి..వారికి మాత్రమే వేట అనుమతి ఇస్తారు. ఈసారి హంటింగ్ ట్రోఫీలో పాల్గొన్న హర్లాన్..వేలంలో ఏకంగా 1,10,000 డాలర్లు (దాదాపు రూ.80లక్షలు) చెల్లించాడు. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర. ఆ తర్వాతి స్థానంలో అమెరికన్ హంటర్ డియాండ క్రిస్టోఫర్ (1,05,000 డాలర్లు), జాన్ అమిస్టోసో (1,00,00 డాలర్లు) ఉన్నారు. క్రిస్టోఫర్, అమిస్టోసో జనవరి 21నే చెరో రెండు మేకలను వేటాడారు. ఇక తాజాగా హర్లాన్ సైతం గిల్గిట్‌బల్తిస్తాన్లో సాసీ గ్రామంలో మార్ఖోర్ని వేటాడి చంపాడు. హంటింగ్ ట్రోఫీ వెనక మంచి ఉద్దేశముంది. ఈ ట్రోఫీ ద్వారా వచ్చిన డబ్బులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తుంది అక్కడి ప్రభుత్వం. గిల్గిట్‌బల్తిస్తాన్లో మార్ఖోర్ మేకలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆ ప్రాంతం కొండలు, గుట్టలతో నిండి ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రోఫీ నుంచి వచ్చిన మొత్తాన్ని గిల్గిట్ బల్తిస్తాన్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తారు. కొంత మొత్తాన్ని మార్ఖోర్ మేకల సంరక్షణకు కేటాయిస్తారు. తద్వారా మార్ఖోర్ల సంఖ్య కూడా ఇటీవల పెరుగుతోంది.

11న అమెజాన్‌లో 'ఎఫ్2' లైవ్



సినిమా రిలీజైన నెలరోజుల్లోనే అమెజాన్, నెట్ ఫ్లిక్స్ వంటి సంస్థలు డిజిటల్ మాధ్యమంలో లేటెస్ట్ సినిమాల్ని లైవ్ స్ట్రీమింగ్ కి తెస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవలోనే ఇప్పటికే పలు భారీ చిత్రాల్ని డిజిటల్ లో వీక్షించే ఛాన్స్ ప్రేక్షకులకు దక్కింది. ఈ సంక్రాంతి బరిలో సినిమాల్ని ఇప్పటికే డిజిటల్ లో లైవ్‌లోకి తెచ్చేయడం డిస్ట్రిబ్యూటర్లకు పెద్ద షాక్. తాజా సమాచారం ప్రకారం.. ఈ సంక్రాంతి బరిలో భారీ పోటీనడుమ రిలీజై సంచలన విజయం సాధించిన 'ఎఫ్ 2: ఫన్ & ఫ్రస్టేషన్' చిత్రం అమెజాన్ లో లైవ్ స్ట్రీమింగ్ కి రెడీ అవుతోంది. ఈనెల 11న ముహూర్తం ఫిక్స్ చేశారని తెలుస్తోంది. ఎఫ్ 2 ఇప్పటికే 25 రోజులు పూర్తి చేసుకుంది. దాదాపు 80 కోట్ల మేర షేర్ రాబట్టింది. ఇంకా విజయవంతంగా రన్ అవుతోంది. అయినా మరో ఐదు రోజుల్లో అంటే ఫిబ్రవరి 11న డిజిటల్ లో లైవ్ లోకి వచ్చేస్తోంది.

అయితే రిలీజై ఇన్ని రోజులు అయినా ఇప్పటికీ ఎఫ్ 2 చిత్రం చక్కని వసూళ్లు సాధిస్తూ.. ఇంకా థియేటర్లలో ఆడుతుండగానే అమెజాన్‌లో రిలీజ్ చేసేస్తుండడం పంపిణీదారుల్లో కలవరానికి కారణమవుతోంది. అయితే నెలరోజుల్లో డిజిటల్ రిలీజ్ చేసుకునేలా నిర్మాత దిల్ రాజు అమెజాన్ తో ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రకారమే ఈ చిత్రం డిజిటల్ లో లైవ్ కి వస్తోంది. అదీ సంగతి.

20 కోట్ల వంతెనపై బిగ్ ఫైట్



డార్లింగ్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం సాహో స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్నామని యువి క్రియేషన్స్ బృందం ప్రకటించింది. ఇంకా 6 నెలల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో సుజీత్ అండ్ టీమ్ వేగంగా బ్యాలెన్స్ టాకీ ని వేగంగా చిత్రీకరిస్తోంది. ఇప్పటికే దుబాయ్ , అబుదబీలో భారీ యాక్షన్ సీక్వెన్సులు పూర్తి చేసిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రభాస్ నీల్ నితిన్ ముఖేష్ బృందంపై భారీ యాక్షన్ సీన్స్ ని పూర్తి చేశారు. అందుకోసం ఏకంగా 60కోట్లు పైగా యాక్షన్ సీన్స్ కే ఖర్చు చేశారంటూ అప్పట్లో ప్రచారమైంది. 300 కోట్ల బడ్జెట్ లో దాదాపు 40 శాతం ఓన్లీ యాక్షన్ సీన్స్ కే ఖర్చు చేస్తున్నారట. తాజా సమాచారం ప్రకారం.. హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలో కళాదర్శకుడు సాబు సిరిల్ నేతృత్వంలో ఓ అసాధారణ ఫీట్ ని బూసాహోబూ టీమ్ వేస్తోంది. ముంబై బూబాంద్రా వర్లీబూ లింక్ బ్రిడ్జిని ఆర్ ఎఫ్సీలో రీక్రియేట్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఈ బ్రిడ్జ్ కి సంబంధించిన ఫోటోలు కానీ, వీడియోలు కానీ ఏమాత్రం లీక్ కాకుండా కఠినమైన నిబంధనల్ని అమల్లో పెడుతున్నారని తెలుస్తోంది. సుజీత్, యువి బృందం స్ట్రిక్టుగా కెమెరాల్ని లోనికి ఎలో చేయడం లేదట. కేవలం ఈ ఒక్క బ్రిడ్జి సెట్ కోసం రూ.20 కోట్ల బడ్జెట్ ని ఖర్చు చేస్తున్నారని తెలుస్తోంది. అంతేకాదు హీరో విలన్ బృందంపై ఎంతో లావిష్ గా ఈ ఫైట్ సీన్ ని తెరకెక్కించనున్నారట. అందుకోసం ఏకంగా నెల రోజుల సమయం వెచ్చిస్తున్నారని తెలుస్తోంది. ప్రఖ్యాత హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బేట్స్ సారథ్యంలో ఈ ఫైట్ సీక్వెన్సుని తెరకెక్కించనున్నారన్న మాటా వినిపిస్తోంది. ఇప్పటికే అందుకు సంబంధించిన షెడ్యూల్ ని ఖరారు చేశారట. దుబాయ్ ఫైట్ సీన్ తో పాటు ఈ బ్రిడ్జిపై ఫైట్ సీక్వెన్స్ నెవ్వర్ బిఫోర్ అన్న తీరుగా చిత్రీకరించనున్నారు. వాస్తవానికి ఈ భారీ యాక్షన్ సీన్ ని ముంబైలోని ఒరిజినల్ బ్రిడ్జిపైనే చిత్రీకరించాలని భావించినా అందుకు అనుమతులు కష్టమయ్యాయి. సెక్యూరిటీ సమస్యల వల్ల ఇబ్బంది కలగడంతో అనుకోకుండా ఇప్పుడు సెట్ డిజైన్ పై నే ఆధారపడాల్సి వచ్చిందని తెలుస్తోంది. మార్చి చివరి నాటికి ఈ భారీ షెడ్యూల్ ని పూర్తి చేస్తారు. ట్రాన్స్ ఫార్మర్స్, పెరల్ హార్బర్ వంటి భారీ చిత్రాలకు ఫైట్స్ ని కొరియోగ్రాఫ్ చేసిన కెన్నీ బేట్స్ ఈసారి ఓ టాలీవుడ్ సినిమా కోసం హాలీవుడ్ రేంజ్ యాక్షన్ ని కొరియోగ్రాఫ్ చేస్తుండడంతో సాహో పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా ఇండియన్ సినిమా హిస్టరీలో అద్భుత చిత్రంగా నిలుస్తుందని ప్రభాస్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఓవైపు సినిమా చిత్రీకరణ సాగుతుండగానే ఎడిటింగ్ పనుల్ని పూర్తి చేస్తున్నారట.



వేధింపులు లేకపోలేదు

సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల ఫర్వంపై మీటూ ఉద్యమం ఎటాక్ గురించి తెలిసిందే. ఈ ఉద్యమంలో పలువురు కథానాయికలు ధైర్యంగా ముందుకొచ్చి సమస్యల్ని చెప్పుకున్నారు. టాలీవుడ్ అగ్రకథానాయికలు మాత్రం ఈ విషయంపై 50–50గానే మాట్లాడారన్న విమర్శలున్నాయి. అయితే లైంగిక వేధింపుల పై అగ్ర హీరోయిన్ కాజల్ అగర్వాల్ నోరు విప్పింది. సినిమా ఇండస్ట్రీలో తన మార్కెట్ గురించి తానెప్పుడూ ఆలోచించలేదని కాజల్ తెలిపింది. ఎప్పటికప్పుడు తనకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని తెలిపింది. ఈ కారణంగానే పెళ్లి చేసుకోవాలనే ఆలోచనను పక్కన బెట్టానని కాజల్ చెప్పుకొచ్చింది. ఇక సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ గురించి కూడా కాజల్ నోరు విప్పింది. అవకాశాల కోసం పడకగదికి పిలుస్తున్నారని చాలామంది హీరోయిన్లు చెప్తున్నారు. అది అబద్ధం కాదని కాజల్ స్పష్టం చేసింది. కానీ అలాంటి సంఘటనలు తాను ఎదుర్కోలేదని కాజల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తేజ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న 'సీత' అనే సినిమాలో నటిస్తోంది.

బెల్లం చుట్టూ చీమలా..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా పరిచయం అయిన 'అల్లుడు శీను' చిత్రంలో హీరోయిన్‌గా నటించింది సమంత. స్టార్ హీరోయిన్ అయిన సమంత ఎలా కొత్త హీరోకు జోడీగా నటించింది అంటూ అంతా అవాక్కయ్యారు. అయితే సమంత భారీ పారితోషికం కారణంగా ఆ చిత్రంలో నటించిందని అంతా అన్నారు. 'అల్లుడు శీను' కోసం సమంత ఏకంగా 1.5 కోట్ల రూపాయలను తీసుకుందని అప్పుడు వార్తలు వచ్చాయి. కొంత గ్యాప్ తర్వాత తాజాగా మరోసారి బెల్లంకొండ శ్రీనివాస్‌తో నటించేందుకు సమంత ఓకే చెప్పింది. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్ 'సీత' అనే చిత్రంలో నటిస్తున్నాడు. తేజ దర్శకత్వంలో రూపొందుతున్న సీత చిత్రంలో హీరోయిన్గా కాజల్ నటిస్తోంది. సమ్మర్‌లో 'సీత' చిత్రం విడుదల కాబోతుంది. సీత చిత్రం పూర్తి అయిన వెంటనే ఆర్ఎక్స్ 100 చిత్ర దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో ఒక చిత్రాన్ని చేస్తేందుకు సిద్దం అయ్యాడు. ఆ సినిమాలో హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఇప్పటికే ఈ సినిమా కోసం ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే సినిమాను పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమంతకు ఏకంగా మూడు కోట్ల ఆఫర్ చేసి ఈ చిత్రంలో ఎంపిక చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. సమంత ప్రస్తుతం భర్త నాగచైతన్యతో కలిసి 'మజిలి' చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే. మరో వైపు బేబి అనే చిత్రంలో కూడా సమంత నటిస్తోంది. ఈ రెండు చిత్రాల తర్వాత అల్లుడు శీనుతో మరోసారి రొమాన్స్ చేయబోతుంది.

మార్చి కలిసొస్తుందా?

నందమూరి కళ్యాణ్ రామ్ కెరీర్ ఆరంభించి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తుంది. కాని ఇప్పటి వరకు దశాబ్దంకు ఒక్కటి అన్నట్లుగా రెండు సక్సెస్‌లు మాత్రమే దక్కించుకున్నాడు. ఎన్నో ఏళ్లుగా సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న కళ్యాణ్ రామ్ వరుసగా సినిమాలు చూస్తూనే వస్తున్నారు. తాజాగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ గుహన్ దర్శకత్వంలో '118' అనే విభిన్నమైన సినిమాను చేశారు. ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ లుక్ చాలా స్టైలిష్‌గా ఆకట్టుకునే మేకోవర్‌తో మెరిపిస్తున్నారు.

ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్‌కు జోడీగా ముద్దుగుమ్మలు నివేదా థామస్ మరియు షాలిని పాండేలు నటించారు. ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. మార్చి 1న '118' చిత్రం విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నెల మొత్తం చిన్నా చితకా చిత్రాలు చాలానే విడుదల కాబోతున్నాయి. వెంటనే ఏప్రిల్లో పెద్ద సినిమాలు క్యూ కట్టబోతున్నాయి. అందుకే మిగిలి ఉన్న మార్చిని కొన్ని సినిమాలు క్యాష్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. టాలీవుడ్‌లో మార్చిలో ఎప్పుడు పెద్ద సినిమాలు విడుదలైన దాఖలాలు లేవు. ఒక వేళ విడుదలైనా కూడా భారీగా ఓపెనింగ్స్ దక్కించుకుని సక్సెస్ అయిన దాఖలాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మార్చి 1వ తేదీన 118 చిత్రం ఎలా విడుదల చేయాలని కళ్యాణ్ రామ్ కమిట్ అయ్యారో అర్థం కావడం లేదు. విడుదల తేదీ విషయంలో చిత్ర యూనిట్ సభ్యులు కాస్త అజాగ్రత్త వహించారనిపిస్తుంది. సినిమా విషయంలో నమ్మకం లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అయితే సినిమాపై ఉన్న అతి నమ్మకం వల్ల కూడా ఇలా డేంజర్ నెలలో సినిమాను విడుదల చేస్తున్నారని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఏదా ఏమైనా ఈసారైనా కళ్యాణ్‌కి మంచి హిట్ రావాలని కోరుకుందాం.




ఎన్టీఆర్ తర్వాత వైఎస్సార్‌కే ఆ ఇమేజ్ : దిల్ రాజు



ఒకప్పుడు సినిమా ఫర్వాలేదు అని అంటే తర్వాత బావుండేది. ఇప్పుడు అలా కాదు. ఓపెనింగ్ తీసుకుంటేనే సినిమా నిలబడుతుంది. అలాంటి ఓపెనింగులు దక్కించుకునే సినిమా ఇది. రెండ్రోజుల ముందే ఎంతో ఉత్కంఠగా ఈ సినిమా రాక కోసం వేచి చూస్తున్నా.. అన్నారు దిల్ రాజు. వైయస్సార్ జీవితకథలో పాదయాత్ర ఘట్టంతో రూపొందించిన యాత్ర చిత్రాన్ని దిల్ రాజు నైజాం, వైజాగ్ లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో ముచ్చటించారు. యాత్ర చిత్రాన్ని మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవరెడ్డి నిర్మించారు. దిల్‌రాజు మాట్లాడుతూ.. యాత్ర ఇంకో రెండు రోజుల్లో రిలీజవుతోంది. వై.యస్.రాజశేఖర్రెడ్డి పాదయాత్ర ఎంత సెన్సేషనల్ అయిందో తెలుగు ప్రేక్షకుల్లో అందరికీ తెలుసు. దాన్ని ఐడియాగా తీసుకుని పాదయాత్రలో ఉన్న ఎమోషన్స్, మూమెంట్స్ ని తీసుకుని మహి కథ రాశారు. దాన్ని విజయ్ నిర్మించారు మమ్ముట్టిలాంటి లెజండరీ యాక్టర్ యాక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. టీజర్ విడుదలైనప్పుడు, పాటలు విడుదలైనప్పుడు ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఎగ్జయిట్మెంట్ కనిపించింది. ఆల్ ది బెస్ట్ టు ద టీమ్... మంచి సినిమా రాబోతోందని అనిపిస్తుంది. ఇంకా రెండు రోజులు ఉండగానే ఓవర్సీస్లోగానీ, ఏపీ, తెలంగాణలోనూ ఆన్లైన్ బుకింగ్స్ బావున్నాయి. వెరీ స్ట్రాంగ్ ఓపెనింగ్ తీసుకోబోతుంది సినిమా. ఇవాళ ఓపెనింగ్ తీసుకుంటేనే ఆ సినిమాకు ఒక రెవెన్యూ మేజిక్ జరుగుతుంది. ఓపెనింగ్ అనేది ఇప్పట్లో మరింత ఇంపార్టెంట్ అయింది. ఈ సినిమాను నైజామ్, వైజాగ్‌లో మా సంస్థ విడుదల చేస్తోంది. అందువల్ల రాజశేఖర్‌రెడ్డిగారి పాదయాత్రలో జరిగిన మూమెంట్స్ ఆ రోజుల్లో పేపర్లో, టీవీల్లో చూడటమే. ఆ తర్వాత రాజశేఖర్ రెడ్డి హీరో అయ్యారు. ఆ తర్వాత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మ్ అయింది.

జనాల కోసం ఏదైనా చేస్తాడు ఓ నాయకుడు అని రాజశేఖర్రెడ్డి మంచి నిర్ణయాలు తీసుకుని చూపించారు. రామారావుగారి తర్వాత మన రాష్ట్రాల్లో ఒక ఇమేజ్ బిల్ అయింది రాజశేఖర్‌రెడ్డిగారికి. అలాంటి గొప్ప వ్యక్తి ఇతివృత్తంతో వస్తున్న యాత్ర పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

యూట్యూబ్ రికార్డులు



రామ్ కథా నాయకుడిగా నటించిన 'ఉన్నది ఒకటే జిందగీ' హిందీ డబ్బింగ్ వెర్షన్ 'నెం.1 దిల్ వాలా' యూ ట్యూబ్‌లో విడుదలైన మూడు రోజుల్లోనే 33 మిలియన్ల వ్యూస్ సాధించి రికార్డు క్రియేట్ చేసింది. ఇంతకు పూర్వం హిందీలో విడుదలైన ఏ సినిమాకు కూడా మూడు రోజుల్లో ఇన్ని వ్యూస్ రాకపోవడం గమనార్హం. దీన్ని బట్టి హీరో రామ్ పోతినేనికి బాలీవుడ్ జనాల్లో ఉన్న క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. కిశోర్ తిరుమల దర్శకత్వం వహించిన 'ఉన్నది ఒకటే జిందగీ' స్నేహం విలువను చెప్పే అందమైన ప్రేమ కథా చిత్రం. కోరుకున్న అమ్మాయిని స్నేహితుడు ప్రేమిస్తున్నాడని తెలిసి.. వదులుకున్న అబ్బాయి కథ. స్నేహితులుగా రామ్, శ్రీ విష్ణు నటించారు. ఫ్రెండ్స్ గ్యాంగ్‌లో ప్రియదర్శి, కిరీటి దామరాజు అల్లరి మాటలు నవ్వులు పంచాయి. స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై స్రవంతి రవికిశోర్, కృష్ణ చైతన్య సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. అనుపమ పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి నాయికలుగా నటించారు. రామ్, అనుపమ, శ్రీవిష్ణు, లావణ్య నటన, స్నేహం విలువ చెప్పిన కథ, కథనం, దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన బాణీలు, నేపథ్య సంగీతం సినిమాకు హైలైట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని హిందీలో గోల్డ్ మైన్స్ టెలిఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మనీష్ షా విడుదల చేశారు.

పోలీసే ఉన్మాది అయితే!

పోలీస్ అంటే రక్షణ. ఆపదలో ఉన్న వారికి అభయ హస్తం అందించి రక్షణ అందించే పోలీసులు కర్కశంగా ఉన్మాదిగా ఎందుకు మారాడు? అసలు అలా మారడానికి దారి తీసిన పరిస్థితులేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే ఉన్మాది సినిమా చూడాల్సిందే అంటున్నారు దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి. ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై ప్రొడక్షన్ నెం.2గా ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతోన్న చిత్రం ఉన్మాదిస. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ఇది ఒక గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ. సినిమా పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు, ట్రైలర్ను ఇటీవల విడుదల చేశాం. చాలా మంచి స్పందన వచ్చింది.







శబ్ధంలో సువర్ణసుందరి రహస్యం

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతొన్న చిత్రం 'సువర్ణసుందరి'. ఈ సినిమాను సూపర్ నేచురల్ థ్రిల్లర్ గా దర్శకుడు సూర్య ఎమ్.ఎస్.ఎన్ తెరమీదకు తీసుకు వస్తున్నారు. చరిత్ర భవిష్యత్‌ని వెంటాడుతుంది.. అన్న ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ తో భారీ బడ్జెట్ చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఓ సాంకేతిక అద్భుతంగా ఎస్.టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎమ్.ఎల్. లక్ష్మి నిర్మిస్తున్న ఈ చిత్రం అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం దస్పల్లా హోటల్లో ప్రముఖ దర్శకులు బి.గోపాల్ చేతుల మీదుగా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు.

డైరెక్టర్ సూర్య మాట్లాడుతూ... ఈ సినిమాని చాలా స్పెషల్‌గా చేశాం. ప్రతి ఆర్టిస్ట్ చాలా బాగా నటించారు. ఈ చిత్రంలో విఎఫెక్స్ విజువల్స్ ఉండడం వల్ల ఆలస్యం అయింది. విఎఫ్ఎక్స్ కోసం కనీసం ఏడాదిపాటు దాని పై వర్క్ జరిగింది. లేటు అయినా ఫలితం చాలా బాగా వచ్చింది. మా యూనిట్ అందరికీ నన్ను ఆశీర్వదించడానికి ఇక్కడికి వచ్చిన పెద్దలందరికీ నా కృతజ్ఞతలు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ,విజయేంద్రప్రసాద్, బి.గోపాల్, సాగర్ తదితరులు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

జయప్రద, పూర్ణ, సాక్షి, ఇంద్ర, రామ్, సాయికుమార్, కోటాశ్రీనివాసరావు, ముక్తర్ ఖాన్, నాగినీడు, సత్యప్రకాష్, అవినాష్ నటిస్తున్న ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ః ఎం.ఎల్.లక్ష్మి, మ్యూజిక్ డైరెక్టర్ః సాయికార్తిక్, స్టంట్స్ః రాము సుంకర, ఆర్ట్ డైరెక్టర్ః నాగు, డి.ఓ.పి. ఎల్లుమంతిఈశ్వర్, ఎడిటర్ః ప్రవీణ్‌పూడి, స్టోరీః ఎం.ఎస్.ఎన్.సూర్య, పి.ఆర్.ఓ. సాయిసతీష్, డైరెక్టర్ః ఎం.ఎస్.ఎన్.సూర్య.



కుంకుమ పువ్వుతో కొండంత లాభాలు

- చిన్న పిల్లలు, పెద్దలు గ్లాస్ పాలలో ప్రతిరోజూ కుంకుమ పువ్వు కలిపి తాగితే మెదడు పనీతీరు చురుగ్గా ఉంటుంది. జ్ఞాపకశక్తిని పెంచడంలో కృషి చేస్తుంది. వయసు పైబడిన వారిలో వచ్చే మతిమరుపును కూడా తగ్గిస్తుంది.
- నిద్రలేమి సమస్యతో భాదపడేవారు తరచూ కుంకుమ పువ్వు తింటే, సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది.
- కుంకుమపువ్వులోని యాంటీ ఆక్సిడెంట్స్, న్యూట్రియన్స్, విటమిన్స్, మాంగనీస్ వంటి ఖనిజాలు చర్మాన్ని కాంతివంతంగా మార్చేస్తాయి.
- పావుకప్పు పాలలో కొద్దిగా కుంకుపువ్వు కలిపి కాసేపు అలానే ఉంచి, తర్వాత నుదుటిపై రాసుకుంటే జలుబు కారణంగా వచ్చే తలనొప్పి తగ్గుతుంది. ఈ పువ్వును తరచు తినడం వలన శరీరంలోని వేడి తగ్గుముఖం పడుతుంది.
- శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని తొలగించి, రక్త సరఫరాను మెరుగుపరుస్తూ, గుండె సంబంధిత వ్యాధుల నుండి కూడా కాపాడుతుంది. స్త్రీలకు రుతు సమయంలో వచ్చే కడుపు నొప్పికి కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగితే తక్షణమే ఉపశమనం లభిస్తుంది.

ఆ మూడు రోజుల్లో తినాల్సినవి..

ఆడవాళ్లకు నెలసరి మామూలే అయినా.. ఆ టైమ్‌లో వచ్చే నొప్పి, బాధ, నీరసం మాత్రం చెప్పకోలేనిదే. ఆ సమయంలో కలిగే విసుగుతో చాలా మంది తిండికి దూరంగా ఉంటారు. తీసుకునే కొంచెం ఆహారమైనా బలాన్నిచ్చేది అయితే నొప్పిని తట్టుకోగల శక్తి వస్తుంది. అలాంటి సమయంలో ఇష్టం ఉన్నా.. లేకున్నా.. తప్పనిసరిగా కొన్నింటిని ఆహారంలో చేర్చుకోవాలి.



పీరియడ్స్ సమయంలో విపరీతమైన చికాకు, నీరసం, కడుపు నొప్పి, తలనొప్పి వంటివి సాధారణం. అయితే తీసుకునే ఆహారంలో కొన్నింటిని చేర్చడం ద్వారా ఆ ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చుట. అవి ఏంటో ఓసారి చూసేయండి.

నీటిని ఎక్కువగా తీసుకోవాలి..

శరీరం ఫ్లూయిడ్స్‌ని కోల్పోతుంది కాబట్టి తగినంత నీరు శరీరానికి అందేలా చూసుకోవాలి. మిగతా రోజుల కన్నా పీరియడ్స్ రోజులలో మంచినీరు కాస్త ఎక్కువగా తాగాలి. కాఫీ, టీలకు దూరంగా ఉండడం ఉండడం మంచిది.

ఆకుకూరలు..

ఆకు కూరలలో కావలసినంత ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. కాబట్టి పీరియడ్స్‌లో శరీరానికి కావాల్సిన పోషకాలని అందించాలి. ఆకు కూరలను ఆ మూడు రోజులూ తప్పనిసరంగా ఆహారంలో చేర్చుకుంటే మంచిది.

అరటి పండు

పీరియడ్స్ టైమ్‌లో ఉండే చికాకు, ఒత్తిడి ఇవన్నీ మామూలే. వాటి నుంచి బయటపడటానికి అరటి పండు మంచి ఔషధం. పొటాషియం, బి6 విటమిన్తోపాటు అరటిపండులో వుండే ఇతర విటమిన్లు రక్తంలోని గ్లూకోజ్ నిపెంచుతుంది. దాని వలన మైండ్‌లోని ఒత్తిడి తగ్గి హుషారుగా వుంటారు.

లెగ్యూమ్స్ (గింజధాన్యాలు)

చిక్కుడు కుటుంబానికి చెందిన బీన్స్ వంటి గింజ ధాన్యాలలో ఐరన్ శాతం ఎక్కువ. వాటిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శారీరక సమతౌల్యం త్వరగా పొందచ్చు.

డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్‌లో మెగ్నీషియంతో పాటు, ఫీల్‌గుడ్ కెమికల్ అయిన సెరిటోటిని కూడా రిలీజ్ చేస్తుంది కాబట్టి పీరియడ్స్ సమయంలో ఓ చిన్న డార్క్ చాక్లెట్ తింటే చికాకు పోయి హాయిగా, ప్రశాంతంగా అనిపిస్తుంది.

పీరియడ్స్ రోజులలో మెగ్నీషియం, ఐరన్, ఒమెగా3 ఫ్యాటీ ఆసిడ్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. ఆకుకూరలు, చేపలు, నట్స్, బీన్స్, పప్పు ధాన్యాలు, పండ్లు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యంగా వుండొచ్చు. ముఖ్యంగా చదువుకునే పిల్లల ఆహార విషయంలో అమ్మలు ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలి.








కిరాక్.. క్విల్లింగ్ జ్యూయెలరీ







జ్యూయెలరీ అంటే బంగారం, గ్రాము గోల్డ్ లేదా డైలీవేర్‌కి ఉపయోగించుకునే వాటిని మాత్రమే అనుకుంటాం. కానీ ఇప్పడున్న ఈ ఫ్యాషన్ యుగంలో పేపర్‌తోనే కొత్త రకాల హంగులను తలపిస్తున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. వీటిలో భాగంగానే ట్రెండీ జ్యూయెలరీ కూడా కొత్త పుంతలు తొక్కుతూ, పేపర్ అందాలతో తళుక్కుమంటున్నాయి. వీటిని పిల్లలే కాదండోయ్ పెద్దలు కూడా ముచ్చటగా అలంకరించుకుంటున్నారు. వీటితో ట్రెండీ లుక్ వస్తుంది అంటే నమ్మి తీరాలి. ఇవి అందరికీ అందుబాటులోనే దొరుకుతున్నాయి. ఇంకాస్త వెరైటీగా మార్పు చేయాలంటే మీకున్న ఖాళీ సమయంలో మీరే తయారు చేసుకోవచ్చు. క్విల్లింగ్ పేపర్స్‌తో మీ క్రియేటివిటిని ఉపయోగించి నచ్చిన డిజైన్స్‌తో వాల్ హాంగింగ్స్ లాంటి కొత్త రకాల వస్తువులను అలాగే జ్యూయెలరీని సొంతంగానే తయారుచేసుకోవచ్చు.













మొలకల కుర్మా



కావలసిన పదార్థాలు

పెసల మొలకలు ఒకటిన్నర కప్పు, టొమాటో, ఉల్లిపాయముక్కలు ఒక్కొక్కటీ ఒక్కో అరకప్పు, పచ్చిమిర్చి ఒకటి (సన్నగా తరిగి), అల్లం పేస్టుఒక టీస్పూను, కరివేపాకు రెబ్బ ఒకటి, జీలకర్ర అర టీ స్పూను, ఆవాలు పావు టీస్పూను (కావాలనుకుంటే), కారం అర టీస్పూను, ఉప్పు తగినంత, పసుపు సరిపడా, ధనియాలపొడి ముప్పావు టీస్పూను, కొత్తిమీర రెండు టేబుల్ స్పూన్లు, నీళ్లు ముప్పావు కప్పు, నూనె రెండు టీస్పూన్లు.

తయారుచేయు విధానం

చిన్న పాత్రలో నూనె వేడిచేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడేటప్పుడు అందులో అల్లంపేస్టు, కరివేపాకు వేయాలి. అల్లం సువాసన వచ్చేదాకా వేగించాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కాస్త ఉప్పు చల్లాలి. బంగారువర్ణం వచ్చేదాకా దాన్ని వేగించాలి. అందులో టొమాటో ముక్కలు, ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. టొమాటో ముక్కల్లో ఉల్లిపాయలు కలిసిపోయి మెత్తగా అయ్యేదాకా సన్నని మంటపై ఉడకనివ్వాలి. అందులో పెసర మొలకలు, కారం, ధనియాలపొడి వేసి కలిపి రెండు నిమిషాలు వేగించాలి.

ఈ మిశ్రమం ఉడకడానికి కొద్దిగా నీళ్లు (పెసలు నానబెట్టినవి కాబట్టి) పోయాలి.

పెసర మొలకలు మెత్తబడాలి. దగ్గరపడిన మొలకల కర్రీని కిందికి దించి దానిమీద కొత్తిమీర చల్లాలి. ఈ కూర్మాను వేడి వేడి అన్నంతో లేదా చపాతీలతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

ఆహా!

ఖట్టీ మీటి సబ్జీ

కావలసిన పదార్థాలు

సీతాఫలాలు అరకిలో, టొమాటోలు మూడు, మెంతులు అర టీస్పూను, రెడ్ మిర్చి ఫ్లేక్స్, ఉప్పు, గరంమసాలా, ఆమ్‌చూర్, చక్కెర ఒక్కొటీ ఒక్కో టీస్పూను, నూనె ఒక టేబుల్ స్పూన్.

తయారుచేయు విధానం

సీతాఫలాల గుజ్జు తీయాలి. కడాయి తీసుకుని అందులో కొద్దిగా నూనె వేయాలి. నూనె వేడెక్కాక మెంతులు వేయాలి. అవి చట్పుట్ మనడం మొదలవగానే సీతాఫలం గుజ్జు, ఇతర అన్ని మసాలాదినుసులు, టొమాటో ముక్కలు కడాయిలో వేసి పది నిమిషాలు ఉడికించాలి. అడుగంటకుండా కలుపుతూ ఉండాలి. దాంతో కాసేపటికి సబ్జీ చిక్కగా తయారవుతుంది. కాస్త తీయగా, ఇంకాస్త కారంగా ఉండే ఈ ఖట్టీ మీఠీ సీతాఫల్ సబ్జీ రోటీలోకి గానీ, అన్నంలోగానీ తింటే వెరైటీగా ఉంటుంది.



బెండకాయ బజ్జీ



కావలసిన పదార్థాలు

బెండకాయలు, పచ్చిమిరపకాయలు, టొమాటోలు, ఉల్లిపాయలు తగినన్ని, నీళ్లుకొన్ని, ఉప్పుసరిపడా.

తయారుచేయు విధానం

కడాయిలో నీళ్లు పోసి బెండకాయలు, పచ్చిమిర్చి, టొమాటాలు, ఉల్లిపాయలు, రుచికి సరిపడా ఉప్పు వేసి ఉడికించాలి. స్టవ్ మీద మరో కడాయి పెట్టి అందులో కొద్దిగా నూనె వేసి వేడెక్కాక సన్నగా తరిగిపెట్టుకున్న ఉల్లిపాయలు, పోపు దినుసులు, ఎండుమిర్చి, కరివేపాకు అందులో వేసి వేగించాలి. ముందుగా ఉడికించి పెట్టుకున్న కూరగాయల మిశ్రమంలో ఈ తాళింపు మిశ్రమాన్ని వేసి కలపాలి. బెండకాయ బజ్జీ రెడీ.



కొబ్బరి ముంజల కర్రీ

కావలసిన పదార్థాలు

ముంజలు ఒక కప్పు, పచ్చికొబ్బరిపేస్టు అర కప్పు, నువ్వులపొడి ఒక టేబుల్ స్పూన్, నూనెరెండు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చిపేస్టు రెండు టీస్పూన్లు, ఉప్పు తగినంత, ఉల్లిపాయఒకటి (సన్నగా తరిగి), కసూరిమేథి అరటీస్పూను, అల్లంవెల్లుల్లిపేస్టుఒక టీస్పూను, గరంమసాలాఒక టీస్పూను, పసుపుచిటికెడు, కొత్తిమీరకొద్దిగా, టొమాటో ముక్కలుఅరకప్పు, చింతపండు గుజ్జుతగినంత.

తయారుచేయు విధానం

కడాయిలో నూనె వేసి వేడిచేయాలి. అందులో ఉల్లిపాయముక్కలు వేసి బ్రౌన్ రంగులోకి వచ్చేవరకూ వేగించాలి. పసుపు, అల్లంవెల్లుల్లి పేస్టు అందులో వేసి వేగించాలి. తర్వాత గరంమసాలా, కసూరి మేథీ, పచ్చిమిర్చి పేస్టు, టొమాటో ముక్కలు కూడా అందులో వేసి వేగించాలి. ఈ మిశ్రమంలో పచ్చికొబ్బరిపేస్టు, నువ్వులపొడితో పాటు కొన్ని నీళ్లు పోసి ఉడికించాలి. తర్వాత పొట్టు తీసిన ముంజల ముక్కలను మిశ్రమంలో వేసి కలపాలి. అందులో చింతపండు గుజ్జు, ఉప్పు వేసి కలపాలి. ముంజలు మెత్తబడ్డ తర్వాత దానిపై కొత్తిమీర చల్లాలి. తాటి ముంజల కొబ్బరికూర రెడీ.

విజయక్రాంతి

గురువారం 07 ఫిబ్రవరి 2019

హైదరాబాద్

బిజినెస్

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	406	విజయవాడ	401
ముంబయి	456	ఢిల్లీ	433
చెన్నై	445	బెంగళూరు	435



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115



సెన్సెక్స్ +358.42 — 36,975



నిఫ్టీ + 128.10 — 11,062

రూపాయి ₹71.56 (ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి 34,385 (హైదరాబాద్‌లో) 24 క్యా..10 (గ్రాములకు)/(రూ.)లలో





లాభపడిన ఐటీ సూచీలు

- 358 పాయింట్లు సెన్సెక్స్

ముంబయి: దలాల్ స్ట్రీట్ బుధవారం సెషన్‌లో లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడటంతో సూచీలు కూడా చురుగ్గా కదిలాయి. ముఖ్యంగా లోహరంగ , ఐటీ సూచీలు బాగా లాభపడ్డాయి. అడాగ్ షేర్లు బుధవారం మరింత కుంగాయి. ఒక్క రిలయన్స్ ఇన్ఫ్రానే దాదాపు 27శాతం విలువ కోల్పోయింది. మరోపక్క ఎస్‌ఆర్‌ఎఫ్ షేర్లు 10శాతం లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో కూడా 3శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 358 పాయింట్లు లాభపడి 36,975 వద్ద, నిఫ్టీ 128 పాయింట్లు లాభపడి 11,067 వద్ద ముగిశాయి. 2019లో తొలిసారి సెన్సెక్స్ 11వేల మార్కును దాటింది.

మెషిన్ లెర్నింగ్ సిస్టమ్‌తో స్పామర్ల ఆటకట్టు: వాట్సాప్

ఢిల్లీ: వాట్సాప్‌లో తప్పుడు మెసేజ్‌లను పెద్ద ఎత్తున పంపేవారి ఆటకట్టించేందుకు తాము మెషిన్ లెర్నింగ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. భారత్ లాంటి దేశాల్లో ఈ మధ్య కాలంలో తప్పుడు వార్తలు ఎంత పెద్ద ప్రమాదాలను తెచ్చి పెడుతున్నాయో అందరికీ తెలిసిందే. చాలా మంది అనేక చోట్ల పుకార్లను నమ్మి నిజమే అనుకుని అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు. దీంతో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు పోలీసులు, పలు మీడియా చానళ్లతో కలిసి వాట్సాప్ తప్పుడు వార్తలు, పుకార్లను ఆపేందుకు నడుం బిగించింది. అందులో భాగంగానే గతంలో ఒక్కో వ్యక్తి కేవలం 5 మందికి మాత్రమే మెసేజ్‌ను ఫార్వార్డ్ చేసుకునేలా వాట్సాప్ నిబంధనలను విధించింది. అయితే తాము నకిలీ వార్తలను ప్రచారం చేసే వారిని అడ్డుకునేందుకు ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నామనే విషయాన్ని వాట్సాప్ తాజాగా వెల్లడించింది. వాట్సాప్‌లో నకిలీ వార్తలు, పుకార్లను పెద్ద ఎత్తున ప్రచారం చేసే వారిని నియంత్రించడానికి తాము మెషిన్ లెర్నింగ్ సహాయం తీసుకుంటున్నామని వాట్సాప్ తెలిపింది. ఇక ఈ సిస్టమ్ వల్ల నెలకు 20 లక్షల మంది స్పామర్ల వాట్సాప్ అకౌంట్లను బ్యాన్ చేస్తున్నామని కూడా ఆ కంపెనీ వెల్లడించింది. దీంతోపాటు స్పామర్లు ఉపయోగించే ఐపీ అడ్రస్‌ల ప్రకారం వారిని ట్రేస్ చేసి వారు ఇకపై వాట్సాప్‌ను వాడకుండా చూస్తున్నామని, ఇలాంటి వారిలో 20 శాతం మంది అకౌంట్లను వారు వాట్సాప్‌లో ఆరంభంలో రిజిస్టర్ అయినప్పుడే తొలగించగలుగుతున్నామని కూడా వాట్సాప్ తెలిపింది. వాట్సాప్ మెసేజింగ్‌ను ఎవరూ దుర్వినియోగం చేయకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రాబోయే 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నకిలీ వార్తలు వ్యాప్తి చెందకుండా చూసేందుకు ప్రత్యేక ఇంజినీర్ల బృందాన్ని నియమించామని కూడా వాట్సాప్ తెలిపింది.

శరవేగంగా ఆర్‌బీఐ ఆడిట్

- త్వరలో ఆర్థిక నివేదికతో ముందుకు రానున్న బ్యాంక్‌బోర్డ్



ఢిల్లీ: ఆర్‌బీఐ ఆడిట్ శరవేగంగా జరుగుతోంది. అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదిక త్వరలో బ్యాంక్ బోర్డు ముందుకు రానుంది. ఇది అందగానే ఆర్‌బీఐ ప్రభుత్వానికి అందజేయాల్సిన మధ్యంతర డివిడెండ్‌ను నిర్ణయిస్తారు. 2018 జులై నుంచి డిసెంబర్ మధ్య కాలానికి బ్యాంక్ లెక్కలను గణిస్తున్నారు. ఆడిట్ కమిటీలోని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ త్వరలో భేటీ కానున్నారు. ఈ భేటీలో వారు ఆరునెలల కాలానికి జరిగిన ఆడిట్ నివేదకను ఆమోదించనున్నారు. తొలిసారి అర్ధ సంవత్సరానికి ఆడిట్.. ఆర్‌బీఐలో తొలిసారి అర్ధ సంవత్సరానికి ఆడిట్ నిర్వహిస్తున్నారు. దీనిని ఆడిట్ బోర్డు కమిటీ చేపట్టింది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా అర్ధసంవత్సర ఆడిట్లను కొనసాగించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 9వ తేదీన జరగాల్సిన పోస్టు బడ్జెట్ సమావేశాన్ని 18వ తేదీకి వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ కూడా పాల్గొననున్నారు. ఆర్‌బీఐ గత డిసెంబర్‌లో బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆర్‌బీఐ వద్ద ఎంత వరకు మిగులు నిధులను ఉంచుకోవచ్చో లెక్కగట్టనుంది. ఈ నివేదిక ఏప్రిల్లో అందనుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఆర్‌బీఐ ప్రకటించే మధ్యంతర డెవిడెండ్ గతంలోని మిగులు నిధుల నిబంధనల ప్రకారమే చెల్లించనుంది.

టాటా ట్రస్ట్‌కు మినహాయింపు రద్దు చేసిన ఐటీ శాఖ

- నిబంధనలు పాటించకపోవడమే కారణం

TATA

TATA CONSULTANCY SERVICES

ముంబయి: దేశీయ కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్‌నకు సంబంధించిన సర్ దోరబ్‌జీ టాటా ట్రస్ట్‌కు ఐటీ శాఖ మినహాయింపును రద్దు చేసింది. డిసెంబర్ 31న తీసుకొన్న నిర్ణయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మినహాయింపులు పొందేందుకు పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించడంతో ఈ నిర్ణయం తీసుకొంది. ట్రస్ట్‌లోని ట్రస్టీ సభ్యుడు ఆర్. వెంకటరమణన్‌కు పరిహారం చెల్లింపు విషయంలో ఉల్లఘనలు చోటు చేసుకొన్నట్లు గుర్తించింది. ఐటీ చట్టంలో పేర్కొన్న మొత్తాన్ని మించి పరిహారం ఇచ్చినట్లు తెలిసింది. ఐటీశాఖ ఆదేశాలను టాటాలు సవాలు చేసినట్లు సమాచారం. టాటాలకు ఉన్న ట్రస్టుల్లో సర్ దోరబ్‌జీ టాటా ట్రస్ట్, రతన్‌టాటా ట్రస్ట్ అతిపెద్దవి. వీటి మొత్తం టాటా సన్స్‌లో దాదాపు 66 శాతం వాటా కలిగి ఉన్నాయి. టాటా గ్రూప్ మొత్తానికి టాటా సన్స్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. దోరబ్‌జీ టాటా ట్రస్ట్‌కు రతన్ టాటా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

జరిగింది ఇదీ..

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 11 కిందకు ట్రస్టు, ఇతర ధార్మిక సంస్థలకు సంబంధించిన మినహాయింపులను వస్తాయి. దీనికి సంబంధించి మినహాయింపులను పరిశీలించే అధికారం ఐటీశాఖ అధికారులకు ఉంటుంది. దోరబ్‌జీ టాటా ట్రస్ట్ బోర్డు సభ్యుడైన ఆర్. వెంకటరమణన్‌కు 201516 సంవత్సరానికి రూ.2.5 కోట్లు పరిహారంగా చెల్లించినట్లు గుర్తించింది. దీనిని అధికమొత్తంగా భావించింది. దీనిపై ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. అక్కడి నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో మినహాయింపును రద్దు చేసింది.



అనిల్ కంపెనీల షేర్లు డమాల్

- 27శాతం పడిన రిలయన్స్ ఇన్ఫ్రా

ముంబై: అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూపునకు చెందిన కీలకమైన కంపెనీల షేర్లు మార్కెట్‌లో ఘోరంగా పడిపోయాయి. ఈ వారం తొలి ట్రేడింగ్ సెషన్ నుంచి మొదలైన ఈ పతనం బుధవారం మరింత వేగవంతమైంది. ఒక దశలో ఆర్‌కామ్ షేరు ధర ముఖ విలువ రూ.5 కంటే దిగువకు చేరింది. నిన్న రిలయన్స్ ఇన్ఫ్రా దాదాపు 27శాతం పతనమైంది. ట్రేడింగ్ వాల్యూమ్ కూడా ఐదింతలు పెరగటం మదుపరులను ఆందోళనకు గురిచేసింది. దాదాపు 32.55 మిలియన్ల వాటాలు చేతులు మారాయి. ఈ మొత్తం కంపెనీలోని 12.6శాతంకు సమానం. ప్రమోటర్ల షేర్లు తనఖాలోకి వెళ్లడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది.

ముఖ విలువ కంటే దిగువకు..

ఒకప్పుడు టెలికాం రంగంలో ఒక వెలుగు వెలిగిన ఆర్‌కామ్ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ షేరు విలువ బుధవారం ఒక దశలో 11శాతం కుంగి రూ.4.85కు చేరింది. ఇది ముఖ విలువ కంటే తక్కువ. కేవలం మూడు ట్రేడింగ్ సెషన్లలోనే ఆర్‌కామ్ 58శాతం విలువ కోల్పోవడం విశేషం. దివాల ప్రక్రియకు సంబంధించి ఆర్‌కామ్ శుక్రవారం సాయంత్రం చేసిన ప్రకటనతో ఈ పరిస్థితి తలెత్తింది.

మిగిలిన షేర్ల పరిస్థితి..

రిలయన్స్ పవర్ 14శాతం పడిపోయి రూ.10.30కు చేరింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ 12శాతం కుంగి 31.55 వద్దకు, రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్ 11 శాతం కుంగి 7.75 మార్కును తాకాయి. అడాగ్ గ్రూప్‌లోని ఆరు లిస్టెడ్ కంపెనీలు కలిపి 2561శాతం వరకు విలువ కోల్పోయాయి. ఒక్క రిలయన్స్ నిప్పన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ పరిస్థితి మాత్రం కొంత ఫరవాలేదు.

వైఎల్‌జి 10వ వార్షికోత్సవ ఆఫర్స్

విజయక్రాంతి, హైదరాబాద్: బ్యూటీ అండ్ వెల్‌నెస్ బ్రాండ్‌లలో అగ్రగామిగా ఉన్న వైఎల్‌జి సలూన్స్ తన పదో వార్షికోత్సవం సందర్భంగా 100శాతం సేల్‌ను ప్రకటించింది. వైఎల్‌జి సేవలపై రూ.5,500 వరకు 100% క్యాష్ బ్యాక్‌ను అందిస్తోంది. అంతే కాకుండా వైఎల్‌జి ఉత్పాదనలన్నింటిపై కూడా వినియోగదారులకు 5%శాతం అదనపు డిస్కౌంట్‌ను అందిస్తోంది. వైఎల్‌జి సంస్థ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లలో సుమారు 62 సలూన్లను 5,00,000కు పైగా కస్టమర్లను కలిగి ఉంది.

స్పోర్ట్స్



అన్ని విభాగాల్లోనూ విఫలం

- చిన్న భాగస్వామ్యాలను నమోదు చేయలేక పోయాం
- అందుకే ఓటమి: రోహిత్ శర్మ

వెల్లింగ్టన్: తొలి టీ20 మ్యాచ్‌లో అన్ని విభాగాల్లోనూ పూర్తిగా విఫలమయ్యామని, అందుకే ఘోరంగా ఓడిపోయామని టీమిండియా కెప్టెన్ రోహిత్‌శర్మ పేర్కొన్నాడు. మేము ఏ క్రమంలోనూ లక్ష్యాన్ని చేధించే దిశగా పోరాడలేదని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లోనూ విఫలమయ్యామన్నాడు. భారీ లక్ష్యం చేదించే క్రమంలో వికెట్లు కోల్పోవడం, కనీసం చిన్నపాటి భాగస్వామ్యాలను కూడా నమోదు చేయలేక పోవడం మా ఓటమికి కారణం. గతంలో టీమిండియా భారీ లక్ష్యాలను సులువుగా చేదించిందని గుర్తు చేశాడు. అందులోనూ ఈ మ్యాచ్‌లో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్‌తో బరిలోకి దిగినా ఓడిపోవడం బాధించిందని అన్నారు. న్యూజిలాండ్ అద్భుతంగా ఆడిందని, అక్లాండ్‌లో జరగనున్న రెండో టీ20లో మంచి ప్రదర్శణ చేస్తామని చెప్పాడు. లక్ష్యం ఎంత అన్నది కాదు సాధించాలి, గెలవాలి అనకున్నామని కానీ సాధించలేకపోయాం అంటూ రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు



ఖతార్ ఓపెన్‌కి ఒసాకా దూరం

ఖతార్: వరల్డ్ నంబర్ వన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ జపాన్ సెన్సేషనల్ నవోమీ ఒసాకా ఖతార్ ఓపెన్ టోర్నీకి దూరమైంది. వచ్చేవారం నుంచి జరుగనున్న ఖతార్ ఓపెన్‌లో వెన్నెముక గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగినట్లు బుధవారం ప్రకటించింది. గత అక్టోబర్ నెలలో జరిగిన హాంకాంగ్ ఓపెన్ టోర్నీలో కూడా ఒసాకా పాల్గొనలేదు. ప్రస్తుతం ఒసాకా యుఎస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి వరల్డ్ నంబర్ వన్‌గా కొనసాగుతుంది. యుఎస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ వరుస టైటిల్స్ గెలిచి వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్‌సీడ్ సిమోన హాలెప్‌ను అధిగమించి టాప్ సీడ్‌ను సొంతం చేసుకుంది. గత సంవత్సరం ఖతార్ ఓపెన్ టైటిల్ విజేత పెట్రా క్విటోవాను ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌లో వరుస సెట్లలో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది.

తొలి టీ20లో భారత్ ఓటమి

- 80 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘనవిజయం
- చేతులెత్తేసిన భారత టాప్ ఆర్డర్
- విజృంభించిన సౌథీ, ఫెర్గూసన్, సాంట్‌నర్



వెల్లింగ్టన్: వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమిండియా జోరుకు బ్రేక్ పడింది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టీ20లో భారత టాప్ ఆర్డర్ చేతులెత్తేసింది. వన్డే సిరీస్‌ను 4–1 తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా తొలి టీ20లో ఘోరంగా 80 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా 1–0తో న్యూజిలాండ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. న్యూజిలాండ్ జట్టు అధ్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు ఓపెనర్లు టీమిండియా బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (84: 43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తో చెలరేగాడు. సీఫెర్ట్‌కు తోడు మరో ఓపెనర్ కొలిన్ మన్రో (34: 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) తో జట్టుకు శుభారంభాన్ని అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 34 పరుగుల వద్ద కృనాల్ పాండ్య బౌలింగ్‌లో మన్రో ఔటయ్యాడు. అనంతరం వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ సీఫెర్ట్‌కు జతయ్యాడు.





వీరిద్దరూ భారత బౌలర్లపై పంజా ఝులిపించారు. ఈ దశలో సీఫెర్ట్ తన అర్ధశతకాన్ని నమోదు చేశాడు. 84 పరుగుల చేసిన సీఫెర్ట్ ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తరువాత మిచెల్ 8 పరుగులు చేసి పాండ్య బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరాడు. రాస్ టేలర్ 14 బంతుల్లో 23 పరుగులతో టీమిండియా బౌలర్లను చెండాడాడు. చివరలో స్కాట్ కుగ్లీన్ విజృంభించడంతో 7 బంతుల్లో 20 పరుగులతో జట్టు 219 పరుగుల భారీ స్కోరు చేసింది. భారత బౌలర్లలో హార్ధిక్ పాండ్య 2 వికెట్లు పడగొట్టగా, భువనేశ్వర్, ఖలీల్, చాహల్, కృనాల్ పాండ్యలు తలో వికెట్ సాధించారు. అనంతరం 219 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. 2 ఓవర్ 2 బంతికే సౌథీ బౌలింగ్‌లో టీమిండియా సారథి రోహిత్‌శర్మ (1) ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన విజయ్ శంకర్ ధావన్‌కు చక్కని సహకారం అందించాడు. ఒకవైపు శిఖర్ ధావన్ ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. అడపాదడపా షాట్లతో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18 బంతుల్లో 29 పరుగులు చేసి ఫెర్గూసన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో 51 పరుగులకు రెండో వికెట్‌ను కోల్పోయింది. యువ క్రికెటర్ రిషబ్‌పంత్ 4 పరుగులతో నిరాశపర్చాడు. 8వ ఓవర్‌లో సాంథర్న్ బౌలింగ్‌లో రిషబ్‌పంత్, విజయ్ శంకర్‌లు ఔటవ్వడంతో రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఒకవైపు ధోనీ ఒంటరి పోరాటంతో 31 బంతుల్లో 39 పరుగులు చేయగా మరోవైపు సోథీ వేసిన పదో ఓవర్‌లో రెండు బంతుల తేడాతో దినేష్ కార్తీక్, హార్ధిక్ పాండ్యలు ఔటవ్వడంతో టీమిండియా 11 ఓవర్లు ముగిసే సమయానికి 77 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. చివరిలో కృనాల్ పాండ్య 18 బంతుల్లో 20 పరుగులతో ఒంటరిపోరు సాగించాడు. మరోవైపు వరుస ఓవర్లలో ఏడు పరుగుల తేడాతో చివరి మూడు వికెట్లు కోల్పోయి 139 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ బౌలర్లలో టిమ్ సౌథీ మూడు వికెట్లు, ఫెర్గుసన్, సాంట్‌నర్, ఇష్ సోథీలు తలో రెండు వికెట్లు పడగొట్టగా మిచెల్‌కు ఒక్క వికెట్ దక్కింది.

మహిళలకూ తప్పలేదు..



- టీ20లో భారత్ ఓటమి

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మహిళల టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఓటమి పాలైంది. వెల్లింగ్టన్ వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలుత టాస్ ఓడిపోయి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ మహిళల జట్టు 4 వికెట్లు కోల్పోయి 160 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. న్యూజిలాండ్ జట్టులో ఓపెనర్ షాఫీ డేవైన్ (62: 48 బంతుల్లో 6x4, 2x6) అర్ధశతకంతో మెరవగా ఆమీ సెటర్‌వైట్ (33: 27 బంతుల్లో 4x4), కెట్టీ మార్టిన్ (27: 14 బంతుల్లో 1x4, 2x6) లు ఆఖర్లో బ్యాట్ ఝళిపించారు. న్యూజిలాండ్ బ్యాట్స్ ఉమెన్ దూకుడుగా ఆడటంతో భారత మహిళా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. భారత మహిళా బౌలర్లలో అరుంధతిరెడ్డి , రాధ యాదవ్ , పూనమ్ యాదవ్ , దీప్తి శర్మలు తలో వికెట్ పడగొట్టారు. అనంతరం ఛేదనకు దిగిన భారత మహిళల జట్టు ఆదిలోనే తడబడింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ప్రియా పునియా ఔటయ్యింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జెమిమా రొడ్రిగ్స్ తో కలిసి ఓపెనర్ స్మృతి మంధాన ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఈ క్రమంలో స్మృతి అర్ధ శతకం నమోదుచేసింది. అయితే 12వ ఓవర్‌లో స్మృతి, 13వ ఓవర్‌లో జెమిమా ఔట్ అవడంతో భారత జట్టు కష్టాల్లో పడింది. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్ ఉమెన్ ఎక్కువ సేపు కుదురుకోలేకపోయారు. మిడిల్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. దీంతో ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే భారత జట్టు 136 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వచ్చింది.

ఫ్యూచర్ కబడ్డీ హీరోస్ మూడో ఎడిషన్ ప్రారంభం

ముంబై: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులలో ప్రతిభను గుర్తించడం, అభివృద్ధిని ప్రధాన ధ్యేయంగా మశాల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ కబడ్డీ హీరోస్ మూడవ ఎడిషన్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లలో సమగ్ర ప్రతిభాన్వేషణ, ఆటలో ప్రతిభ కనబర్చిన కబడ్డీ ఆటగాళ్లకు వివో ప్రొ కబడ్డీ లీగ్‌లో అవకాశం కలిగించి వారిని ప్రోత్సహించేదిశగా మశాల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆటగాళ్లకు చేయూత నిస్తోంది. ఈ కార్యక్రమాన్ని మూడు దశలుగా విభజించి 11 నగరాల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో ముంబై, న్యూఢిల్లీ, లక్నో, నాగపూర్, గౌహతి, బెంగళూరు, జైపూర్ నగరాలలో జూనియర్ నేషనల్స్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ నగరాల్లో గతంలో నిర్వహించిన స్థానిక టోర్నమెంట్లలో కబడ్డీ ఆటలో ప్రతిభావంత ఆటగాళ్లను గుర్తించి ప్రొ కబడ్డీ లీగ్ వంటి టోర్నమెంట్లలో అవకాశం కల్పిస్తోంది. గత సంవత్సరం జరిగిన ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 3420 మంది అభ్యర్థుల నుంచి ప్రతిస్పందన లభించగా అందులో 85 మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు ప్రొ కబడ్డీ 2018 టోర్నీలో వేలానికి అర్హత సాధించారు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.